పేదల పెద్దాసుపత్రి అయిన జీజీహెచ్‌లో ఎవరి దారి వారిదే అన్నట్లుగా వ్యవహారం తయారైంది. సూపర్ స్పెషాలిటీ సేవలందించాల్సిన వైద్యులు వారంలో ఒకట్రెండ్రోజులు మాత్రమే కనిపిస్తున్నారు. ఆ సమయంలోనూ మొక్కుబడి వైద్యానికి పరిమితమవుతున్నారు. అత్యవసర సేవలు అంతంతమాత్రమే. పైగా ఆసుపత్రి కీలక అధికారి అయిన సూపరింటెండెంట్ విధుల్లో చేరి ఆరు నెలలు అయినా నేటికీ ఒక్కరోజు కూడా రోగులు ఉండే వార్డులో అడుగుపెట్టలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక వైద్యసిబ్బంది సంగతి సరేసరి. దీంతో రోగాలతో రొప్పుతూ వచ్చే బాధితులకు ఇక్కడ మెరుగైన వైద్యానికి భరోసా కరువైంది. స్వయంగా కలెక్టర్ రాత్రివేళ వచ్చి తనిఖీలు చేసి హెచ్చరించినా ఎటువంటి మార్పులేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





చికిత్స ఏదీ?

విధులకు రారు.. నాడి పట్టరు..

- ఆరు నెలలుగా వార్డుల ముఖం చూడని ఆస్పత్రి సూపరింటెండెంట్
- అందుబాటులో ఉండని వైద్యులు
- రోగుల స్పెషల్ రూముల్లో సిబ్బంది రెస్ట్
- కలెక్టర్ హెచ్చరించినా మారని తీరు
- జీజీహెచ్‌లో ఇష్టారాజ్యంగా వ్యవహారం

ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్యం గగనంగా మారింది. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో వైద్యులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎక్కువ మంది డాక్టర్లు బయట ప్రైవేటు ఆస్పత్రుల్లో సేవలందిస్తూ ఇక్కడ మాత్రం తూతూమంత్రంగా పనిచేస్తున్నారు. ఒకపక్క జీజీహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించాలని ప్రభుత్వం చూస్తుండగా, ఇక్కడ మాత్రం వైద్యులు మొక్కుబడి సేవలకు పరిమితమవుతున్నారు. క్యాన్సర్, న్యూరాలజీ, న్యూరోసర్జన్, గుండె, నెఫ్రాలజీ, ఇతర సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలకు సంబంధించి శస్త్ర చికిత్సలు కూడా కరువయ్యాయి. వారంలో ఒకట్రెండ్రోజులు మాత్రమే విధుల్లో కనిపించే వైద్యులు శస్త్ర చికిత్సలకు బయట ఆసుపత్రులకు సిఫారసు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మిగిలిన రోజుల్లో వారు విధులకు డుమ్మా కొడుతుండటంతో ఆ కొద్ది సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు కూడా పేదలకు దూరమవు తున్నాయి. అయితే వారంలో ఎన్ని ఆపరేషన్‌లు జరుగుతున్నాయి.. ఎంతమంది స్పెషాలిటీ వైద్యసేవలకు వస్తున్నారో కూడా కనీస సమాచారం లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కలెక్టర్ వచ్చారు.. కానీ అసలు అధికారి రారు..

జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగుల బాగోగులను తెలుసుకునేందుకు ఎంత బిజీలో ఉన్నప్పటికీ కలెక్టర్ తీరిక చేసుకుని మరీ ఆసుపత్రికి వచ్చి పరిశీలించారు. వార్డుల్లో తనిఖీలు చేశారు. సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఆసుపత్రిలో

మిగతా 4వ పేజీలో

సహకార బ్యాంకుపై సభాసంఘం

ఇప్పటికే త్రిసభ్య కమిటీ విచారణలో పలు అక్రమాలు గుర్తింపు

- తాజాగా అసెంబ్లీలో విస్తృత చర్చ
- సభాసంఘంతో విచారణ చేయాలని తీర్మానం
- ఆందోళన చెందుతున్న అక్రమార్కులు



ఒంగోలు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రకాశం జిల్లా సహకార కేంద్ర (పీడీసీసీ) బ్యాంకులో భారీగా అవినీతి, అక్రమాలు జరిగాయి. నాటి వైసీపీ పాలకవర్గాలు.. వారి సహకారంతో పలు ప్రాంతాల ఆ పార్టీ నేతలు, బ్యాంకు పరిధిలోని కొందరు అధికారులు, ఉద్యోగులు అడ్డగోలుగా వ్యవహరించి దోచేశారు. ఇలాంటి పరిస్థితి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉన్నట్లు ప్రస్తుత ప్రభుత్వం గుర్తించింది. వాటిని వెలికితీయాలని నిర్ణయించింది. అందుకు సంబంధించి తాజాగా అసెంబ్లీ సమావేశాలలో పెద్దఎత్తున చర్చ జరగ్గా అక్రమాలను నిగ్గు తేల్చేందుకు ఏకంగా శాసనసభా సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఆ మేరకు అసెంబ్లీ సమావేశాల ముగింపు రోజైన గురువారం సభలో తీర్మానం చేశారు. డీసీసీబీపై ఇప్పటికే త్రిసభ్య కమిటీ చేసిన విచారణలో అనేక అక్రమాలు, అవకతవకలు, వెలుగుచూశాయి. వాటిపై సమగ్రంగా విచారణ చేసి బాధ్యులపై చర్యలకు 51 విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఆ విచారణ ప్రారంభం కాకముందే సభా సంఘం ఏర్పాటుతో డీసీసీబీలో

మిగతా 4వ పేజీలో

త్రిసభ్య కమిటీ విచారణ

బ్యాంకులో అక్రమాలపై ప్రస్తుత ప్రభుత్వానికి అందిన ఫిర్యాదుతో విచారణ చేయాలని కలెక్టర్ అన్సారియాను ఆదేశించగా నాలుగు నెలల క్రితం డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో త్రిసభ్య కమిటీతో విచారణ చేయించారు. అందులో బిల్డింగ్‌ల మరమ్మతులు, కార్యాలయ నిర్వహణ, న్యాయవాదులకు ఫీజుల చెల్లింపు, జగనన్న పాలవెల్లువ రుణాలలో బోగస్‌లు, కొందరు ఉద్యోగులు బ్యాంకు డబ్బును అక్రమంగా వాడుకోవడం, ఉద్యోగుల పదోన్నతులు, బదిలీల్లో అక్రమాలు, కంప్యూటరీకరణలో అవినీతి ఇలా అనేక అంశాలను గుర్తించారు. దీంతో 51 విచారణ చేయాలని కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించగా సంబంధిత అధికారి నియామకంలో కొంత జాప్యం జరిగి అది ప్రారంభం కాలేదు.

దర్శి డీఎస్పీకి ఉత్తమ సేవా పతకం

లక్ష్మీనారాయణకు ఉగాదికి అందజేత

ఇద్దరేసి ఏఆర్ ఎస్సైలు, మహిళా ఏఎస్సైలు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, ఫైర్ ఆఫీసర్ కూడా ఎంపిక



లక్ష్మీనారాయణ

వివరాలు మెయిన్‌లో..



అధికారులతో కలిసి బయోగ్యాస్‌కు కేటాయించిన భూమిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

2న బయోగ్యాస్ ప్లాంట్‌కు భూమిపూజ

- మంత్రి లోకేష్, అనంత్ అంబానీ రాక
- అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే ఉగ్ర

పీసీపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి వచ్చే నెల 2వ తేదీన భూమి పూజ చేయనున్న దృష్ట్యా అందుకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని శాసనసభ్యుడు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సూచించారు. రిలయన్స్ ప్రతినిధులతోపాటు విద్యుత్, పంచాయతీరాజ్ అధికారులు, డీఎస్పీతో కలిసి శుక్రవారం ఆ ప్లాంట్ కోసం వెంగళాయపల్లి పంచాయతీ పరిధిలో కేటాయించిన భూమిని ఎమ్మెల్యే పరిశీలించారు. రెవెన్యూ అధికారులు భూమి వివరాల మ్యాప్‌ను ఎమ్మెల్యేకు చూపిస్తూ వివరించారు. అనంతరం ఎమ్మెల్యే అధికారులకు పలు సూచనలు చేశారు. భూమిలో పెద్దగా ఉన్న వేపచెట్లను తొలగించవద్దని సూచించారు. అలాగే దివాకరపల్లి నుంచి నిర్దేశిత స్థలం వరకు విశాలంగా రోడ్డును ఏర్పాటు చేయాలని పంచాయతీరాజ్ అధికారులకు చెప్పారు. భూమిపూజ అనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు లోకేష్, గొట్టిపాటి రవికుమార్, స్వామి, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ తనయుడు అనంత్ అంబా నీ, ఎమ్మెల్యేలు, రాష్ట్రస్థాయి అధికారులు హాజరవుతారని

మిగతా 4వ పేజీలో



వడ్ల నుంచి గింజలను వేరు చేస్తున్న మహిళా భక్తులు

రాములోరి కల్యాణానికి చీరాల తలంబ్రాలు

- 3వ తేదీకి భద్రాచలం చేరనున్న అక్షితలు
- 6వ తేదీ శ్రీరామ నవమికి వినియోగం

వివరాలు 5వ పేజీలో..

మెడికల్ మాఫియా

- ఫార్మసిస్టులు లేరు, బిల్లులు ఇవ్వరు
- డాక్టర్ల సిఫార్సు లేకుండానే విక్రయాలు
- మెడికల్ షాపులలో ఇదీ పరిస్థితి
- జిల్లాలోని నాలుగు ప్రాంతాల్లో విజిలెన్స్ తనిఖీలు

ఒంగోలుక్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ప్రాణాలతో మెడికల్ మాఫియా చెలగాటం ఆడుతోంది. నిబంధనలను ఉల్లంఘించి షాపులలో ఇష్టారాజ్యంగా మందు బిళ్లల నుంచి ఇంజెక్షన్లు వరకూ విక్రయిస్తున్నారు. కాలం చెల్లిన మందులు సైతం దుకాణాలలో దర్శనమిస్తున్నాయి. డాక్టర్ సిఫార్సులు లేకుండా మందులు అమ్ముతున్నారు. ఈ విషయం శుక్రవారం విజిలెన్స్ అధికారులు నిర్వహించిన తనిఖీలలో బయటపడింది. రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ షాపులపై విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. అందులోభాగంగా జిల్లాలోని మార్కాపురం, ఒంగోలు, కంభం, టంగుటూరులలో 10 మెడికల్ షాపులలో తనిఖీలు నిర్వహించారు. అనేక ఉల్లంఘనలకు మెడికల్ షాపుల యజమానులు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఫార్మసిస్టులు లేకుండా మందులు విక్రయించడమే కాకుండా ఎవరికీ బిల్లులు ఇవ్వడం లేదు. అదేవిధంగా కాలం చెల్లిన మందులు ప్రత్యేకమైన పెట్టెలలో ఉంచాలి. అయితే అలాంటివి అనేకం మామూలు మందులతోపాటే ఉండటం మెడికల్ షాపులలో కనిపించింది. ఇంజెక్షన్లు ఫ్రీజర్‌లో ఉంచకుండానే విక్రయిస్తున్నారు. ఒక మెడికల్ షాపులో అయితే అసలు రికార్డులే నిర్వహించడం లేదు.

పది దుకాణాలలో తనిఖీలు

జిల్లాలో మూడు విజిలెన్స్ బృందాలు నాలుగు ప్రాంతాల్లో తనిఖీలు చేశాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు, డ్రగ్స్ అధికారులు, కమర్షియల్

మిగతా 4వ పేజీలో



ఒంగోలులోని ఓ దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు



బెట్టింగ్ రాయుళ్లపై కఠిన చర్యలు

- ప్రత్యేక బృందాలతో నిఘా
- ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఏఆర్.దామోదర్ హెచ్చరించారు. యువత బెట్టింగ్‌లు వేసి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఐపీఎల్ మ్యాచ్‌లు ప్రారంభమవుతున్న సందర్భంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులపై నిఘా ఉంచామని తెలిపారు. బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆ ముఠాల ఆట కట్టించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొందరు బెట్టింగ్ యాప్‌ల పట్ల ఆకర్షితులై కుటుంబాలను వీధిన పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఎక్కడైనా బెట్టింగ్ జరుగుతున్నట్లు సమాచారం ఉంటే 100, 112 నంబర్లకు కాల్ చేయాలన్నారు. అలాగే 9121102266 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం

కూటమి ప్రభుత్వం రాకతో పలు పథకాల పనులు పునఃప్రారంభం

దర్శి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు మోక్షం లభిస్తోంది. పలు పపనులు పునఃప్రారంభమయ్యాయి. మరికొన్నింటికి త్వరలో నిధులు విడుదల కాబోతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరి, అసమర్థతతో పథకాలన్నీ అర్ధంతరంగా నిలిచిపోయాయి. అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గత టీడీపీ హయాంలో ప్రారంభించి నిలిచిపోయిన పథకాలను పునఃప్రారంభిస్తోంది. కొత్తవాటికి శ్రీకారం చుట్టింది.

● దర్శి పట్టణంలోని తూర్పుగంగవరం రోడ్డులో గత వైసీపీ పాలనలో ప్రారంభించి నిలిచిపోయిన టీటీడీ కల్యాణ మండపం పనులు శరవేగంతో జరుగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి శంకుస్థాపన చేశారేగాని పనులు మాత్రం ప్రారంభంకాలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కృషితో రూ.2 కోట్లు విడుదలయ్యాయి. ప్రస్తుతం ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి.

● తాళ్లూరు మండలం గుంటిగంగ సమీపంలో ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న మొగిలిగుండాల రిజర్వాయర్ పనులను పునఃప్రారంభించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ రిజర్వాయర్ నిర్మాణానికి అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు శంకుస్థాపన చేశారు. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కక్షసాధింపుతో టెండర్లను రద్దుచేసింది. 2021లో మళ్లీ అట్టహాసంగా శంకుస్థాపన చేసింది. పనులు మాత్రం జరగలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకాన్ని పునఃప్రారంభించారు. ప్రస్తుతం పనులు



దర్శిలో జరుగుతున్న టీటీడీ కల్యాణ మండపం పనులు

మిగతా 4వ పేజీలో

జిల్లాలో 9,500 సేద్యపు నీటి కుంటల నిర్మాణం
డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ - మెయిన్‌లో..

వెబ్‌సైట్‌లో స్పాట్ సీనియారిటీ జాబితాలు
- రేపటి వరకు అభ్యంతరాల స్వీకరణ
- డీఈవో కిరణ్‌కుమార్

4

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6.26 (శనివారం సాయంత్రం)
సహర్: 4.52 (ఆదివారం ఉదయం)

చికిత్స ఏదీ?

(3వ పేజీ తరువాయి)

కీలక అధికారి, రోగులకు మెరుగైన సేవలు, ఇతర సమస్యలపై దృష్టిసారించాల్సిన జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.జమున మాత్రం బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఒక్కరోజు కూడా వార్డుల్లో పర్యటించలేదని సమాచారం. ఆ విషయాన్ని అక్కడి రోగులే కాదు, సిబ్బంది సైతం చెబుతున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో తిరుపతి నుంచి వచ్చిన ఆమె ఒంగోలు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు తీసుకున్నారు. తిరుపతిలో నివాసం ఉంటున్న ఆమె.. వారంలో మూడు రోజులు ఒంగోలులో, మూడు రోజులు తిరుపతిలో ఉంటారనేది అందరికీ తెలిసిన విషయం. అంతేకాకుండా ఇక్కడ ఉన్న మూడు రోజులు చాంబర్‌కే పరిమితమై ఉంటారని తెలిసింది. కనీసం రోగులకు వైద్యసేవలు ఎలా అందుతున్నాయా? ఏమైనా సమస్యలు ఉన్నాయా? ఉద్యోగుల అవసరాలు.. ఇవేమీ ఆమెకు పట్టవని సిబ్బంది బహిరంగంగానే విమర్శిస్తున్నారు. వైద్యారోగ్య శాఖ అధికారుల నిర్వహించే వీడియో, టెలీకాన్ఫరెన్స్‌ల హాజరుకు పరిమితం అవుతున్నారని సమాచారం. అత్యధికశాతం మంది నర్సింగ్ స్టాఫ్‌కు సూపరింటెండెంట్ ఎలా ఉంటారో కూడా తెలియదంటే ఆశ్చర్యపోవాల్సిన విషయం. అలాంటిది ఇక రోగుల బాగుగోలు ఆ అధికారికి ఎలా గుర్తుకు వస్తాయనేది ఇప్పుడు జీజీహెచ్‌లో చర్చనీయాంశం.

సిబ్బంది విశ్రాంతి గదులుగా స్పెషల్ రూంలు

జీజీహెచ్‌లో నామమాత్రపు రుసుంతో రోగుల కోసం కేటాయించిన స్పెషల్ రూంలు సిబ్బంది విశ్రాంతి గదులుగా మారాయి. ఆదాయ వనరులు సమకూర్చే ఈ రూంలు రోగులడిగితే ఖాళీ లేవు అని సమాధానం వినిపిస్తోంది. వాటి తాళాలు మాత్రం డాక్టర్లు, నర్సుల చేతుల్లో ఉంటున్నాయి. కొన్ని స్పెషల్ రూంలు నర్సింగ్ విద్యార్థుల వసతి కోసం కేటాయించగా, మరికొన్ని డాక్టర్లు, నర్సుల స్వాధీనంలో ఉన్నాయి. డ్యూటీ సమయాల్లో రోగుల సేవల్లో ఉండాల్సిన వీరు స్పెషల్ రూంలలో విశ్రాంతి తీసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదేవిషయాన్ని ఆసుపత్రిలోని కొందరు వైద్యాధికారులు సైతం వెల్లడిస్తున్నారు. రోగుల పట్ల కనీసం కనికరం కూడా చూపని వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పనితీరుపై పదేపదే విమర్శలు వినిపిస్తున్నాయి. పర్యవేక్షణాధికారిగా ఉన్న సూపరింటెండెంట్ మాత్రం ఇవేమీ తనకు పట్టదన్నట్లు వ్యవహరించడంతో ఇక జీజీహెచ్‌లో ఎవరి దారి వారిదే అన్నట్లుగా తయారైంది. అయితే జీజీహెచ్‌లో రోగుల జబ్బుకు వైద్యం పక్కనపెడితే వైద్యులు, వైద్యసిబ్బందికే తగిన చికిత్స అవసరం ఉందన్న అభిప్రాయం పలువురు వ్యక్తం చేస్తున్నారు.

కొంత మంది సూపర్ స్పెషాలిటీ వైద్యులు నాకే తెలియదు

జీజీహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. అయితే వారు సూపరింటెండెంట్ పరిధిలో పనిచేసినా సెలవులు, ప్రమోషన్లు, ఇతరత్రా రిమ్స్ ప్రిన్సిపాల్ పరిధిలో ఉంటాయి. చాలామంది స్పెషలిస్ట్ డాక్టర్లు ఎవరో పేర్లు కూడా నాకు తెలియదు. ప్రస్తుతం ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు లేరు. అలాగే కార్డియోసర్జన్ ఉన్నప్పటికీ సరైన సౌకర్యాలు లేనందున సేవలు అందుబాటులోకి రావడం లేదు. సమస్యలపై డీఎంఈకి లేఖ రాశాం. ఒక్కో సమస్యను పరిష్కరించుకుంటూ మెరుగైన సేవలు అందిస్తాము.

- డాక్టర్ టి.జమున, జీజీహెచ్ సూపరింటెండెంట్





నాడు పచ్చని తోరణం.. నేడు ఎండిన మోడు

ప్రకృతిసోయగాలకు పెట్టింది పేరు నల్లమల. ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు పచ్చని శోభతో ఆహ్లాదం పంచింది. పర్యావరణ ప్రేమికులను కట్టిపడేసింది. పది కాలాల పాటు మదిలో పదిలపర్చుకునే ప్రయాణాన్ని అందించింది. అదే ఆరు నెలలు నిండే సరికి రుతువులు మారాయి. నల్లమలలోని ప్రతి చెట్టూ ఆకులు రాల్చింది. అందాన్ని కోల్పోయింది. నేడు మోడుగా దర్శనమిస్తోంది. - పెద్దదోర్నాల, ఆంధ్రజ్యోతి

మాతృమరణాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి

● డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతృ మరణాలను నిరోధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఒంగోలులోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం మాతృమరణాలు సంభవించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు అనీమియా, అధికరక్తపోటు, మధుమేహం, ఎపిలెప్సీ, ప్రసవ పూర్వ రక్తస్రావంతో బాధపడుతున్న గర్భిణులను గుర్తించాలన్నారు. తద్వారా మాతృమరణాలను నివారించేందుకు దోహదపడుతుందని తెలిపారు. ప్రతి గర్భిణి నెలకు రెండు పర్యాయాలు ఈసీజీ పరీక్షలను ఎఫ్‌డీపీ కార్యక్రమం ద్వారా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారాన్ని తీసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. జిల్లాలో మాతృమరణాలు సంభవిస్తే అందుకు కారకులైన వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయకర్త డాక్టర్ సూరిబాబు మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా వైద్యశాలలు, సర్వజన ఆస్పత్రికి గర్భిణులను పంపినప్పుడు వారికి అందాల్సిన అన్ని రకాల సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సర్వజన ఆస్పత్రి గర్భకోశ వ్యాధుల వైద్యనిపుణులు డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ ప్రమాద సంకేతాలు ఉన్న గర్భిణులను ఏడవ నెల నుంచి అన్ని రకాల రక్తపరీక్షలు చేయడం ద్వారా మాతృమరణాలను తగ్గించవచ్చని తెలిపారు. సమావేశంలో జిల్లా టీకాల అధికారి డాక్టర్ పద్మజ, డాక్టర్ అనంతకుమారి, డాక్టర్ ప్రియదర్శిని, డీపీహెచ్ఎన్‌వో సుగుణమ్మ, మాస్‌మీడియా అధికారి డి.శ్రీనివాసులు, అర్ధవీడు ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి జవహర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు



మంగమ్మ కాలేజీ దగ్గర జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, కమిషనర్ వెంకటేశ్వరరావు

అర్ధరాత్రి నగరంలో దామచర్ల పర్యటన

ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఒంగోలు శాసనసభ్యులు అర్ధరాత్రి నగరంలో పర్యటించారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలించిన దామచర్ల... కమిషనర్ వెంకటేశ్వరరావును అడిగి వివరాలు తెలుసుకున్నారు. స్థానిక గుంటూరు రోడ్‌లోని మంగమ్మ కాలేజీ జంక్షన్ వద్ద సర్కిల్ అభివృద్ధిపై చర్చించారు. ఈ ప్రాంతంలో సర్కిల్ అభివృద్ధి చేయడంతోపాటు, అక్కడ భారీ ఏనుగు బొమ్మలను ఏర్పాటు చేసి, నగరానికి స్వాగతం పలికేలా, నగర అందాలను తెలియజేసేలా అభివృద్ధి చేయాలని దామచర్ల సూచించారు. ఉప్పు సత్యాగ్రహంలో మహాత్మ గాంధీజీ ఉద్యమ స్ఫూర్తిని తెలియజేస్తూ, విజయవాడ వంటి మహానగరం తరహాలో బొమ్మలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నగరాన్ని అందంగా తీర్చిదిద్దాలని కమిషనరు వెంకటేశ్వరరావును ఆదేశించారు.

మీ అంతు చూస్తా..!

● పోలీసులకు సిట్ కేసుల్లో నిందితుడి వార్నింగ్

● అర్ధరాత్రి స్టేషన్‌లో వీరంగం

ఒంగోలు క్రైం, మార్చి21 (ఆంధ్రజ్యోతి): భూవివాదాలకు సూత్రధారి అయిన ఓ వ్యక్తి ఏకంగా పోలీసులకు వార్నింగ్ ఇచ్చాడు. అర్ధరాత్రి పోలీసుస్టేషన్‌లో హల్‌చల్ చేశాడు. తనకు ఎదురు తిరిగిన వ్యక్తిని ఎందుకు పోలీసులు వెనుకేసుకు వస్తున్నారంటూ వీరంగం సృష్టించాడు. అయినా పోలీసులు మిన్నకుండి పోయారు. నగరంలోని అనేక భూ వివాదాలకు కారణం అయిన వ్యక్తి, సిట్ కేసులలో నిందితుడు పోలీసులకు వార్నింగ్ ఇవ్వడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. గురువారం అర్ధరాత్రి ఒంగోలు వన్‌టౌన్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన చర్చనీయాశంగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో అతను చేసిన భూ కబ్జాలకు అంతు లేదు. ఏకంగా మండవారిపాలెంలో మహానాడు జరిగిన భూములకు నకిలీ పత్రాలు సృష్టించి స్వాహా చేయాలని ప్రయత్నించాడు. నిన్న మొన్నటి వరకు కేసుల భయంతో తలదాచుకున్నాడు. అయినా అతనికి పోలీసు శాఖలో ఉన్న పరపతితో బతికి బయటపడ్డాడు. అదే హవా మరలా సాగించడం విమర్శలకు తావిస్తోంది. తన ఇంటి వద్ద ఉన్న వివాదం విషయలో పోలీసుస్టేషన్‌కు వచ్చాడు. తనకు వ్యతిరేకంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆరోపించాడు. అంతేకాదు ఒక్కొక్కడి అంతు చూస్తా అంటూ వీరంగం చేశాడు. అయినా పోలీసులు అతని నిలవరించలేకపోయారు.

మెడికల్ మాఫియా

(3వ పేజీ తరువాయి)

ట్యాక్స్ అధికారులు, ఈగల్ టీమ్ ఈ తనిఖీలలో పాల్గొన్నాయి. ఒంగోలులో 5, మార్కాపురంలో 2, కంభంలో 2, టంగుటూరులో ఒక మెడికల్ షాపును పరిశీలించాయి. అందులో తొమ్మిది దుకాణాలలో నిబంధనలు పాటించడం లేదని గుర్తించాయి. ముఖ్యంగా డాక్టర్ల సిఫార్సు లేకుండా హెచ్1 డ్రగ్స్ విక్రయిస్తున్నారు. అదేక్రమంలో కాలం చెల్లిన మందులు వేరుగా ఉంచడం లేదు. నిబంధనల ప్రకారం దుకాణాలలో ఫార్మాసిస్టు ఉండి మందులు విక్రయించాలి. అయితే కేవలం ఫార్మాసిస్టు సర్టిఫికెట్‌తో లైసెన్సులు పొంది ఎలాంటి డాక్టర్ల సిఫార్సులు లేకుండా మందులు విక్రయించడం చట్టవిరుద్ధం. అయితే డాక్టర్ చీటీలు లేకుండా విక్రాయాలు చేస్తున్నట్లు తనిఖీలలో అధికారులు గుర్తించారు. నిబంధనల ఉల్లంఘనలపై సంబంధిత యజమానులకు నోటీసులు జారీచేయనున్నారు.

మూడు బృందాలు తనిఖీ

రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కొల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో మూడు బృందాలు నాలుగు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాయి. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్‌లు రాఘవరావు, రవిబాబు, ఎస్ఐ నాగేశ్వరరావు, డ్రగ్స్ కంట్రోల్ ఏడీ జ్యోతి, ఇన్‌స్పెక్టర్లు విజయలక్ష్మి, సంధ్య, ఉషారాణి, డీసీటీవో రామారావు, స్పెషల్ బ్రాంచ్ అధికారులు, ఈగల్ టీమ్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకుపై సభాసంఘం

(3వ పేజీ తరువాయి)

అక్రమాలకు పాల్పడిన వారిలో ఆందోళన కనిపిస్తోంది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో ఉమ్మడి జిల్లాలో 173 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు(పీఏసీఎస్)లు ఉన్నాయి. వాటి పరిధిలో రెండున్నర లక్షల మందికిపైగా రైతులు, మరికొంత మంది ఇతరవర్గాల వారికి 33 బ్రాంచిల ద్వారా సేవలు అందుతున్నాయి. మొత్తం సుమారు రూ.300కోట్ల డిపాజిట్లు ఉండగా ఏటా రెండున్నర వేల కోట్ల లావాదేవీలతో బ్యాంకు నడుస్తోంది. అయితే రుణాలు మంజూరు, వసూళ్లు, బ్యాంకు నిర్వహణ తదితర అంశాల్లో భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు. అధికారిక సమాచారం ప్రకారం జిల్లా బ్యాంకు పరిధిలో స్వయం సహాయక సంఘాలకు, జాయింట్ లైబిటీ గ్రూపుల (జేఎల్ఎస్)కు ఇచ్చిన రుణాల్లోనే దాదాపు రూ.150 కోట్ల వరకు బోగస్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక జగనన్న పాల వెల్లువ, ఇతర పథకాల రుణాలలో కోట్లాది రూపాయాల మేర ఇలా జరిగినట్లు సమాచారం. ఉప్పుగుండూరు ప్రాంతంలో బోగస్ రైతుల పేరుతో కోట్ల రూపాయల రుణాలను కొందరు స్వాహా చేయగా సరైన ఆధారాలు లేవంటూ సహకారశాఖ అధికారులు ఆ కేసును మూసేశారు.

అసెంబ్లీ సమావేశాల్లో చర్చ

ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలోని డీసీసీబీలలో అక్రమాలపై పెద్ద చర్చ సాగింది. అందులో పీడీసీబీలో జరిగిన అక్రమాలను కూడా పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇతర జిల్లాల్లోనూ ఇదే పరిస్థితులు ఉన్నట్లు పలువురు ఎమ్మెల్యేలు ప్రస్తావిస్తూ శాఖపరంగా కాకుండా ఉన్నత స్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తదనుగుణంగా గురువారం సభాసంఘం ఏర్పాటు చేస్తూ తీర్మానించింది. అందులో సభ్యులు ఎవరెవరు అన్నది త్వరలో తెలియనుంది. ఆ సంఘం విచారణలో అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం

(3వ పేజీ తరువాయి)

ముమ్మరంగా జరుగుతున్నాయి. దొనకొండలో సోలార్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పారిశ్రామిక కారిడార్ అభివృద్ధిలో కదలిక ప్రారంభమైంది. దర్శిలో నిలిచిపోయిన జాతీయస్థాయి డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని సీఎం చంద్రబాబు కొద్దిరోజుల క్రితం హామీ ఇచ్చిన విషయం విదితమే. దర్శిలో త్వరలో అన్న క్యాంటీన్ ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నారు. గతంలో నిలిచిపోయిన ప్రాజెక్టుల్లో కదలిక రావడంతో దర్శి నియోజకవర్గం అభివృద్ధి వైపు సాగుతోంది. ఇంకా నిలిచిపోయిన కోల్డ్ స్టోరేజీ, మినీ స్టేడియం నిర్మాణాలకు నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వెబ్‌సైట్‌లో స్పాట్ సీనియారిటీ జాబితాలు

● రేపటి వరకు అభ్యంతరాల స్వీకరణ

● డీఈవో కిరణ్‌కుమార్

ఒంగోలు విద్య, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం వచ్చేనెల 3వ తేదీ నుంచి ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో జరగనుంది. మూల్యాంకనానికి నియమితులయ్యే జిల్లా వ్యాప్తంగా అన్ని యామాన్యాలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులు, అన్ని సబ్జెక్టుల స్కూలు అసిస్టెంట్ల సీనియారిటీ జాబితాలను సిద్ధం చేసినట్లు డీఈవో కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ జాబితాలను ప్రకాశం స్కూలు ఎడ్యుకేషన్ డాట్ కమ్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. హెచ్ఎంలు, స్కూలు అసిస్టెంట్లు ఈ జాబితాలను పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 23వతేదీ సాయంత్రంలోపు తెలియజేయాలని డీఈవో కోరారు. తగు ఆధారాలతో అభ్యంతరాలు తెలపాలని కోరారు. పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనంలో 16 మండలాల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లను స్పెషల్ అసిస్టెంట్లుగా నియమిస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో రెగ్యులర్‌గా తరగతుల నిర్వహణకు ఇబ్బంది లేకుండా సెకండరీగ్రేడ్‌టీచర్ల వివరాలను పంపాలని ఎంఈవోలను ఆదేశించారు. ఈనెల 24లోపు స్పెషల్ అసిస్టెంట్లుగా నియమించేదుకు ఎస్‌జీటీ వివరాలు పంపాలని ఆయన కోరారు.

ఏపీ మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తులు

ఒంగోలు విద్య, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ మోడల్ స్కూళ్లలో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి ఈనెల 31లోపు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష జరుగుతుంది. 27న మెరిట్ జాబితా ప్రకటిస్తారు. అదే రోజు ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థుల జాబితాను కూడా ప్రకటిస్తారు. 30న సర్టిఫికెట్ల పరిశీలన, జూన్‌లో తరగతులు ప్రారంభమవుతాయి. మోడల్ స్కూళ్లలో ఇంగ్లీషు మీడియంలో బోధిస్తారు. 6నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకు విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తారు. ఇక్కడ విద్యార్థులకు ఉచితవిద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తారు. మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు విద్యార్థులను ప్రోత్సహించాలని కమిషనర్ కోరారు.

టెన్త్ పరీక్షలకు 220 మంది గైర్హాజరు

ఒంగోలు విద్య, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం జరిగిన పదో తరగతి ఇంగ్లీషు పరీక్షకు 220 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలకు 29,346 మందికి 29,126 మంది హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు 14 మందికి కేవలం ముగ్గురు మాత్రమే హాజరు కాగా 11 మంది గైర్హాజరయ్యారు. డీఈవో కిరణ్‌కుమార్ ఆరుపరీక్షా కేంద్రాలను సందర్శించగా, 25 కేంద్రాలను 9 ఫ్లయింగ్ స్క్వాడ్, 25 సిట్టింగ్ స్క్వాడ్ అధికారులు 103 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

ఓపెన్ పరీక్షలకు 481 మంది..

ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 23 కేంద్రాల్లో జరిగిన తెలుగు, ఉర్దు, ఒరియా పరీక్షలకు 481 మంది గైర్హాజరయ్యారు. 1400 మందికి 938 మంది పరీక్షకు హాజరయ్యారు. ఆరు ఫ్లయింగ్‌స్క్వాడ్లు 23పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్షలకు ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

● మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

● 85 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



బాధితురాలికి చెక్ అందజేస్తున్న మంత్రి స్వామి

కొండపి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన 85 మంది అనారోగ్య బాధితులకు రూ.73 లక్షల మేర సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ సాయం అందిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 218 మందికి రూ.2.12 కోట్లు అందించామన్నారు. కార్యక్రమంలో బాధితులతోపాటు ఆయా గ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

2న బయోగ్యాస్ ప్లాంట్‌కు భూమిపూజ

(3వ పేజీ తరువాయి)

చెప్పారు. ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి 2 హెలిప్యాడ్‌లను సిద్ధం చేయాలని సూచించారు. వీవీపీల వాహనాల రాకపోకలకు ఒకదారి, ప్రజలకు మరో దారిని ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ధర్మతేజపాల్, రిలయన్స్ ప్రతినిధులు ప్రదీప్, ఫణీంద్ర, శివరాం, సీఐ ఖాజావలి, వీఆర్వో రఫీ, నాయకులు వేమూరి రామయ్య, సాని కొమ్ము తిరుపతిరెడ్డి(ఎస్‌టీఆర్), కోటపాటి రామారావు, ఉండేల మల్లికార్జునరెడ్డి, కోమటిగుంట్ల వీరయ్య, ప్రసాద్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ఆకాశం ఎందుకో ఎర్రబడ్డది...

ఎప్పుడూ నీలి మేఘాలతో అందంగా నిఘూరించే ఆకాశం రంగు మార్చుకుంది. తన అందానికి తానే రంగు నీళ్లతో దిప్పి తీసినట్టూ, విశాలమైన కొప్పులో మల్లెపూలు కూర్చినట్టూ ఎంతో చూడముచ్చటగా ఉంది కదూ! అద్దంకిలో నామ్ రోడ్డులోని ఎత్తైన స్తంభాలపై తెల్లగా వెలుగుతున్న వీధిలైట్లు ఆకాశంలో కలిసిపోయి మిణుకుమిణుకుమంటూ కనువిందు చేశాయి.

- అద్దంకి, ఆంధ్రజ్యోతి



భగభగలు

ఎండ తీవ్రత నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రోజు రోజుకు ఎండల తీవ్రత మండిపోతున్నది. సాధారణంగా ఏప్రిల్ ఆఖరు నుంచి ఎండల తీవ్రత అధికంగా ఉంటుంది. కానీ ఏడాది మార్చి రెండో పక్షం నుంచే ఎండల తీవ్రత పెరిగింది. మార్చి నెలలో 34నుంచి 36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. ఈనేపథ్యంలో ప్రజలు ఎండ తీవ్రత సమయంలో ఎక్కువగా బయట తిరిగే వారు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఎండ తీవ్రతకు డీహైడ్రేషన్, విరోచనాలు, చమటకాయలు వచ్చే అవకాశం కూడా అధికంగా ఉంటుంది. వేసవిలో ఎండ తీవ్రత బారి నుంచి తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఉపమశనం పొందవచ్చు. అన్నింటికంటే ముందుగా వేసవి కాలంలో నీటిని అధికంగా తాగడం వల్ల శరీరంలో ఉష్ణోగ్రతల వేడిని తగ్గిస్తోంది. మానవ శరీరం 32 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతను తట్టుకుంది. అంతకు మించి ఉష్ణోగ్రతలు ఉంటే ప్రజలు వడదెబ్బ బారిన పడే ప్రమాదం కూడా ఉంటుంది.

పాటించాల్సిన జాగ్రత్తలు

- ప్రధానంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలో తిరగకూడదు.
- ఏదైనా పనిమీద బయటకు వెళ్ళాల్సి వస్తే తలకు, ముఖానికి ఎండ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తలకు టోపీ, గోడుగు, తలపాగా వంటివి వేసుకోవడం మంచిది.
- ప్రతిరోజు కనీసం ఐదు లీటర్లు తక్కువ కాకుండా నీరు తగాలి.
- నీరసంగా అనిపిస్తే ఓఆర్ఎస్, గ్లూకోజ్ కలిపిన నీటిని తీసుకోవాలి.
- ఆహారంలో ఎక్కువగా ద్రవపదార్థాలు ఉండేలా చూసుకోవాలి.
- కొబ్బరినీళ్లు, పండ్లరసాలను ఎక్కువగా తీసుకోవాలి.
- వేపుడు పదార్థాలు, కాపీ, ఫాస్ట్‌ఫుడ్, ఆల్కాహాల్ తాగడం మానేయాలి.
- వదులుగా ఉండే కాటన్ దుస్తులనే ధరించాలి.

వడదెబ్బ లక్షణాలు

- వడదెబ్బకు గురైన వారి శరీరంలో నీటి శాతం లోపించి బాడీ డీహైడ్రేట్ అవుతుంది
- శరీర ఉష్ణోగ్రత అధికంగా పెరుగుతుంది. దీనివల్ల గుండె, రక్తనాళాలు, కాలేయం, మూత్రపిండాలు దెబ్బతింటాయి. శరీరంలోని లవణాలు చెమట రూపంలో బయటకు వెళ్ళిపోవడం వల్ల వ్యక్తి నీరసించిపోతారు. జ్వరం, వాంతులు, విరోచనాలు, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.
- అధిక ఉష్ణోగ్రతవల్ల పల్స్ పడిపోయి తలతిరగడం, తలనొప్పి వస్తాయి

చికిత్స

- వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడలోకి తీసుకపోవాలి.
- బట్టలను వదులు చేసి 25 నుంచి 30 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉన్న నీటితో శరీరాన్ని తుడవాలి. దానివల్ల శరీరంపై ఉండే రక్తనాళాలు కుదించుకపోకుండా ఉంటాయి.
- శరీర ఉష్ణోగ్రత తగ్గేలా చూడటంతో పాటు వెంటనే సమీపంలో ఉన్న వైద్యశాలకు తరలించాలి.

- సుమారు 15 ఏళ్ల నుంచి పంపుతున్న చీరాల బాలకేశవుల కుటుంబీకులు
- గతేడాది విజయదశమి నుంచి గోటి కోటి తలంబ్రాలు సిద్ధంచేస్తున్న వైనం
- ఏప్రిల్ 3వ తేదీకి భద్రాచలం చేరనున్న అక్షితలు
- 6వ తేదీ శ్రీరామ నవమి ఉత్సవానికి వినియోగం



గతేడాది కల్యాణంకు సిద్ధం చేసిన తలంబ్రాలు


రాములోరి కల్యాణానికి చీరాల తలంబ్రాలు

చీరాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలో శ్రీ సీతా రామచంద్రస్వామికి నిర్వహించే కల్యాణ మహోత్సవంలో గోటి కోటి తలంబ్రాలు నిర్వహించడం పురాణ కాలం నుంచి ఆచరిస్తున్న ఆనవాయితీ. అయితే ఆ కోటి గోటి తలంబ్రాలు సిద్ధం చేసి ఉత్సవానికి అందించే భాగ్యం చీరాల వాసులకు దక్కింది. బాపట్ల జిల్లా చీరాల మునిసిపల్ పరిధిలోని పాపరాజుతోటకు చెందిన పొత్తూరి బాలకేశవులు కుటుంబం 2013 నుంచి ఈ సంప్రదాయాన్ని దక్కించుకుని ఆచరిస్తూ స్వామి కృపకు పాత్రులవుతున్నారు. సుమారు 15 సంవత్సరాల క్రితం కేరళలోని రాములోరి కల్యాణంలో స్వయంగా పాల్గొని తిలకించిన బాలకేశవులు భద్రాచలంలో స్వామిసేవ చేసే భాగ్యం పొందాలని నిర్ణయించుకున్నారు. ఈక్రమంలోనే పలుమార్లు సంబంధితశాఖ అధికారుల వద్దకు వెళ్లి తనకున్న జ్ఞానాన్ని, స్వామిపై భక్తిని వ్యక్త పరచి అనుమతి పొందారు. దీంతో ఆ నాటి నుంచి నేటి వరకు గోటి కోటి తలంబ్రాలు సిద్ధం చేస్తున్నారు. సుమారు 6 నెలల వ్యవధితో ఏటా తలంబ్రాలు సిద్ధం చేసేక్రమంలో చుట్టుపక్కల భక్తులు సైతం పుణ్య స్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో శ్రీరామ నామ ఉచ్చరణతో తలంబ్రాలు సిద్ధం చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఈ ఏప్రిల్‌లో శ్రీరామ నవమినాడు జరుగు లోక కల్యాణానికి సంబంధించిన తలంబ్రాలను గతేడాది అక్టోబర్ 13 విజయదశమి నాటినుంచే ప్రారంభించి సిద్ధం చేస్తున్నారు. అయితే భద్రాచల దేవస్థానం ప్రతినిధులు ఈ ఏడాది సుమారు 25 టన్నుల అక్షితలు కోరగా పరిస్థితులు అనుకూలించక పోవడంతో 10 టన్నులు మాత్రమే పంపనున్నారు. ఏది ఏమయినా ఏటా స్వామి కల్యాణంకు అక్షితలు సిద్ధం చేసి చీరాల నుంచి భద్రాచలంకు పంపడంపై భక్తులు ఎంతో పుణ్యంగా భావిస్తున్నారు.

తలంబ్రాలు పంపే విధానమిదీ..

వడ్ల నుంచి వేరు చేసిన 10 టన్నుల గింజల్లో భద్రాచలంకు పంపే నాటికి స్థానికంగానే భక్తుల సౌకర్యార్థం, భద్రాచలం దేవస్థానం అనుమతి మేరకు 2 టన్నులు గింజలను పసుపు, కుంకుమ, ఆవు నెయ్యి, నూనె, గులాము కలగలిపి అక్షితలుగా మారుస్తారు. మిగిలినవి ఏప్రిల్ 3వ తేదీ రాత్రి చీరాల నుంచి బయలుదేరి 4వ తేదీ ఉదయానికి స్వామికి సమర్పిస్తారు. అనంతరం సంప్రోక్షణ నిర్వహించి 6వ తేదీ శ్రీరామనవమి నాడు తెల్లవారుజామున సూర్యచంద్రుల గురుత్వాకర్షణ లేని సమయంలో పూర్తిగా అక్షితలు సిద్ధం చేసి కమిటీకి అప్పగిస్తారు.

స్వామికి సేవచేసే భాగ్యంతో జీవితం ధన్యం



గోటి తలంబ్రాలు సిద్ధం చేసేందుకు సుమారు 6 మాసాల ముందు నుంచే ప్రారంభిస్తాం. ఈనేపథ్యంలో చీరాలతో పాటు అమెరికా, సింగపూర్, దుబాయ్ వంటి ఇతర దేశాలకు చెందినవారు కూడా కొరియర్ ద్వారా వడ్లు తెప్పించుకుని భక్తిశ్రద్ధలతో తలంబ్రాలకు సహకరిస్తారు. ఈ విధంగా చేయడం వల్ల భద్రాచలం వెళ్లినట్లుగా స్వామి కృపను పొందినట్లుగా భావిస్తూ తృప్తి చెందుతుంటారు. 4వ తేదీ భద్రాచలంలో సమర్పిస్తాం. అనంతరం పండుగ నాడు తలంబ్రాలు సిద్ధం చేస్తాం. ముందురోజు రాత్రి ఎదురుకోలు ముగిశాక కళ్యాణంకు అక్షితలు అందిస్తాం. అలాగే చంద్ర ప్రభ వాహనం, పట్టాభిషేకం, రథోత్సవం, సదశ్యం చూసి తరిస్తాం. సదశ్యంలో దేశంలో ఉన్న ప్రముఖ వేద పండితులు పాల్గొని స్వామికి ఆశీర్వచనం ఇవ్వడం విశేషంగా ఉంటుంది.

- పొత్తూరి బాలకేశవులు, తలంబ్రాల నిర్వాహకులు

రెండు చెరువుల్లోకి చేపపిల్లలు

పొన్నలూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా శుక్రవారం పొన్నలూరు, భోగనంపాడు చెరువుల్లో చేపపిల్లలను వదిలారు. కార్యక్రమంలో యానాదుల సహకార సంఘం అధ్యక్షురాలు రాపూరి కోటేశ్వరమ్మ, మత్స్యశాఖ అధికారులు, పొన్నలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు మండవ ప్రసాద్ పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

జరుగుమల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కె.బిట్రగుంట కేజీబీవీలో 6, 11వ తరగతుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ స్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగినవారు శనివారం నుంచి వచ్చే నెల 11వతేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పూర్తి వివరాల కోసం సెల్ నంబర్లు : 96765 85896, 63016 20940ను సంప్రదించాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

సింగరాయకొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కరెంట్ స్తంభానికి ప్లాస్టిక్ తాడుతో ఉరివేసుకొని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని పాల ఫ్యాక్టరీ వెనుకవైపు చోటుచేసుకుంది. సమాచారం అందుకొన్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడికి సుమారు 40-45 ఏళ్ల ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఆయన ఒంటిపై నిండు చేతుల లైట్ బ్లూ చొక్కా, బ్లూ ప్యాంట్ ఉన్నాయి. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్సై బి.మహేంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గేట్ ర్యాంకుల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ

ఒంగోలు విద్య, మార్చి21 (ఆంధ్రజ్యోతి) : ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్ విద్యా సంస్థల్లో ఇంజనీరింగ్ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే గేట్ పరీక్షలో ఒంగోలు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు సత్తా చాటారు. ఉత్తమ ర్యాంకులు సాధించారు. జాతీయ స్థాయిలో ముప్పూరి శివకృష్ణ 124 ర్యాంకు, టి.వర్ధన్ 174, బీవీ.చరణ్‌కుమార్ 182, కె.అరవింద్ 240, ఎ.లోక్‌నాథరెడ్డి 240, ఎన్‌జీ.బాలఓబుల్‌రెడ్డి 484, కె.అజయ్‌బాబు 679, పి.హర్షవర్ధన్ 724, ఎ.రూకేష్ 875, పి.హేమత్‌కుమార్ 983, జి.హిమజ 1084, ఎస్.దుర్గాప్రసాద్ 1264 ర్యాంకు సాధించారు. మరో 29 మంది విద్యార్థులు 5వేలలోపు ర్యాంకులు పొందారు.

ఇంటర్‌లో 'తెలుగు'తప్పనిసరి చేయాలి

ఒంగోలు విద్య, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్థులకు తెలుగు సబ్జెక్టును తప్పనిసరి చేయాలని తెలుగు అధ్యాపకులు కోరారు. ప్రభుత్వం ఇంటర్ విద్యలో ఇటీవల చేసిన సంస్కరణలో సరికొత్త నిర్ణయం నేపథ్యంలో తెలుగు సబ్జెక్టును ఆప్షనల్ సబ్జెక్టుల జాబితాలో చేర్చడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మాతృభాషగా ఉన్న తెలుగును ఇంటర్ విద్యార్థులందరూ తప్పనిసరిగా అధ్యయనం చేసేందుకు తెలుగు తప్పనిసరి సబ్జెక్టుగా చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒంగోలులో కేకేవీకే కళాశాలలో ఇంటర్ మూల్యాంకనం కేంద్రంలో పేపర్లుదిద్దుతున్న తెలుగు అధ్యాపకుల సమాఖ్య ఆధ్వర్యంలో క్యాంప్ ఆఫీసర్ ఆర్ఐవో సైమన్‌విక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

విరలాపురం సర్పంచ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

- వైసీపీ హయాంలో రూ.55 లక్షలు స్వాహా
- అప్పట్లోనే రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగించాలని చీఫ్ సెక్రటరీ ఆదేశించినా చర్యలు శూన్యం

తాళ్లూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని విరలాపురం గ్రామ పంచాయతీ పరిధిలో 2018-19లో ఉపాధి పనులు చేసిన వ్యక్తుల తాలూకా నిధులను కాజేసిన సర్పంచ్ ఇంద్రసేనారెడ్డిపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను కోరారు. శుక్రవారం ఆమె కలెక్టర్‌ను కలిసి మాట్లాడారు. ఆ సర్పంచ్‌పై ఉన్నతాధికారులు నేటికీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, సంబంధిత రికార్డులు పరిశీలించి పనులు చేసిన వ్యక్తులకు నిధుల అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అందుకు సంబంధించిన వివరాలను ఆమె కలెక్టర్‌కు అందజేశారు. విరలాపురం గ్రామంలో ఉపాధిపనులను పంచాయతీకి చెందిన మానం రమేష్ బాబు, షేక్ కాలేషావలిలు చేశారని, ఆ తర్వాత ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ పనుల తాలూకు రూ.55 లక్షలను ప్రస్తుత గ్రామ సర్పంచ్ ఇంద్రసేనారెడ్డి కాజేశారన్నారు. దీంతో బాధితులు హైకోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. విచారణ అనంతరం గత ప్రభుత్వంలో అప్పటి పంచాయతీ రాజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్. నిధులు దుర్వినియోగం చేసిన సర్పంచ్‌పై కేసు నమోదు చేసి ఆర్ఆర్‌యాక్ట్ ద్వారా రికవరీ చేయాలని ఉత్తర్వులు ఇచ్చినా నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దానికి సంబంధించి పోలీస్ స్టేషన్‌లో సర్పంచ్‌పై కేసు నమోదైందని చెప్పారు. టీడీపీ ప్రభుత్వం వచ్చి 10 నెలలు కావస్తున్నా సర్పంచ్ కాజేసిన నిధులను రికవరీ చేయలేదన్నారు. పంచాయతీ అకౌంట్‌కు బదులు నిబంధనలకు విరుద్ధంగా వ్యక్తిగత అకౌంట్‌ను సీఎంఎఫ్ఎస్‌కు లింక్ చేసి నిధులను బొక్కేశారని తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందించి పూర్తి వివరాలు అందజేయాలని డీపీవోకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట మండల టీడీపీ అధ్యక్షులు బి.ఓబుల్‌రెడ్డి, కాలేషావలి, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేస్తున్న దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు ఓబులరెడ్డి

దర్శి పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

దర్శి/తాళ్లూరు/ముండ్లమూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ శుక్రవారం సాయంత్రం దర్శి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించారు. అనంతరం దర్శి పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయానికి కేటాయించిన స్థలాన్ని సందర్శించారు. దర్శి పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు అత్యాధునిక, సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నట్లు చెప్పారు. మహిళల రక్షణ కోసం శక్తి టీమ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజల భద్రత విషయంలో పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మహిళలపై, చిన్నారులపై నేరాల విషయంలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజల ఫిర్యాదులను జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐ వై రామారావు, ఒంగోలు సీఐ రాఘవేంద్ర, ఎస్సై మురళి పాల్గొన్నారు.



దర్శి పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ దామోదర్

తాళ్లూరులోనూ...

స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ దామోదర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని లా అండ్ ఆర్డర్, నేర నివారణ వ్యూహాలు, పెండింగ్ కేసుల పురోగతిపై ఆరాతీశారు. ప్రజలకు శక్తి యాప్, సైబర్ మోసాలు, మాదకద్రవ్యాలపట్ల అనర్థాలు, రోడ్డు భద్రతా నియమాలు, హెల్మెట్ వాడకంపై అవగాహన, సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల జరిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. ప్రజల ఫిర్యాదులో జాప్యం లేకుండా బాధితులకు న్యాయం జరిగేలా సమస్యలు పరిష్కరించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు సొంత భవనం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించాలని ఎస్పీ సూచించారు. ఎస్సై ఎస్. మల్లికార్జునరావు ఉన్నారు. ముండ్లమూరు పోలీసు స్టేషన్‌ను ఎస్పీ దామోదర్ తనిఖీ చేశారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

● ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ.సుబ్బారావు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఐవీ.సుబ్బారావు, సీఐ పాండురంగారావు, ఎంవీఐ కిరణ్‌ప్రభాకర్ తదితరులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ.సుబ్బారావు పేర్కొన్నారు. దాసరి ప్రసన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రెడ్‌క్రాస్ సంస్థలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాసరి ప్రసన్న చిత్రపటానికి ఐవీ.సుబ్బారావు, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌ప్రభాకర్, రెడ్‌క్రాస్ సెక్రటరీ శ్రీమన్నారాయణ, చీమకుర్తి జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐవీ మాట్లాడుతూ ప్రసన్న చిన్న వయస్సులోనే ప్లేట్‌లెట్స్ పడిపోయి రక్తం అందక ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఇటువంటి బాధ మరొకరికి రాకూడదనే ఉద్దేశంతో ఆమె తండ్రి కనకయ్య ప్రతిఏటా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకు దాసరి కనకయ్య ఆధ్వర్యంలో సుమారు 50 మందికి పైగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో శాంతారావు, ఎ.సురేష్, బి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

నాగులుప్పలపాడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని గ్రామసిరి స్వచ్ఛంధ సంస్థ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బసవయ్య సూచించారు. ఐటీసీ, గ్రామసిరి సంస్థ, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి యువసేన ఆధ్వర్యంలో అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని అమ్మనబ్రోలు గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో కనపర్తి ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు ఈదర వెంకటకృష్ణారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతుగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. అనంతరం గ్రామంలోని పలుచోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ గీత, గ్రామ టీడీపీ అధ్యక్షులు ఈదర సుబ్బారావు, మండల మైనార్టీ కార్యదర్శి మహ్మద్‌బేగ్, ఇస్మాయేల్‌బేగ్, అషరఫ్ అలీ, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్‌తో పొగాకు రైతులకు నష్టం

● వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి రవిబాబు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వ్యాపారులు సీలింగ్ పెట్టి పొగాకు కొనుగోళ్ళు చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు ఆరోపించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైసూరులో కిలో పొగాకు రూ.360కి కొనుగోలు చేస్తుంటే జిల్లాలో మాత్రం కిలో రూ.280లకే కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. పది కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడి పొగాకును తక్కువ ధరలకు కొనుగోలు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. సమావేశంలో నాయకులు మారెడ్డి సుబ్బారెడ్డి, కేవీ.రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, దుంపా చెంచిరెడ్డి, దుంపా రవణమ్మ, బొట్లా సుబ్బారావు, మన్నే శ్రీనివాసరావు, సురేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి : ఎంపీడీవో

సింగరాయకొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : చెత్త నుంచి సంపద సృష్టించాలన్న ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పనిచేయాలని ఎంపీడీవో జయమణి సూచించారు. మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని చెత్తసంపద కేంద్రంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై నియోజవర్గస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. తొలి రోజు కొండపి మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు, క్లాప్ మిత్రలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల శివరామిరెడ్డి, ఈవోపీఆర్డీ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి రామారావు, కొండపి ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ కార్యకర్త మృతి

సింగరాయకొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ పరిధిలోని బాలయోగినగర్‌కు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త చొప్పర రత్నకుమారి శుక్రవారం మృతి చెందారు. ఆమె కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. రత్నకుమారి భౌతికకాయాన్ని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్కే. రిజ్వానా సందర్శించారు. మట్టిఖర్చులకు ప్రభుత్వం తరపున రూ.15 వేల నగదును అందజేశారు.

27న ఆలకూరపాడు ఉపసర్పంచ్ ఎన్నిక

టంగుటూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలకూరపాడు గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక ఈనెల 27న జరగనుంది. అందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను శుక్రవారం అధికారులు ప్రకటించారు.

ఇంటి పన్నులు వసూలు చేయాలి

మద్దిపాడు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇంటి పన్నులు చెల్లించేలా వారికి అవగాహన కల్పించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌ప్రసాద్ అన్నారు. శుక్రవారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు వసూలుకు డ్రైవ్ నిర్వహించాలని సూచించారు.

ఘనంగా ప్రపంచ కవితా దినోత్సవం



సన్మానగ్రహీతలతో నిర్వాహకులు

ఒంగోలు కల్చరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కవితా దినోత్సవం నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం(నరసం), కళామిత్ర మండలి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా గ్రంథాలయంలో జరిగిన సమావేశంలో నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ మాట్లాడుతూ కవులు సామాజిక బాధ్యత కలిగి ఉండాలన్నారు. ముఖ్యఅతిథి గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి మాట్లాడుతూ సాహిత్యం సమాజ శ్రేయస్సును కోరేదిగా ఉండాలన్నారు. కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షుడు నూనె అంకమ్మరావు ఆధ్వంలో కవిసమ్మేళనం జరిగింది. అదేవిధంగా ప్రపంచ అటవీ దినోత్సవాన్ని గురించి విశ్రాంత అధికారి గుంటూరు సత్యనారాయణ ప్రసంగించారు. అనంతరం కవులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పోతుల పెదవీరనారాయణ, కుర్రా ప్రసాద్‌బాబు, ఓరుగంటి ప్రసాద్, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, మిడసల మల్లిఖార్జునరావు, బీరం అరుణ, ఎం.సూర్యకుమారి, బండారు సునీత, జి.పద్మజ, నాళం నరసమ్మ, పిన్ని వెంకటేశ్వర్లు, నర్సింగోలు శ్రీనివాస ప్రసాద్, అరుణా సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కడే.. 1200 కర్రలు అల్లకం!



పొగాకును అల్లుతున్న విజయ్

మద్దిపాడు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పచ్చాకు కూలీ అద్భుతం చేశాడు. 22 మంది చేసే కూలి పనిని ఒక్కడే చేసి చూపించాడు. అందరి చేత శభాష్ అనిపించుకున్నాడు. మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామానికి చెందిన పూనూరి విజయ్ తెల్లబాడులోని నాదెండ్ల రైతు బ్యారన్‌కు ఒక్కడే ఉదయం నుంచి సాయంత్రం లోపు 1200 కర్రలు అల్లాడు. కర్ర ఒకే గుర్రంపై అల్లడంపై కూలీలు సైతం ఆశ్చర్యపోయారు. విజయ్‌ను నాదెండ్ల వెంకటేశ్వర్లు, ఇతర కూలీలు ప్రత్యేకంగా అభినందించారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

● ఎమ్మెల్యే దామచర్ల



పలుశాఖల అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆదేశించారు. శుక్రవారం ఒంగోలులోని తన నివాసంలోని క్యాంపు కార్యాలయంలో నగర పాలక సంస్థ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ నగరంలో పైపులైను లీకులపై దృష్టి సారించాలన్నారు. అలాగే శివారుకాలనీల్లో తాగునీటి సమస్య లేకుండా ట్యాంకర్ల ద్వారా సకాలంలో నీరు అందించాలని ఆదేశించారు. గుండ్లకమ్మ నీరు వేసవి చెరువులకు విడుదలవుతున్న నేపథ్యంలో నీటికి ఇబ్బందులు ఉండబోవని, అయితే సరఫరాలోనే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా ప్రతి రోజు ఉదయం 5గంటల నుంచి మొదలయ్యే నీటి సరఫరా రాత్రి పది గంటలలోపు పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అర్ధరాత్రి నీటి సరఫరా విధానానికి స్వస్తి పలకాలని స్పష్టం చేశారు. అలాగే ఫిల్టర్ బెడ్‌లు, పంప్‌హౌస్‌లో మోటారు సమస్యలు లేకుండా చూడాలని పేర్కొన్నారు. నగరంలోని చేతి పంపులు (బోరింగ్)లును వినియోగంలోకి తీసుకురావాలని చెప్పారు. అలాగే నగర సుందరీకరణ, రహదారుల విస్తరణ పనులపై పలు వివరాలను కార్పొరేషన్ అధికారులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అలాగే ఒంగోలు రూరల్, కొత్తపట్నం మండలంలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. గ్రామాల్లోని చెరువులను వినియోగంలోకి తీసుకురావాలని, అలాగే రైతులకు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని దామచర్ల కోరారు. అదేవిధంగా పలు శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షలు నిర్వహించారు.

పేదల ఆరోగ్యానికి భరోసా..

సీఎం సహాయనిధితో పేదల ఆరోగ్యానికి భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. సీఎంఆర్‌ఎఫ్ కింద 29 మందికి మంజూరైన రూ.27.56 లక్షల చెక్కులను శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో లబ్ధిదారులకు అందజేశారు. పేదల ఆరోగ్యం కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.

నగర సమస్యలపై దృష్టి సారించాలి

నగర పరిధిలోని సమస్యలపై కార్పొరేటర్లు దృష్టి సారించాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కోరారు. శుక్రవారం స్థానిక టీకే ఎన్‌క్లేవ్‌లోని దామచర్ల క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్‌లలో పైపులైన్ లీకులు, పారిశుధ్యంపై ఫిర్యాదుల రాకుండా చూడాలన్నారు. త్వరలోనే నగరంలోని పలు రహదారుల విస్తరణ దిశగా ప్రణాళిక రూపొందిస్తామని, కార్పొరేటర్లు భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

హాస్టల్ నిర్మాణం త్వరితగతిన చేపట్టాలి

ఒంగోలులో నూతనంగా ప్రతిపాదించిన వసతి గృహాల నిర్మాణాలకు త్వరితగతిన పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సాంఘీక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్‌ను ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ సాంఘీక సంక్షేమ శాఖ బాలుర హాస్టల్‌కు రూ.6 కోట్లు మంజూరు అయినందున దామచర్ల పాలిటెక్నిక్ కాలేజీలో గుర్తించిన స్థలంలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలన్నారు. అలాగే తూర్పుపాలెంలో రూ.3.7కోట్లు, మరో రూ.3కోట్లుతో పీవీఆర్ బాలుర స్కూలు దగ్గర కార్పొరేషన్ స్థలంలో భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

● భూసార పరీక్షా కేంద్రం ఏడీ సుచరిత



సదస్సులో మాట్లాడుతున్న ఏవో కిషోర్‌బాబు, వేదికపై ఏడీ సుచరిత

ఒంగోలు(రూరల్), మార్చి21(ఆంధ్రజ్యోతి): రైతులు తాగు చేసే భూములకు భూసార పరీక్షలు చేయించాలని భూసార పరీక్షా కేంద్రం ఏడీ సుచరిత పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలు మండలం కొప్పోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ పంట సాగు భూముల్లో సూక్ష్మ మూలకాలు ఏ స్థాయిలో ఉన్నాయో మట్టిని పరీక్ష చేయటం వల్ల తెలుస్తుందన్నారు. దానిబట్టి ఎరువులు వాడుకోవాలని కోరారు. రైతులు రసాయనిక ఎరువులు అధికంగా వాడితే భూములు నిస్సారవంతం అవుతాయని చెప్పారు. తొలకరి సమయంలో జీలుగ, పెసర, జనుము లాంటి పచ్చిరొట్ట పంటలు సాగు చేసి 40రోజుల్లోపు దుక్కిలో దున్నేయటంతో భూమికి ఎంతో ఉపయోగమని తెలిపారు. అందువల్ల భూములను ఆరోగ్యంగా ఉంచుకోవాలని కోరారు. ఏవో కిషోర్‌బాబు భూములు నిస్సారవంతం కాకుండా తీసుకోవాల్సిన అంశాలను రైతులకు విపులంగా వివరించారు. కార్యక్రమంలో ఏఈవోలు కంజుల రామకృష్ణారెడ్డి, సముద్రాల ఆదిమూర్తి, మాజీ సర్పంచ్ కాట్రగడ్డ రఘుపతి పాల్గొన్నారు.

సీవీఎన్ అభివృద్ధికి అన్నివిధాలా సహకారం

● ఎమ్మెల్యే దామచర్ల



ప్రమాణస్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు, హాజరైన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కల్చరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వంద సంవత్సరాలకు పైగా చరిత్ర ఉన్న సీవీఎన్ రీడింగ్ రూమ్, క్లబ్ అభివృద్ధికి తాను అన్నివిధాలా సహకరిస్తానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక సీవీఎన్ రీడింగ్ రూములో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ కళలు, కళాకారులకు నిలయం సీవీఎన్ రీడింగ్ రూము అని, వారి సంక్షేమానికి తాను చేయూతనిస్తానని చెప్పారు. సీవీఎన్ రీడింగ్ రూము ఎంతో ప్రతిష్ఠాత్మకమైన సంస్థ అని, దాని పేరు నిలబెట్టేలా కొత్త కార్యవర్గం కృషిచేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షునిగా ఈదుపల్లి గురునాథరావు, కార్యదర్శిగా కోదూరి రాధాకృష్ణ, ఉపాధ్యక్షునిగా రామిరెడ్డి నితిన్ రాజ్‌రెడ్డి, కోశాధికారిగా ఆరిగ వీరప్రతాప్, సంయుక్త కార్యదర్శిగా తోట సాయినవీన్, అలాగే ఉన్నవ శేషుబాబు, యామల బాలకృష్ణ, జల్లిపల్లి పూర్ణచంద్రరావు, కరేటి కిరణ్‌బాబు, చక్కా రామకృష్ణారావు, తోట శ్రీధర్‌బాబులు కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ కోడూరి వెంకటేశ్వరరావు, పలు సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి.

శరభయ్య విగ్రహావిష్కరణ



శరభయ్య విగ్రహం

నాగులుప్పలపాడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడులోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయ వ్యవస్థాపకులు, ఆలయ పూజారి దివంగత చిడిపోతు శరభయ్య విగ్రహావిష్కరణ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఉప్పుగుండూరు రోడ్డులోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు.

రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి : ఎస్ఐ

మద్దిపాడు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ముస్లింలు రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ శివరామయ్య చెప్పారు. శుక్రవారం మద్దిపాడులో ముస్లింలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈద్గా దగ్గర ఐకమత్యంతో ప్రార్థనలు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

కార్యదర్శులకు, గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ

సంతనూతలపాడు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): చెత్త సంపద తయారీపై కార్యదర్శులకు, గ్రీన్ అంబాసిడర్లకు శుక్రవారం సంతనూతలపాడు చెత్త సంపద తయారీ కేంద్రంలో ఎంపీడీవో డి.సురేష్‌బాబు శిక్షణ ఇచ్చారు. 22న చీమకుర్తి సిబ్బందికి, 24న ఎన్‌జీ.పాడు మండలం, 25న మద్దిపాడు మండల సిబ్బందికి శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రమణమ్మ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఈడీకి పొగాకు రైతుల శుభాకాంక్షలు



ఈడీ విశ్వశ్రీకి బొకేను అందజేస్తున్న నాయకులు

ఒంగోలు(రూరల్), మార్చి21(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని పొగాకు బోర్డు కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన విశ్వశ్రీని జిల్లా పొగాకు రైతు నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రైతుసంఘ నాయకులు పలు విషయాలపై ఈడీతో చర్చించారు. కార్యక్రమంలో బోర్డు వైస్ చైర్మన్ బొడపాటి బ్రహ్మయ్య, సభ్యులు పొద వరప్రసాద్, వడ్డెళ్ల ప్రసాదు, పోతుల నరసింహారావు, పెనుబోతు సునిల్ బాబు, నాగినేని భాస్కర్, అబ్బూరి శేషగిరి, మహేష్ పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగులకు మద్దతుగా సమావేశం

చీమకుర్తి, మార్చి21(ఆంధ్రజ్యోతి) : బ్యాంకు ఉద్యోగులకు మద్దతుగా చీమకుర్తిలో శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, పల్లాపల్లి ఆంజనేయులు, పూసపాటి వెంకట్రావు, ఎస్‌కే.అక్బర్, శ్రీనివాసరావు, రామారావు పాల్గొన్నారు.

నగరంలో నైట్ స్ట్రీట్‌ఫుడ్ దుకాణాల తనిఖీ



చికెన్ కబాబ్‌ను పరిశీలిస్తున్న ప్రభాకర్

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలో రోడ్‌సైడ్ ఆహార విక్రయాల దుకాణాలను ఆహార భద్రత అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. స్థానిక పీవీఆర్ బాలుర పాఠశాల సమీపంలోని నైట్ ఫుడ్ కోర్టు వద్ద జిల్లా ఆహార భద్రత అధికారి గరికపాటి ప్రభాకర్ రావు తన సిబ్బందితో కలిసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. చికెన్ పకోడి దుకాణాలు, తందూరి, గోబీ తయారీ దుకాణాలు, అలాగే పుచ్చకాయలు, ఫ్రూట్ జ్యూస్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, రంగులు, కెమికల్స్‌తో తయారీ చేసిన ఆహార పదార్థాలు, అలాగే ఎక్కువసార్లు ఉపయోగించిన నూనెలను పరిశీలించి, దుకాణదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడితే కఠిన చర్యలు ఉంటాయని ప్రభాకర్‌రావు హెచ్చరించారు. ఈ మేరకు నాణ్యతలేని ఆహారపదార్థాలు అమ్ముతున్న వ్యాపారులకు అపరాధ రుసుము విధించారు. తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ అధికారి నరసింహం, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఈదుమూడి చెరువుకు నీటి సరఫరా

నాగులుప్పలపాడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఈదుమూడి గ్రామంలోని ప్రధాన తాగునీటి చెరువు అడుగంటిన నేపథ్యంలో ఎమ్మెల్యే బీఎన్.విజయ్ కుమార్ సూచనల మేరకు చెరువుకు తాగునీటిని నింపుతున్నారు. సదరు చెరువుకు మట్టిగుంట పంపింగ్ స్కీమ్ వద్ద నుంచి ఎత్తిపోతల ద్వారా ఎమిలేరు చానల్‌కు మళ్లించి అక్కడ నుంచి ట్రాక్టర్ ఇంజన్లతో చెరువుకు నిం పుతున్నట్లు సర్పంచ్ బోలే లక్ష్మి, ఆంజనేయులు తెలిపారు. మరో రెండు రోజుల్లో చెరువుకు పూర్తిస్థాయిలో నీరు చేరుతుందని వారు చెప్పారు.

'ఉపాధి'ని సమర్ధవంతంగా అమలు చేయాలి

● డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ ఆదేశించారు. శుక్రవారం విజయవాడ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఫారంపాండ్ల ఏర్పాటు, సీసీరోడ్లు, గోకులాల నిర్మాణాలు తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. పనుల విషయంలో అవినీతికి పాల్పడిన సిబ్బందిని ఉద్యోగం నుంచి తొలగించడమే కాకుండా శాఖపరమైన చర్యలు చేపట్టి జవాబుదారితనాన్ని పెంచుతామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, జడ్పీసీఈవో చిరంజీవి, డీపీవో వెంకటనాయుడు, పీఆర్ ఎస్ఈ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా కళాశాల వార్షికోత్సవం

ఒంగోలు విద్య, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బాలికలు అన్ని రంగాల్లో తమ ప్రతిభా పాటవాలను చాటుతూ ఉన్నతంగా రాణించాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సతీమణి నాగసత్యలత పిలుపునిచ్చారు. ఒంగోలులోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వడిగ్రీ కళాశాల 41వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డి.కళ్యాణి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన నాగసత్యలత మాట్లాడుతూ విద్యార్థినులు బాగా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన వివిధ పోటీల విజేతలకు ఆమె బహుమతులను అందజేశారు. అనంతరం వారు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ పి.కుసుమకుమారి, అనంతలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, అమ్మాజీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె వాయిదా



మాట్లాడుతున్న బ్యాంకు ఉద్యోగులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఫైనాన్స్ మంత్రిత్వశాఖ, డీఎఫ్ఎస్ ఆధ్వర్యంలో సానుకూలంగా స్పందించడంతో సమ్మె వాయిదా వేసినట్లు బ్యాంకు యూనియన్ నాయకులు తెలిపారు. శుక్రవారం ఒంగోలులోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద జరిగిన కార్యక్రమంలో యూఎఫ్‌బీయూ కన్వీనర్ రాజీవ్‌రత్నదేవ్ మాట్లాడుతూ తాము చేపట్టిన సమ్మెపై సానుకూలంగా స్పందించడంతో తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలిపారు. ఏప్రిల్ మూడవ వారంలో ఫైనాన్స్ మంత్రిత్వ శాఖతో బ్యాంకు ఉద్యోగుల సమస్యలపై సమవేశం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సమస్యలపై సానుకూలంగా స్పందించకపోతే భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తామని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వి.శ్రీనివాసరావు, సుబ్బారావు, ఉమాశంకర్, వెంకటరెడ్డి, శ్రీధర్, బ్రహ్మయ్య, శ్రీనివాసరావు, సుధాకర్‌రావు, హసన్, బ్రహ్మనాయుడు, ఏడుకొండలు, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏఐ ద్వారా బహుళ ప్రయోజనాలు : వీసీ

ఒంగోలు విద్య, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయని వైస్ చాన్సలర్ డీవీఆర్.మూర్తి పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్శిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ అండ్ ఇట్స్ అప్లికేషన్ అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ హరిబాబు, ప్రిన్సిపాల్ రాజమోహన్‌రావు, కె.సాయిబాబా, వై.సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుపై హర్షం



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో బిల్లు ప్రవేశ పెట్టడం అభినందనీయమని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్‌మాదిగ పేర్కొన్నారు. ఒంగోలులో అంబేద్కర్ విగ్రహానికి శుక్రవారం పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ ఫలాలు ఎస్సీల్లోని 59 కులాలకు సమానంగా అందినప్పుడే నిజమైన సామాజిక న్యాయం దక్కుతుందనే న్యాయ సూత్ర ఆధారంగా మాదిగలు చేస్తున్న పోరాటానికి చంద్రబాబు న్యాయం చేశారని తెలిపారు. కార్యక్రమంలో కొలకలూరి విజయకుమార్, జయరాజ్, పత్రా బంగారం, డి.శ్రీనివాసరావు, శేఖర్, మహేష్, రమేష్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకం

ఒంగోలు క్రైం, మార్చి21(ఆంధ్రజ్యోతి): హెడ్ కానిస్టేబుల్ కుమారునికి కారుణ్య నియామకం కింద ఉద్యోగ నియామకపత్రాన్ని ఎస్పీ ఏఆర్.దామోదర్ శుక్రవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో అందజేశారు. చీరాల వన్‌టౌన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ కోవిడ్ సమయంలో జేఎస్ఎస్.రత్నకుమార్‌రావు మృతి చెందారు. దీంతో ఆయన కుమారుడు యశ్వంత్‌కు బాపట్ల ఎస్పీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా నియామకపత్రాన్ని అందించారు. కార్యక్రమలో ఏవో రామ్మోహన్, రవికిరణ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలు చెల్లింపుపై కృతజ్ఞతలు

ఒంగోలు(రూరల్), మార్చి21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు బకాయిలు చెల్లింపులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.6200కోట్ల నిధుల కేటాయించటం హర్షణీయమని తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం నాయకులు శుక్రవారం హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు ఇవ్వటంలో విఫలమైందని విమర్శించారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. త్వరలో పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. డీఏ బకాయిలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు అల్లిబోయిన రాంబాబు, యనమల ఆంజనేయులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి


చంటి (ఫైల్)

ఎర్రగొండపాలెం రూరల్ , మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆనకుంట వద్ద జాతీయ రహదారిలో ఆటో - బైక్ ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి గురువారం అర్ధరాత్రి మృతిచెందారు. మండలం లోని చెన్నరాయినిపల్లి గ్రామానికి చెందిన ఎలివెల చంటి (34) కొలుకుల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి ఎర్రగొండపాలెం నుంచి కుంటకు బైకుపై వస్తున్న సయయంలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో చంటితో పాటు గుడిపాడు గ్రామానికి చెందిన సూరే సత్యనారాయణలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని జాతీయ రహదారి అంబులెన్సులో ప్రాంతీయ వైద్యశాలలో చేర్చారు. వైద్యులు ప్రథమచికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు రిఫర్ చేశారు. నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలలో చేరి చికిత్స పొందుతూ మరింత మెరుగైన వైద్యం కోసం గుంటూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతిని తండ్రి ఎళివెల చెన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.చౌడయ్య తెలిపారు.

విద్యార్థినులకు ఆత్మరక్షణపై అవగాహన


విద్యార్థినులకు సూచనలిస్తున్న ఎస్సై నరసింహారావు

కంభం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు ఆత్మస్థైర్యంతో ముందుకు పోవాలని ఎస్సై నరసింహారావు సూచించారు. ఆకతాయిల దాడులను ఎలా ఎదుర్కోవాలో శక్తి టీం ద్వారా వారికి అవగాహన కల్పించారు. ఆత్మరక్షణపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఏదైనా ఆపదవస్తుందని తెలిసిన వెంటనే శక్తి యాప్‌ను ఎలా ఉపయోగించుకో వాలని తెలిపారు. విద్యార్థినులకు 'గుడ్ టచ్, బ్యాడ్ టచ్'పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శక్తి టీం మహిళ పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ మండల సర్వసభ్య సమావేశం

మార్కాపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం మండల టీడీపీ సర్వసభ్య సమావేశం ఈ నెల 22న నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 3.00 గంటలకు జరుగుతుందన్నారు. మండల పరిధిలోని టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తప్పక పాల్గొనాలని తెలిపారు.

నేడు ప్రజాదర్బార్

స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ నెల 22న శనివారం ఉదయం 10.00 గంటలకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్యాలయ ప్రతినిధి తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ప్రజలు సమస్యలను కార్యక్రమంలో తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన అధికారులు పాల్గొంటారన్నారు.

రేపు శ్మశానవాటిక వద్ద ప్రార్థనలు

మార్కాపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 9వ వార్డు నుంచి 19వ వార్డు వరకు ఉన్న ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన శ్మశానస్థలం వద్ద ఈ నెల 23న ఆదివారం సాయంత్రం 4.00 గంటలకు ప్రార్థన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలియజేశారు. గత 30 సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజలకు శ్మశాన స్థలం సమస్య ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 9 నెలలకే ఈ ప్రాంత ప్రజల సమస్య తీర్చిన సందర్భంగా ప్రత్యేక ప్రార్థన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రానికి టీవీ బహూకరణ


టీవీ అందజేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

మార్కాపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడి మనవడు, మంత్రి లోకేష్ కుమారుడు దేవాన్ష్ జన్మదినోత్సవాన్ని స్థానిక 18వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కత్తిరించి కార్యకర్తలు, చిన్నారులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రానికి శివాజీషిండే స్వామి రూ.20 వేల విలువైన స్మార్ట్ టీవీని బహూకరించారు. టీవీని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సోదరుడు వేణుగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ ఖాలీద్, షేక్ మహ్మద్ అలీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతులకు నష్టాల ఘాటు

- నాణ్యత లోపించిందని కొనుగోలుకు వ్యాపారుల అనాసక్తి
- చేసేది లేక వచ్చిన కాడికి తెగనమ్ముకుంటున్న రైతులు


రేఖల్లో ఆరబెట్టిన వైట్ బర్లీ పొగాకు

తర్లుపాడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది వైట్ బర్లీ పొగాకు సాగుచేసిన రైతులు భారీస్థాయిలో నష్టపోవాల్సిన దుస్థితి నెలకొంది. గతేడాది కొంత మేర లాభాలు రావడంతో ఈ ఏడాది రెట్టింపు ఉత్సాహంతో రైతులు వైట్ బర్లీ సాగు చేపట్టారు. మండలంలో సుమారు 750 ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. ఎకరాకు దాదాపుగా వ్యవసాయం, మందులు, కూలీలు మొత్తం రూ.70 నుంచి రూ.లక్ష ఖర్చు చేశారు. ప్రకృతి విపత్తులు, అధిక వర్షాలకు పొగాకు ఏపుగా పెరిగి నాణ్యత లోపించింది. దీంతో వ్యాపారులు, పొగాకు కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతన్నలు భారీ స్థాయిలో నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొనుగోలు చేసిన బేళ్లను కూడా క్వింటా రూ.12వేల నుంచి రూ.14వేలు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. కొంత మంది రైతులు ఒంగోలు, మేదరమెట్ల తీసుకెళ్లి అక్కడ బోర్డులో కొనకపోవడంతో తీసుకొచ్చి ఎండలో పడేస్తున్నారు. దీంతో ఎండిపోయి నూర అయ్యి మరింత నష్టపోతున్నారు. ఈ ఏడాది ఎక్కువగా బొగులు మాడు వస్తుండటంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది బర్లీ పొగాకు సాగుచేసే రైతులకు ఎకరాకు దాదాపుగా రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు నష్టం వాటిల్లిందని రైతులు లబోదిబోమంటున్నారు. పొగాకు సాగు చేసే సమయంలో మాత్రం వివిధ కంపెనీల సూపర్‌వైజర్‌లు వచ్చి ప్రోత్సహించి క్వింటా రూ.18వేలకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారనాన్రు. అయితే ప్రస్తుతం రూ.14 వేలకు కూడా కొనుగోలు చేయడం లేదని వాపోయారు.



పొగాకు కొనకపోవడంతో ఎండలో పడేసిన బేళ్లు, ఆటోలో అమ్మకానికి తీసుకెళ్తున్న రైతులు

రూ.2 లక్షల మేర నష్టం


వెంకటనారాయణ

గతేడాది బర్లీ పొగాకులో కొంతమేర లాభం వచ్చింది. దీంతో ఈ ఏడాది 5 ఎకరాల సాగు చేశాను. పొగాకు నాణ్యత లోపించడంతో కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రాలేదు. దీంతో రూ.2లక్షల మేర నష్టపోయాను. ప్రభుత్వం స్పందించి పండించిన పంటను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

ఆక్రమణల తొలగింపు కోసం హద్దుల గుర్తింపు


పంటకాలువ వెంబడి ఆక్రమణలు పరిశీలిస్తున్న అధికారులు

కంభం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కంభం చెరువు ఇరిగేషన్ పంటకాలువలను ఆక్రమించుకుని నిర్మించుకున్న అక్రమ కట్టడాలను గుర్తించిన కంభం తహసీల్దార్ కిరణ్ శుక్రవారం మార్కింగ్ ఇచ్చారు. 'పంట కాలువల పై అక్రమ కట్టడాలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 18న కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కంభం, కందులాపురం పంచాయతీల పరిధిలో పంటకాలువలను పరిశీలించారు. అక్రమ కట్టడాలను గుర్తించారు. శుక్రవారం తహసీల్దార్ కిరణ్, కందులాపురం పంచాయతీలో కాలువలపై నిర్మించిన అక్రమ కట్టడాలను రెవెన్యూ మ్యాప్ ద్వారా పరిశీలించి మార్కింగ్ ఇచ్చారు. ఆక్రమణదారులు స్వచ్ఛందంగా మార్కింగ్ ఇచ్చిన వరకు తొలగించుకోవాలన్నారు. లేనిపక్షంలో తామే ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగిస్తామని హెచ్చరించారు. కందులాపురం పంచాయతీ వరకు తమ వద్ద మ్యాపింగ్ ఉందన్నారు. దాంతో అక్రమ కట్టడాలను గుర్తించి మ్యాపింగ్ ఇచ్చినట్లు తెలిపారు. కానీ కంభం పంచాయతీకి సంబంధించి ఇరిగేషన్ పంట కాలువలపై అక్రమ కట్టడాలను గుర్తించా లంటే కంభం ఇరిగేషన్ కార్యాలయంలోని మ్యాప్ కావాలని, వారిని మ్యాప్ అడుగగా వారి వద్ద లేదని చెబుతున్నారని తహసీల్దార్ తెలిపారు. ఇరిగేషన్ అధికారులు మ్యాప్ తెస్తేనే తాము సర్వేయర్లతో కొలతలు వేయించి మార్కింగ్ ఇస్తామన్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస నాయక్‌ను వివరణ కోరగా కంభం పంచాయతీ కాలువలు గ్రామకంఠం కిందకు వచ్చిందని, దానికి సంబంధించి రికార్డులను పరిశీలించి మ్యాప్ అందజేస్తామన్నారు.

ఎంపీపీ ఎన్నిక కోసం, 27న ప్రత్యేక సమావేశం


నాయుడుపల్లి ఎంపీటీసీ సభ్యురాలు పొరెడ్డి అరుణకు నోటీసు అందజేస్తున్న డీఏ అనూషరెడ్డి

త్రిపురాంతకం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక కోసం ఈనెల 27న ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. దీని కోసం మండలంలోని 18 మంది ఎంపీటీసీ సభ్యులకు శుక్రవారం నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో జి.రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలో ఉన్న 18 మంది ఎంపీటీసీలలో 17 మంది వైసీపీ సభ్యులు, మేడపి ఎంపీటీసీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. అప్పట్లో మొదటి రెండున్నరేళ్లు నడిగడ్డ ఎంపీటీసీ సభ్యుడు కోట్ల సుబ్బారెడ్డి ఎంపీపీగా పనిచేశారు. తర్వాత రెండున్నరేళ్లు సోమేపల్లి ఎంపీటీసీ సభ్యురాలు ఆళ్ల సుబ్బమ్మ పదవి చేపట్టేలా నాడు వైసీపీ నేతల సమక్షంలో ఇరువరు అనధికారిక ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనిలో భాగంగా మొదటి రెండున్నరేళ్లు కోట్ల సుబ్బారెడ్డి పదవీ బాధ్యతలు నిర్వహించారు. అనంతరం సుబ్బమ్మ పదవీబాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంది. అయితే సుబ్బారెడ్డి తప్పుకున్న అనంతరం రెండో వైస్ ఎంపీపీగా ఉన్న త్రిపురాంతకం ఎంపీటీసీ జి.రిబ్కాకి ఇన్‌చార్జ్ ఎంపీపీ పదవి దక్కింది. దీంతో ఆమె ప్రస్తుతం పదవిలో కొనసాగుతున్నారు. ఇక ప్రస్తుతం ప్రభుత్వం పూర్తిస్థాయి ఎంపీపీని నియమిస్తోంది. ఈ మేరకు సభ్యులకు నోటీసులు జారీ చేశారు.

మార్కాపురం రూరల్: మార్కాపురం మండల ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ ఈ నెల 27న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీపీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి డీఎల్‌డీవో కొల్లి శ్రీనివాస రెడ్డి శుక్రవారం తెలిపారు. కలెక్టర్ తమీమ్ అన్సా రియా ఆదేశాల మేరకు ఎన్నికకు సంబందించిన నోటీసులను మండలంలోని ఎంపీటీసీ సభ్యులకు ప్రత్యక్షంగా అధికారులు అందజేస్తు న్నారన్నారు. ఈ నెల 27న ఉదయం 11 గంటలకు ఎంపీపీ ఎన్నిక నిర్వహించను న్నట్లు తెలిపారు.

అట్టహాసంగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు

కొనకనమిట్ల, మార్చి 21 : మండలంలోని వెలుగొండలో రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహోత్సవాల సందర్భంగా ఈపోటీలను నిర్వహిస్తున్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఎడ్ల పోటీలను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. తొలిరోజు మొత్తం 15 ఎడ్లజతలు పోటీలలో పాల్గొనగా మొదటి బహుమతి రూ.60 వేలు, రెండవ బహుమతి రూ.40 వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు, నాల్గవ బహుమతి రూ.20వేలు, ఐదవ బహుమతి రూ.10 వేలు, ఆరవ బహుమతి రూ.8వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఎడ్లపోటీలను తిలకించేందుకు పొదిలి, కొనకనమిట్ల, తర్లుపాడు తదితర మండలాల రైతులు అధిక సంఖ్యలో పాల్గొని పోటీలను ఆసక్తిగా తిలకించారు. ఎడ్ల పోటీలు నువ్వా నేనా అన్నంత ఉత్కంఠ భరితంగా సాగాయి. శనివారం సీనియర్ విభాగం ఎడ్ల పోటీలు జరగనున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన ఎడ్లజతలకు శనివారం బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు కుందురు కాశిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు మోరబోయిన బాబురావు, పలువురు టీడీపీ నాయకులు, పలువురు రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

- ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ


సమావేశంలో మాట్లాడుతున్న డీటీ

ఎర్రగొండ పాలెం రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరు డీలర్ వద్ద ఈకేవైసీ చేయించా లని ఎర్రగొండపాలెం ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ ఎస్ రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వో, డీలర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వో, డీలర్లు, ఎండీయూలతో కలిసి ప్రతి రేషన్ కార్డుదారులతో ఈ నెల 31 నాటికి ఈ కేవైసీ పూర్తి చేయించాలని సూచించారు. రేషన్ కార్డుదారులు కూడ వారికి సహకరించాలని కోరారు. లేకుంటే రేషన్ సరుకులు అందవని అన్నారు. నియోజకవర్గంలోని కార్డుదారులు ప్రతి ఒక్కరు ఈకేవైసీ చేయించుకొని అధికారులకు సహకరించాలన్నారు.

కూలడానికి సిద్ధంగా ఉంది.. పట్టించుకోరా?


శిథిలావస్థకు చేరిన వంతెన

మార్కాపురం వన్ టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రేడియో స్టేషన్ సమీపంలోని ఒంగోలు వెళ్లే దారిలోని అలుగు కాలువపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. కూలడానికి సిద్ధంగా ఉన్నా, సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మార్కాపురం చెరువు అలుగు పారితే నీరు వెళ్లేందుకు, ఒంగోలుకు రాకపోకలు సాగించేందుకు ఆంగ్లేయుల హయాంలోనే వంతెనను నిర్మించారు. 1977లో వచ్చిన తుఫాన్‌కు ఒక పర్యాయం ఇది కొట్టుకుపోయింది. అనంతరం రెండు వరుసల వంతెనను నిర్మించారు. కేవలం రాళ్లగోడపై నిర్మించిన ఈ వంతెన ఐదేళ్ల క్రితం కూలిపోయింది. అధికారులు తాత్కాలికంగా సిమెంట్ తూములు వేసి పూడ్చారు. అయితే పక్కా నిర్మాణం చేపట్టలేదు. దీంతో ఇది కూడా కొట్టుకుపోయింది. పక్కనే ఉన్న మరో పొర అడుగుపొర దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ వంతెన స్థానంలో నూతనంగా కొత్త దాన్ని నిర్మించాల్సి ఉంది.

మహిళలకు అండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు అండగా అనేక పథకాలు ప్రవేశపెట్టాయని, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీ కృష్ణారావు అన్నారు. స్థానిక ఎల్‌ఐసీ కేంద్రంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మహిళ కోసం ఏర్పాటు చేసిన కుట్టు, బ్యూటీపార్లర్ శిక్షణా కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలు పలు అంశాలను వారికి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆంజనేయులు, శ్రీకాంత్, రామకృష్ణ, సతీష్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫైళ్లు పెండింగ్ లేకుండా చేస్తున్నాం

- ఇన్‌చార్జ్ తహసీల్దారు

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం తహసీల్దారు కార్యాలయంలో ఎటువంటి ఫైల్స్ పెండింగ్‌లో లేకుండా చేస్తున్నామని ఇన్‌చార్జ్ తహసీల్దారు శైలేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో గాడితప్పిన రెవెన్యూ పాలన 'వారోనికోకసారి తహసీల్దారు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పదించారు. పెద్దరావీడు రెగ్యులర్ తహసీల్దారు అయిన ఇక్కడ పెండింగ్ పనులు లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేస్తున్నామన్నారు. వీలైనంత వరకు మండల ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. నేరుగా తనకు మండల ప్రజలు సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

ఆర్థికసాయం అందజేత


సాయం అందచేస్తున్న దాతలు

గిద్దలూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏబీఎం పాలెంలో నిరుపేద పెయింటర్ పానుగంటి డానియేలు అనారోగ్యంతో మృతి చెందాడు. అంత్యక్రియలకు కూడా డబ్బులేని పరిస్థితి నెలకొనడంతో ఆ కుటుంబానికి మానవత సంస్థ స్పందించి మృతదేహాన్ని అంత్యక్రియల వరకు ఉంచేందుకు వీలుగా ఫ్రీజర్‌బాక్సును అందించారు. మట్టిఖర్చుల కోసం సంస్థ గౌరవాధ్యక్షులు గంజి వీరయ్య, అధ్యక్షులు పాలుగుళ్ళ శివారెడ్డి, పలువురు సభ్యులు కలిసి రూ.5వేల సాయం అందజేశారు.

పన్ను చెల్లించడం బాధ్యతగా భావించాలి

గిద్దలూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పన్ను చెల్లించడం భారంగా కాకుండా బాధ్యతగా భావించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో ప్రజలకు, వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ఈనెల 31వ తేదితో ముగియనున్న దృష్ట్యా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు తమ ఆస్తిపన్ను, తాగునీటి చార్జీలు, వ్యాపార ట్రేడ్ లైసెన్సు రుసుములు సత్వరమే చెల్లించాలని కోరారు. మున్సిపల్ సిబ్బంది వచ్చి అడిగేంత వరకు బకాయిదారులు వేచి ఉండకుండా పన్ను చెల్లించి బాధ్యతగా వ్యవహరించి మున్సిపల్ అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

మానసిక ఒత్తిడికి లోను కావద్దు : కౌన్సెలర్


అవగాహన కల్పిస్తున్న ఎస్‌వో

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు ఎటువంటి మానసిక ఒత్తిడికి లోనుకావద్దని ఒంగోలు సమగ్రశిక్ష కౌన్సెలర్ డి.మోహన్ రావు అన్నారు. శుక్రవారం స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాల యంలోని బాలికలకు మానసిక ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర వాటిపై అవగాహన కల్పించి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రత్యేకాధికారిని తిరుమలదేవి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

బేస్తవారపేట, మార్చి21 (ఆంధ్రజ్యోతి): బేస్తవారపేట మండల పరిషత్ కార్యాలయంలోని రికార్డులను జిల్లా పరిషత్ సీఈవో బి.చిరంజీవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులు, గతంలో జరిగిన అభివృద్ధి పనులు, జి.ఎస్‌డబ్ల్యుఎస్‌లో జరిగిన అభివృద్ధి పనులను, సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అలాగే సిబ్బంది రోజువారి హాజరుపట్టి రిజిస్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏవీ.రంగనాయకులు, ఈవోఆర్డీ షేక్.జీలాని తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

గిద్దలూరు టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన పట్టణంలోని సగిలేరువాగు వంతెన వద్ద శుక్రవారం చోటుచేసుకొంది. మండలంలోని ముండ్లపాడుకు చెందిన ఒక వ్యక్తి గిద్దలూరులో పనులు ముగించుకుని ద్విచక్రవాహనంపై గ్రామానికి వెళుతున్నారు. ఎదురుగా వస్తున్న ట్రాలీ వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళుతున్న వారు సదరు వ్యక్తిని చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వైభవంగా అభయాంజనేయస్వామి తిరునాళ్ల


అభయాంజనేమస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

పొదిలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు - కర్నూలు ప్రధాన రహదారి ఆనుకొని ముసినది ఒడ్డున ఉప్పలపాడు-ఏలూరు గ్రామాల మధ్యన వెలసిన అభయాంజనేయస్వామి, వరసిద్ధి వినాయక స్వామివార్ల 15వ వార్షికోత్సవ తిరునాళ్ల శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అభయాంజనేయస్వామి వార్షికోత్సవం పర్వదినం సందర్భంగా, భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. ముందుగా గోపూజ, ఆకుపూజలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు స్వామి వారికి పొంగళ్లతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆంజనేయస్వామి సన్నిధికి వచ్చిన భక్తులకు, దాతలు పెద్దఎత్తున స్వచ్ఛందంగా పులిహోరా, పెరుగన్నం, మజ్జిగ ప్యాకెట్లు, వాటర్‌ప్యాకెట్లు, శీతల పానియాలు అందించి భక్తిని చాటుకున్నారు. అనంతరం దాతలు సహకారంతో భక్తులకోసం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వహకులు క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. భక్తులకు దర్శన సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ వేమన గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవంలో స్వామివారిని తిలకించేందుకు చుట్టు ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలో పాల్గొన్నారు. రాత్రికి విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. తిరునాళ్ల సందర్భంగా కోలాటం, బ్రహ్మంగారి నాటక ప్రదర్శన, పాటకచేరీలు, వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు

కొనకనమిట్ల : మండలంలోని వెలుగొండలో శ్రీలక్ష్మిసమేత వెంకటేశ్వరుని బ్రహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం జరగనున్న తిరునాళ్లకు వివిధ జిల్లాల నుండి భక్తులు వేలాదిగా తరలిరానున్నారు. తిరునాళ్ల సందర్భంగా వెలుగొండ వెంకటేశ్వరుని దేవాలయం విద్యుత్‌కాంతులతో దేదివ్యమానంగా వెలుగుతోంది. శనివారం గజోత్సవం రోజున తిరుణాళ్ల నిర్వహిస్తారు. ఆదివారం రథోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. తిరునాళ్లకు వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకొని స్వామివారి దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వివిధ కులసంఘాల ఆధ్వర్యంలో అన్నదాన సత్రాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తుల దాహార్తిని తీర్చేందుకు ట్యాంకర్లను సిద్ధం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా టీడీపీ, వైసీపీ పార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభలుతో పాటు పాటకచేరీలు ఏర్పాటు చేస్తున్నారు.

తిరునాళ్లకు ప్రత్యేక బస్సులు

తిరునాళ్ల సందర్భంగా మార్కాపురం గార్లదిన్నె మీదుగా వెలుగొండకు, పొదిలి నుండి నాగిరెడ్డిపల్లి, గార్లదిన్నె గ్రామం మీదుగా ఆర్టీసీ డిపో వారు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడపనున్నారు.

పటిష్ట బందోబస్తు

తిరునాళ్లలో ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా దర్శి డీఎస్పీ లక్ష్మినారాయణ ఆదేశాలతో పొదిలి సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కొనకనమిట్ల ఎస్ఐ రాజ్‌కుమార్, సిబ్బందితో పటిష్ట బందోబస్తు చేయనున్నట్లు తెలిపారు.



నాగేంద్రునికి పూజలు చేస్తున్న మహిళలు, వెలిగొండ వేంకటేశ్వరస్వామి

రైల్వే ఆవరణలో అగ్నిప్రమాదం

మంటలను అదుపుచేసిన దర్శి అగ్నిమాపక వాహనం

దొనకొండ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): దొనకొండ రైల్వే ఆవరణలోని రాములవారి దేవాలయం సమీపంలోని ఖాళీ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టటంతో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. ఎండకు ఎండిన పిచ్చిచెట్లు రైల్వే అధికారులు రైల్వే ట్రాక్ కింద ఏర్పాటు చేసే రబ్బర్లు ఆ ప్రాంతంలో ఉంచటంతో మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గుర్తించిన రైల్వే పింఛనర్స్ అసోసియేషన్ కార్యదర్శి జయరాజ్ దర్శి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక ఎస్ఎఫ్వో సీహెచ్ జాలయ్య, ఎల్ఎఫ్ సురేంద్ర, డీవోపీ ఏసుబాబు, ఎఫ్ఎంలు మీరావలి, శ్రీనివాసులు హుటాహుటిన వచ్చి మంటలను అదుపుచేశారు.

నేడు ప్రజాదర్బార్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కనిగిరి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జరగనున్న ప్రజాదర్బార్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకుని వారి సమస్యలను పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపాయి. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారులకు విన్నవించుకుని పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు వారి సమస్యలను అర్జీ రూపంలో వారి ఆధార్, సెల్‌నెంబరును జత చేసి ఇవ్వాలని తెలిపారు.

'జీవాల డబ్బు చెల్లించాలంటూ ఒత్తిడి'

తాళ్లూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జీవాల(గొర్రెల)తాలూకు బాకీ చెల్లించని కారణంగా పోలీస్ స్టేషన్‌కు పిలిచి ఎస్సై ఎస్.మల్లికార్జునరావు దుర్భాషలాడి, సదరు వ్యక్తులకు డబ్బు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నాడని మాధవరం గ్రామానికి చెందిన తాటికొండ శ్రీను, జయమ్మ చెప్పారు. శుక్రవారం వారు ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. విఠలాపురం గ్రామానికి చెందిన గొల్లపూడి వెంకట్రావు వద్ద రూ.3.60 లక్షల విలువైన జీవాలను మధ్యవర్తిత్వం ద్వారా అమ్మించానన్నారు. ఆ వ్యక్తి డబ్బులు చెల్లించలేదని చెప్పారు. తాను చేసిన బాకీలు సైతం చెల్లించే స్థితిలేక ఐపీ దాఖలు చేశానన్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ స్టేషన్‌కు తనను పిలిపించి ఎస్సై దుర్భాషలాడారని కన్నీరుమున్నీరయ్యారు.

వైభవంగా ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల

పూజలు చేసిన పలువురు ప్రముఖులు




దర్శి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, టీడీపీ, జనసేన ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలు

దర్శి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): శ్రీ సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల శుక్రవారం దర్శి పట్టణంలో వైభవంగా జరిగింది. వేదపండితులు స్వామి వారికి తెల్లవారుజాము నుంచి అభిషేకం, లక్ష తమలార్చన చేశారు. మహిళలు పొంగళ్లు పొంగించి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్యలు పూజలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామి దర్శనం కోసం గంటల తరబడి క్యూలో వేచి ఉన్నారు. పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సూచనల మేరకు ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఇతర సేవా సంస్థలు అన్నదానం, మజ్జిగ, స్వీట్లు పంపిణీ చేశారు. మొత్తం మూడు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయగా అద్దంకి రోడ్డులో వైసీపీ తరపున విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. వీటిపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా గుడిలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు ఆమెకు స్వాగతం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. అలాగే ఎస్పీ ఏఆర్ దామోదర్, టీడీపీ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, తహసీల్దార్ ఎం శ్రావణ్ కుమార్, డీఎస్పీ లక్ష్మీనారాయణలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజాకార్యక్రమంలో సీఐలు వై రామారావు, రాఘవేంద్ర, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఆర్ఐ పరిటాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దుర్గాసమేత చెన్నమల్లేశ్వర స్వామికి సంప్రోక్షణ

ముండ్లమూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జమ్మలమడక గ్రామంలోని దుర్గా సమేత చెన్నమల్లేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 13న చోరీ జరిగిన నేపథ్యంలో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం వరకు మంగళ వాయిద్యాలతో మహా సంప్రోక్షణ కార్యక్రమం జరిగింది. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రజల భాగస్వామ్యంతో కేంద్రాలను ఆదాయ వనరులుగా తీర్చిదిద్దాలి



చెత్త కేంద్రంలోని ఎరువు తయారీని పరిశీలిస్తున్న ఉగ్ర

పామూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రజల భాగస్వామ్యంతో ఆదాయ వనరులుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. స్థానిక చెత్త నుంచి తయారీ కేంద్రంలో జరుగుతున్న ఎల్‌టీసీ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చెత్త సంపద కేంద్రంలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేంద్రంలోని నాడెప్ తొట్లను, వానపాములతో తయారైతున్న ఎరువులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో హనుమంతరావు, ఎంపీడీవో బ్రహ్మయ్య, ఈవోఆర్డీ అరవింద రెడ్డి, డీపీఆర్పీ రాఘవులు, టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, షేక్ ఖాజారహంతుల్లా ఎంపీటీసీ సభ్యులు ఆకుపాటి వెంకటేష్, ఉప్పలపాటి హరిబాబు, పిడుగు శ్రీనివాసులు, సయ్యద్ అమీర్‌బాబు, పందిటి హరీష్ పాల్గొన్నారు.

ఆత్మీయుడ్ని కోల్పోవడం తీరనిలోటు

మృధుస్వభావి మోరబోయిన హుసేన్‌రావును కోల్పోవడం తనకు తీరనిలోటని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు హుసేన్‌రావు గుండెపోటుతో మృతి చెందగా శుక్రవారం మోపాడుకు చేరుకొని మృతదేహంపై పూల మాల వేసి నివాళులర్పించారు. అందరినీ ఆత్మీయంగా పలకరించే హుసేన్‌రావు మృతి చెందటం బాధాకరమని టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజి చెప్పారు.

511 సర్వే నెంబరు భూమి.. ఎండోమెంట్ నుంచి తొలగింపు

- ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు

కనిగిరి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి పట్టణంలో ప్రధాన ప్రాంతమైన బొడ్డుచావిడి వద్ద ఉన్న 511 సర్వే నెంబరు భూమిని ఎండోమెంట్ నుంచి తొలగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే... 511 సర్వే నెంబరులో 32.95 సెంట్లు గ్రామకంఠం భూమి 22-ఏ(సీ) ఎండోమెంట్ భూమిగా నమోదు కావటంతో అక్కడ ఉన్న ఇంటి స్థలాలు కొనుగోలు, అమ్మకాల రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. దీంతో ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఆయా ప్రాంత ప్రజలు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర దృష్టికి తీసుకు వెళ్లి ఇబ్బందులను వివరించారు. దీంతో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి సానుకూలంగా స్పందించి 22ఏ భూముల నమోదైన 511 సర్వే నెంబరును తొలగించి సమస్యను పరిష్కరించి ఆన్‌లైన్‌లో మార్పులు చేయించి యథావిధిగా రిజిస్ట్రేషన్‌లు జరిగేట్లుగా ఉత్తర్వులు విడుదల చేశారు. సమస్యను పరిష్కరించి ప్రజలకు మేలు చేసిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలసి కృతజ్ఞతలు తెలిపారు.

మోదేపల్లి మేజర్‌కు సాగర్ జలాలు విడుదల



సాగర్ జలాలను విడుదల చేస్తున్న డీసీ చైర్మన్ శ్రీనివాసరావు

ముండ్లమూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోదేపల్లి మేజర్ సాగర్ కాలువకు శుక్రవారం వారాబందీ విధానంతో నీటిని డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు, ఎన్ఎస్‌పీ అధికారులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ పమిడిపాడు బ్రాంచ్ నుంచి మోదేపల్లి మేజర్‌కు నాలుగు వందల క్యూసెక్కుల నీరు తగ్గకుండా వారం రోజుల పాటు నీటిని విడుదల చేయాలన్నారు. మేజరు పరిధిలోని గాంధీనగర్, వేముల, ఈదర, అయోధ్యనగర్, వేములబండ, రమణారెడ్డిపాలెం, భీమవరం, ఉమామహేశ్వరఅగ్రహారం, పూరిమెట్ల, నాయుడుపాలెం, శంకరాపురం, పోలవరం, సుంకరవారిపాలెం, నూజెండ్లపల్లిలతో చివరి భూముల గ్రామాలైన కొటికలపూడి, కుంకుపాడు గ్రామాలకు సైతం సాగర్ జలాలను పంపిణీ చేసే విధంగా చూడాలని ఎన్ఎస్‌పీ జేఈలు సత్యనారాయణ, ప్రసాదులకు చెప్పారు. మూగ జీవాల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని చిలకలేరు వాగుకు కూడా నీటిని విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌పీ వర్క్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, సిబ్బంది అంజయ్య, కోటయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.

తూర్పుగంగవరంలో పదో తరగతి పరీక్షల్లో కాపీయింగ్!

తాళ్లూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పుగంగవరం గ్రామంలోని పదో తరగతి పరీక్ష కేంద్రంలో ఓ విద్యాసంస్థలో పని చేస్తున్న సబ్జెక్ట్ టీచర్‌ను పరీక్షరోజు అదే సబ్జెక్టుకు అదే కేంద్రానికి కేటాయించటంపై విమర్శలు వినవస్తున్నాయి. తాళ్లూరులో ఒక విద్యాసంస్థకు చెందిన 60 మంది విద్యార్థులను ఆ పరీక్షా కేంద్రానికి కేటాయించటం, ఆ స్కూల్‌కే చెందిన సిబ్బంది నిత్యం ఆ కేంద్రంలో మంచి నీరు అందిస్తూ తమ విద్యార్థులను కాపీయింగ్‌కు ప్రోత్సహిస్తున్నారని కొందరు చెబుతున్నారు. ముందుగానే ఇన్విజిలేటర్లను తమకు అనుకూలమైన వారిని నియమించుకుని కాపీయింగ్ ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం. జిల్లా అధికారులు, జిల్లావిద్యాశాఖాధికారి మండలంలోని పదో తరగతి పరీక్షలపై దృష్టిసారించి కాపీయింగ్ జరగకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేయకుంటే చర్యలు

డీఎల్‌పీవో పద్మ



ముండ్లమూరులో గ్రామ సచివాలయాన్ని సందర్శించిన డీఎల్‌పీవో పద్మ

ముండ్లమూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని ఒంగోలు డివిజన్ డీఎల్‌పీవో ఆర్ పద్మ ఆదేశించారు. ఆమె శుక్రవారం ముండ్లమూరులోని గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ముందుగా సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం వారితో మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో నూరుశాతం ఇంటి పన్ను వసూలే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఇంటి పన్ను నూరు శాతం వసూలు చేయటం వల్ల గ్రామాల అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి, అవసరాలు, వీధి లైట్లతో పాటు డంపింగ్ యార్డుల నిర్వహణ కోసం ఇంటిపన్ను నిధులు ఖర్చు పెట్టుకోవచ్చన్నారు. కార్యదర్శి అమరేశ్వరి, మహిళా సంరక్షణ కార్యదర్శి శాంతిప్రియ, డిజిటల్ అసిస్టెంట్ ప్రవీణ్ పాల్గొన్నారు.

పీసీపల్లి కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పీసీపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి) : పీసీపల్లి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 2025-26విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.సుజాత తెలిపారు. 6వ తరగతిలో 40సీట్లు, 7వ తరగతిలో 7సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరం(బైపీసీ)లో కూడా సీట్లు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అలాగే 7వ తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి కూడా ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని చెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, వివరాలకు 8886392717, 7702076045 నెంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

ముండ్లమూరు కేజీబీవీలో...

ముండ్లమూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కేజీబీవీలో 6వ తరగతి, ఇంటర్ ఎంపీసీలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రత్యేక అధికారి ఏ సునీత చెప్పారు. ఏప్రిల్ 11వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పేర్కొన్నారు. 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి బాలికల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు ఆమె పేర్కొన్నారు. ఏపీ కేజీబీవీ ఏపీసీఎఫ్ ఇన్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చెత్త సంపద కేంద్రాలను అభివృద్ధి చేస్తాం

వెలిగండ్ల, మార్చి 21 : (ఆంధ్రజ్యోతి) మండలంలోని అన్ని చెత్త సంపద కేంద్రాలను అభివృద్ధి పరిచి వర్మి కంపోస్టు తయారీ ప్రారంభించనున్నట్లు ఈవోఆర్డీ అన్నమ్మ చెప్పారు. శుక్రవారం మండలంలోని నాగిరెడ్డిపల్లిలో చెత్త సంపద కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటా ఉత్పత్తయ్యే చెత్తను ఎరువుగా మార్చి పంచాయతీలకు ఆదాయాన్ని అందించాలన్నారు. గ్రామాల అభివృద్ధి చెందాలంటే తప్పనిసరిగా పంచాయతీ కార్యదర్శులు పూర్తి బాధ్యత తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గిరి పాల్గొన్నారు.

సుందరీకరణ దిశగా దర్శి పట్టణం

దర్శి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రధాన రహదారుల్లో డివైడర్లపై మొక్కలు నాటి సుందరీకరణ దిశగా పనులు చేస్తున్నారు. నగర పంచాయతీ ఆధ్వర్యంలో దర్శి-అద్దంకి రోడ్డు, దర్శి-పొదిలి రోడ్డు, దర్శి-కురిచేడు రోడ్లల్లో డివైడర్లపై నీడనిచ్చే, పూలుపూసే మొక్కలు నాటారు. పచ్చదనంతో పాటు సుందరంగా కనిపించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అన్నీ వీధుల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తామని అధికారులు చెప్పారు.

అవీఇవీ

ఘనంగా బాబా మందిర నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



మాజీ, తాజా కార్యవర్గ కమిటీని సత్కరిస్తున్న సభ్యులు

కనిగిరి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి షిరిడీ సాయిబాబా దేవస్థానం నూతన కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం శుక్రవారం దేవస్థానంలో ఘనంగా నిర్వహించారు. కమిటీ అధ్యక్షులు కొప్పరపు వెంకటకోటా సత్యనారాయణ(సత్యాలు), గౌరవ అధ్యక్షుడు బోయిళ్ల తిరుపతిరెడ్డి, కుందురు తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలు ఓబులురెడ్డి, కోశాధికారి ముచ్చర్ల ధర్మారావు, సంయుక్త కార్యదర్శి కొలిపర్తి మారుతీ కుమార్, సంయుక్త కోశాధికారి వాగిచర్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు టంగుటూరి గోవిందరావు, శింగరాజు మాలకొండేశ్వరరావు, ఏసీ చెంచులు, ఇతర కార్యవర్గ సభ్యులు దేవకి శ్రీను, సానికొమ్ము తిరుపతిరెడ్డి(ఎస్‌టీఆర్), మాకినేని సాయిరాం, వెలుగూరి చంద్ర, వీరయ్యనాయుడు, శేఖర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఘనంగా సన్మానించారు.

మృతులకు టీడీపీ నేత లలిత్‌సాగర్ నివాళి



మృతదేహాల వద్ద నివాళులు అర్పిస్తున్న లలిత్ సాగర్

కురిచేడు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కురిచేడు పడమర దళితవాడలో చెరువులో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందిన ఇద్దరు విద్యార్థుల మృతదేహాలను నియోజకవర్గ టీడీపీ నేత కడియాల లలిత్ సాగర్ సందర్శించి వారి తల్లిదండ్రులకు సానుభూతి తెలిపారు. వారికి తమ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ఆయన తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఆమెను లక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటికే అన్నీ చెరువులకు నీరు నింపామని, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయిస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చినట్లు డాక్టర్ లక్ష్మి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో అంతర్గత రోడ్లు, మురికి కాల్వల నిర్మాణాలకు నిధులు విడుదల చేయాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ దర్శి మండలంలోని తిమ్మాయిపాలెం టూ ఎస్టీ కాలనీ, అదేవిధంగా కట్టుబడివారిపాలెం ఎస్టీ కాలనీ రోడ్లు నిర్మించేందుకు రూ.50 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపినట్లు వివరించారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

పామూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆకులవీధిలో మహబూబ్‌సుభాని స్వామి దర్గా వద్ద రంజాన్ ఉపవాసాలు ఆచరిస్తున్న ముస్లింలకు శుక్రవారం పామూరు పంచాయతీ వార్డు మెంబర్ ఉప్పలపాటి హరిబాబు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. మత సామరస్యానికి చిహ్నంగా జరిగే ఇఫ్తార్‌లో ఉపవాసాలు ఆచరిస్తున్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బండ్ల నారాయణ, ఈర్ల సత్యం, హరేరాం, వెంకటస్వామి పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన డీఈవో

కురిచేడు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను శుక్రవారం డీఈవో కిరణ్ కుమార్ తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. గణితం పరీక్షకు ఇన్విజిలేటర్లు పరీక్షా కేంద్రాలు మారాలని సూచించారు. అందుకు అనుగుణంగా గతంలోనే ఎవరెవరు ఏయే పరీక్షాకేంద్రాలలో రిపోర్టు చేయాలో తెలియజేశామన్నారు. ఎంఈవో వస్రాం నాయక్ పాల్గొన్నారు.

పామూరులో...


పామూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పామూరులో జరుగుతున్న 10వ తరగతి పరీక్ష కేంద్రాలను శుక్రవారం ఒంగోలు ఫ్లయింగ్ స్క్వాడ్ కేవీ రాంబాబు తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రశాంతంగా పరీక్షలు జరుగుతున్నాయని, విద్యార్థులకు అన్ని వసతులు కల్పించారని చెప్పారు.

దేవస్థానానికి భూమి అప్పగింత

పామూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానానికి సంబంధించిన భజంత్రీల సర్వీసు మాన్యం సర్వే నెంబర్ 398/2లోగల 63 సెంట్ల భూమిని గతంలో తమ పూర్వీకులు తెలియక కొనుగోలు చేశారని, అందుకే తిరిగి గుడికి ఇచ్చేస్తున్నామని బయ్యపు రామిరెడ్డి కుటుంబ సభ్యులు చెప్పారు. ఆ భూమిని శుక్రవారం తిరిగి ఇచ్చిన సందర్భంగా వారిని ఈవో నరసింహబాబు సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ కావిటి సుబ్బయ్య, బీజేపీ నాయకులు కేవీ రమణయ్య, బండ్ల నారాయణ పాల్గొన్నారు.

కుమారుడి ఆటోలో వెళ్తూ జారిపడి తల్లి మృతి

మరో ఇద్దరికి గాయాలు



వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ శ్రీరాం

కనిగిరి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఆటో మలుపు తిప్పుతుండగా అదుపు తప్పి తిరగబడిన ఘటనలో ఆటోకింద మహిళ జారిపడి మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలపరిధిలోని కంచర్లవారిపల్లి వద్ద చోటచేసుకుంది. ఎస్ఐ టీ శ్రీరాం తెలిపిన వివరాల ప్రకారం.... పట్టణంలోని కాశిరెడ్డికాలనీకి చెందిన ఇండ్లా లక్ష్మమ్మ(50) కూలి పనుల నిమిత్తం తలకొండపాడు గ్రామానికి హైవేపై ఆమె కుమారుడి ఆటోలో వెళ్తున్నారు. కంచర్లవారిపల్లి వద్ద హైవే నుంచి ఆటో మలుపు తిప్పాడు. ఈ క్రమంలో ఆటో అదుపు తప్పి పక్కకు ఒరిగి పడిపోయే క్రమంలో లోపల కూర్చున్న లక్ష్మమ్మ కింద పడిపోగా ఆటో ఆమెపై పడింది. ఈ ఘటనలో తలకు బలమైన గాయమై రక్తస్రావం కాగా అక్కడికక్కడే మృతి చెందింది. ఆటోలో ఉన్న ముగ్గురిలో మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సంఘటనాస్థలికి చేరుకుని పూర్వాపరాలు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భగత్‌సింగ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

ముండ్లమూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ భగత్‌సింగ్ జీవితాన్ని నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి కంకణాల ఆంజనేయులు చెప్పారు. మండలంలోని పోలవరం వద్ద వేద పార్మ కళాశాలలో భగత్‌సింగ్ 94వ వర్థంతి కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కేవీ పిచ్చయ్య, ప్రిన్సిపల్ ప్రవీణ్, మండల సీఐటీయూ కార్యదర్శి బోడపాటి హనుమంతరావు పాల్గొన్నారు.





బంతి బంతికీ.. బెట్టింగ్

రేటింగ్ ప్రకారం పందేలు..

మ్యాచ్ ప్రారంభం కాకముందే బాగా ఆడే టీమ్‌లను బట్టి బెట్టింగ్ యాప్‌ల్లో రేటింగ్ పెడతారు. యాప్‌లో చూపించే రేటింగ్ ప్రకారం పందేలు కాస్తారు. ఒక ఓవర్‌లో ఇన్ని పరుగులు తీయలేరు.. తీస్తారు, ఫలానా బ్యాట్స్‌మన్ ఎన్ని పరుగులు తీస్తాడు. ఎన్ని ఓవర్లలో ఎంత స్కోర్ చేస్తాడు.. ఇలా ఫ్యాన్సీలు ఆడుకునే అవకాశం ఇస్తారు. దీంతో మ్యాచ్ ఆరంభం నుంచి ముగిసే వరకు ప్రతి దానిపై పందేలకు జూదరులు సిద్ధమవుతున్నారు.

- యువతే లక్ష్యంగా మాఫియా సిద్ధం
- నేటి నుంచి ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు
- ఆన్‌లైన్‌లో బహిరంగంగానే.. ప్రత్యేక యాప్‌లు
- జీవితాలను నాశనం చేస్తోన్న బెట్టింగ్‌లు
- గతంలో నరసరావుపేటలో ముగ్గురు బలవన్మరణం
- మే 25 వరకు పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచనలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఐపీఎల్‌కు క్రికెట్ క్రీడాకారులు సన్నద్ధమవుతుండగా.. పోటీలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తుండగా.. తమ అభిమాన క్రీడాకారుడి మెరుపులను చూసి మైమరిచేందుకు అభిమానులు ఎదురు చూస్తుండగా.. బెట్టింగ్‌లకు బుకీలు, పంటర్లు సిద్ధమవుతున్నారు. శనివారం నుంచి ఐపీఎల్ పోటీలు ప్రారంభం కానున్నాయి. దీంతో యువతే లక్ష్యంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో బెట్టింగ్‌ల మాఫియా ఏర్పాట్లు చేసుకుంటోంది. ప్రతీ బాల్‌కు బెట్టింగ్ నిర్వహించేందుకు ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లను సిద్ధం చేసుకుంటున్నది. ఈ సారైనా డబ్బు సంపాదించాలని అత్యాసతో జూదరులు సమాయత్తమవుతున్నారు. సాంకేతికతను మాఫియా అందిపుచ్చుకుని బెట్టింగ్‌లను నిర్వహించేందుకు సిద్ధమైంది. బెట్టింగ్ విధానంలోనూ మార్పులు వచ్చాయి. ఆన్‌లైన్‌లో ప్రత్యేకంగా క్రికెట్ కోసం యాప్‌లు వచ్చాయి. దీంతో ఫోన్ ద్వారా నేరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. బెట్టింగ్ నిర్వహించేవారు సదరు యాప్స్ వివరాలు ముందుగా తెలియజేస్తారు. పందేలు కాసేవారి నుంచి ముందుగా కొంత నగదును యూపీఐ విధానంలో అడ్వాన్స్‌గా వసూలు చేస్తారు. నగదు ఎవరికి పంపుతున్నారో తెలియకుండా మాఫియా జాగ్రత్తలు తీసుకుంటోంది. యాప్‌లు నిర్వహించేది ఎవరు.. వారు ఎక్కడ ఉంటారన్న సమాచారం కూడా బయటకు రానివ్వరు. నగదు జమయ్యాక మ్యాచ్ ప్రారంభం నుంచి చివరి వరకు బెట్టింగ్‌కు అవకాశం కల్పిస్తారు.

పిల్లల్ని కాపాడండని తల్లిదండ్రుల వినతి

ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రారంభమవుతున్న నేపథ్యంలో బెట్టింగ్‌ల నుంచి తమ పిల్లలను కాపాడాలని కోరుతూ పలువురు తల్లిదండ్రులు ఎస్పీ కంచి శ్రీనివాస రావుకు వినతిపత్రం అందజేశారు. గతంలో లేఖలు రాసినా పోలీసు అధికారులు చర్యలు తీసుకోలేదని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బెట్టింగ్‌లు నిర్వహించే వ్యక్తులకు కొందరు పోలీసు అధికారులు సహకరించారని కూడా తెలిపారు. రొంపిచర్ల మండలానికి చెందిన ఇద్దరు బుకీల నుంచి తమ పిల్లలను రక్షించాలని వేడుకున్నారు. పోలీసు శాఖ బెట్టింగ్‌ల విషయంలో ఏవిధంగా స్పందిస్తుందో చూడాలి. గత సీజన్‌లో రొంపిచర్ల మండలం అలవాలకు చెందిన ఓ యువకుడు బెట్టింగ్‌లతో నష్టపోయి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇదే మండలానికి చెందిన మరో యువకుడు, నరసరావుపేట ప్రకాష్‌నగర్‌కు చెందిన మరో యువకుడు కూడా ఆత్మహత్య చేసుకున్నారు. బెట్టింగ్‌లతో యువకులు బలవన్మరణం చెందుతున్నా వీటిని అరికట్టడంలో పోలీసు శాఖ స్పందించడంలేదన్న విమర్శలున్నాయి.

కొత్త పుంతలు..

బెట్టింగ్‌లు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. గతంలో ఓ ప్రాంతంలో ఉండి నగదును తీసుకుని నేరుగా ఒకరితో ఒకరు పందేలు కట్టేవారు. ఆ పరిస్థితులు ఇప్పుడు లేవు. పంటర్లు, బుకీలు హోటళ్ల, లాడ్జీల్లో గదులను అద్దెకు తీసుకుని మ్యాచ్‌ల గెలుపు ఓటములపై పందేలు కాసేవారు. ఈ ఓవర్‌లో ఇన్ని పరుగులు వస్తాయి.. ఏ బ్యాట్స్‌మన్ ఎంత స్కోరు చేస్తాడు.. ఈ బాల్‌కు ఎన్ని పరుగులు వస్తాయి.. తదితరాలపై నగదు కలుపుకుని పందేలు కాసేవారు. అయితే సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇలాంటి పందేలు తగ్గిపోయాయి. సెల్‌ఫోన్‌లోనే బెట్టింగ్‌లు కాయడం.. నగదు మార్పిడి జరిగిపోతోంది. ఎవరు ఎవరికి నగదు పంపిస్తారు.. ఎవరు బెట్టింగ్ నిర్వహిస్తారు.. అన్న విషయాలు బహిర్గతం కాకుండా అంతా జరిగిపోతుంటోంది. ఈ పరిస్థితుల్లో శనివారం నుంచి ప్రారంభమై మే 25 వరకు జరిగే ఐపీఎల్ మ్యాచ్‌ల్లో బెట్టింగ్‌లతో నష్టపోయి ఎంతోమంది వీధిన పడనున్నారు.

ఆసక్తితో.. అప్పుల ఊబిలో యువత

క్రికెట్ పందేల వైపు యువతే ఎక్కువగా ఆసక్తి చూపుతోంది. కళాశాల విద్యార్థులు మొబైల్ యాప్ ద్వారా అత్యధికంగా పందేలు కాస్తున్నారు. మొబైల్‌లు, ల్యాప్‌టాప్‌లు, బంగారు చైన్లు, బైకులు, కార్లు కుదవ పెట్టి అప్పులు తీసుకుని పందేలు కాస్తున్నారు. చివరకు జీవితాలనే నాశనం చేసుకుంటున్నారు. పిల్లలపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షిస్తూ బెట్టింగ్ మాయలో చిక్కుకోకుండా చూడాలని పలువురు సూచిస్తున్నారు. మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు ఫోన్లతో పిల్లలు ఏమి చేస్తున్నారో గమనించాలని, విలువైన వస్తువులు కనిపించకపోయినా, ఒత్తిడికి, ఆందోళనకు గురవుతున్నా పెద్దలు అప్రమత్తమవ్వాలని హెచ్చరిస్తున్నారు. ఏదిఏమైనా మే 25 వరకు తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలంటున్నారు.

డెకాయ్ కస్టమర్లతో.. ఆపరేషన్ గరుడ

- మందుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు
- డాక్టర్ చీటీ లేకుండా మందుల విక్రయాలపై కేసులు

బాపట్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, ప ల్నాడు, బాపట్ల జిల్లా లో శుక్రవారం విజిలెన్స్, పోలీసు శాఖలతో కలసి ఔషధ నియంత్రణ శాఖ అధికారులు రిటైల్ మందుల దుకాణాలపై విస్తృత స్థాయిలో తనిఖీలు జరిపారు. ఎప్పటిలా జరిపే మొక్కుబడి తనిఖీల్లా కాకుండా ఈ దఫా.. ముందస్తుగా మఫ్టీలో ఉన్న పోలీసులను డెకాయ్ కస్ట మ ర్లుగా (సాధారణ వినియోగదారుడుగా) దుకాణాలకు పంపారు. వీరికి సదరు



బాపట్ల : మందులషాపులో తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

దుకాణదారుడు డాక్టర్ చీటీ లేకుండా.. మత్తు బిళ్లలు, యాంటీ బయోటిక్ మందులు విక్రయించడంతో.. సదరు పోలీసులనే సాక్షులుగా పెట్టి కేసులు నమోదు చేశారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు ఆపరేషన్ గరుడ పేరుతో మందుల దుకాణాలపై దాడులు, ఆకస్మిక తనిఖీలు జరిపినట్లు అధికారులు తెలిపారు. మత్తు మందులకు యువత బానిసలుగా మారుతున్నట్లు ఆరోపణలు రావడం, పలువురు రిటైల్ డ్రగ్గిస్టులు ఈ చట్టవి రుద్ధంగా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో ఈ తనిఖీలు చేపట్టామన్నారు. గుంటూరులో మూడు, పల్నాడులో రెండు, బాపట్లలో రెండు మందుల షాపులపై కేసులు నమోదు చేసినట్లు గుంటూరు జిల్లా విజిలెన్స్ ఎస్పీ దువ్వారపు సూర్యశ్రావణ్‌కుమార్ తెలిపారు. గుం టూరులో జరిగిన తనిఖీల్లో సీఐలు చంద్రశేఖర్, శివాజీ తది తరులు పాల్గొన్నారు. నరసరావుపేట బరం పేటలోని భవ్య శ్రీ మెడికల్ షాప్ గోడౌన్లో అనుమ తులు లేకుండా భారీ స్థాయిలో ఔషధాలు నిల్వ ఉంచినట్లు గుర్తించిన అధికారులు వాటిని సీజ్ చేసినట్లు సమాచారం. ఈ తనిఖీల్లో నరసరా వుపేట రూరల్ సీఐ పీ రామ కృష్ణ, డ్రగ్ ఇన్స్పెక్టర్లు మంగమ్మ, పద్మ, విజిలెన్స్ ఏఈ శివనారాయణ, ఎఫ్ఆర్‌వో సైదులు పాల్గొ న్నారు. మత్తు బిళ్లలు, మత్తు ఇంజక్షన్ల ఘటనలు వెలుగుచూసిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా మందుల దుకాణాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బాపట్లలో అధికారుల తనిఖీలతో కొంతమంది షాపులు మూసివేశారు.

ఈ దాడుల్లో ఈగల్ టీమ్ హెడ్ విక్టర్, సీఐ కోటేశ్వర రావు, పట్టణ సీఐ ఆర్. రాంబాబు, విజిలెన్స్ అధికారి ఆదినారాయణచౌదరి, డ్రగ్ ఇన్స్పెక్టర్ వి.సాంబ శివరావు పాల్గొన్నారు.

భలే చౌక బేరం..



ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే బియ్యానికి విలువ పెరుగుతోంది. బియ్యం సేకరణలో పోటీ పెరగడం.. మాఫియా రంగ ప్రవేశంతో పేదలకు వచ్చే రేషన్‌లో బియ్యం అందడంలేదు. బియ్యం బదులు నగదు చేతిలో పెట్టేస్తున్నారు. గతంలో రేషన్ బియ్యం తీసుకుని దానిని తినలేక అమ్ముకునే వారు. కానీ గత కొంతకాలంగా అసలు బియ్యం ఇవ్వకుండానే లబ్ధిదారులకు నేరుగా నగదు ఇచ్చేస్తున్నారు. బియ్యాన్ని రేషన్ రాబందులు తన్నుకుపోతున్నాయి. రేషన్ షాపులకు వచ్చిన బియ్యం ఆ షాపుల్లోనే మాయం చేసేస్తున్నారు. కొందరు అధికారు లకు.. అధికార పార్టీ నేతలకు నెలవారీ మామూళ్లు ఇస్తున్నా రన్న ఆరోపణలున్నాయి. రేషన్ పంపిణీపై అధికారుల పర్య వేక్షణ పూర్తిగా కొరవడింది. నెలవారీ తనిఖీలు నిర్వహిం చడాన్ని కూడా వారు విస్మరించారు. ఐదేళ్లు వైసీపీ నేతల కను సన్నల్లో జరిగినట్లుగానే ప్రస్తుత అధికార పార్టీ నేతలు బియ్యం దందాను కొనసాగిస్తున్నారు. అధికార పార్టీ నేతలు కొంద రు బియ్యం అక్రమ వ్యాపారాన్ని అదాయ వనరుగా మార్చుకున్నారన్న ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.24 (శనివారం సాయంత్రం)
సహరి : 4.54 ఆదివారం ఉదయం)

ఉచిత బియ్యానికి.. రూ.12
రేషన్ బదులు లబ్ధిదారులకు నగదు

- జిల్లాలో యథేచ్ఛగా మాఫియా దందా
- నగదు బదిలీ కేంద్రాలుగా ఎండీయూలు
- పోటీ పడి మరీ బొక్కేస్తున్న అక్రమార్కులు
- పాలక పార్టీ నేతల అండతో బరితెగిస్తున్నారు
- గుంటూరులో బియ్యం సేకరణకు సిండికేట్ వేలం
- పల్నాడు జిల్లాలో రేషన్ డీలర్లే దళారుల అవతారం
- బాపట్ల జిల్లాలో నెలవారీ కప్పం.. దర్జాగా అక్రమార్జన

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పేదల ఇళ్లలో ఉడకాల్సిన రేషన్ బియ్యం.. పెద్దలకు రూ.కోట్లు కురిపిస్తోంది. రూ.కోట్ల ఆదాయం కనిపిస్తుండటంతో అక్రమార్కులు సిండికేట్‌గా మారి ఎక్కడికక్కడ బియ్యాన్ని సేకరించి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గత ఐదేళ్లలో ఊహించని రీతిలో పట్టణాల నుంచి గ్రామాల వరకు పాకిన బియ్యం మాఫియా పేదల బియ్యాన్ని మింగేస్తోంది. ఈ క్రమంలో అధికారులు అక్రమాలను అడ్డుకోకుండా మామూళ్లతో మాయ చేస్తున్నారు. ప్రాంతాల వారీగా బియ్యం దందాను వ్యవస్థీకృతం చేయడంలో వైసీపీ నేతలకు ఏ మాత్రం తీసిపోని రీతిలో ప్రస్తుత పాలకపార్టీ నాయకుల తీరు ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ దందాలో ఎవరైనా బయటి వ్యక్తులు ప్రవేశిస్తే నేతలే అధికారులకు ఫిర్యాదు చేసి వారిని కట్టడి చేస్తున్నారు. కొందరు నేతలు రేషన్ బియ్యాన్ని ఆదాయ వనరుగా మార్చేసుకున్నారన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి ప్రతీ నెలా వేలాది క్వింటాళ్ల రేషన్ బియ్యం నల్ల బజారుకు తరలిపోతోంది. బియ్యం కోటాకు బదులుగా ఎండీయూ వాహన దారులు కిలోకు రూ.12 వరకు లెక్క గట్టి మరీ కార్డుదారులకు నగదు ఇస్తున్నారు.

అధికారం అండ.. మాఫియా బరితెగింపు..

అధికార పార్టీ నేతల అండదండలతో బియ్యం అక్రమ వ్యాపారం విరాజిల్లుతోంది. కార్డు దారులకు ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం నిల్వల్లో సగం వరకు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నదంటే ఆశ్చర్యం కాదు. గుంటూరుకు చెందిన ఇద్దరు మాఫియా పెద్దలు మొత్తం గుంటూరు జిల్లాలోని రేషన్ మాఫియానంతటినీ శాశిస్తున్నారన్న విషయం సర్వత్రా విదితమే. తెనాలిలో వైసీపీ ఎంపీటీసీ ఎండీయూ వాహన ఆపరేటర్ ముసుగులో బియ్యాన్ని నలబజారుకు తరలిస్తూ ఇటీవల పట్టుబడటం అక్రమార్కుల బరితెగింపునకు నిదర్శనంగా కనిపిస్తోంది. తెనాలి ప్రాంతంలో రైస్ మిల్లుల్లో రేషన్ బియ్యాన్ని (మిగతా 4వ పేజీలో)

అప్పుడు వాళ్లు.. ఇప్పుడు వీళ్లు

ప్రభుత్వం మారింది కానీ బియ్యం దందా ఆగలేదు. అదే దోపిడీ.. అవే కమీషన్లు. దందాలోని వ్యక్తులు కూడా వారే. వీరికి గతంలో, ఇప్పుడు అధికార పార్టీ నేతల అండగా ఉంటున్నారు. ఏడు నెలల వ్యవధిలో 103 వరకు 6ఏ కేసులు పెట్టినా దందాకు మాత్రం అడ్డుకట్ట పడడం లేదు. పైగా ఈ కేసులు తమకేం కొత్త కాదన్న రీతిలో మళ్లీమళ్లీ బియ్యాన్ని మాఫియా బొక్కేస్తోంది. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని ఓ గ్రామంలో అధికారులు తనిఖీలకు వెళ్లగా తాము పాలక పార్టీ నేతల అనుచరులమని చెప్పి వాగ్వాదానికి దిగారు. చీరాల నియోజకవర్గంలో అయితే ఏకంగా బేరాలాడి మరీ నెల వారీ ఫిక్స్ చేసు కుని దందాను నడిపిస్తున్నారు. కారంచేడు పరిధిలోని ఓ రైస్ మిల్లు బియ్యం దందాకు ప్రసిద్ధి. గత ప్రభుత్వంలో ఈ మిల్లు పైనే దాదాపు పది వరకు 6ఏ కేసులు నమోదయ్యాయి ఇప్పుడు కూడా ఆ మిల్లు కేంద్రంగానే రేషన్ దందా నడుస్తోంది. చీరాల నియోజకవర్గంలో రేషన్ మాఫియా రేటు నెలకు రూ.25 లక్షలు. ఈ మొత్తాలు అందుకునేది కీలక నేతలే. అంతిమంగా ఒంగోలులో ఉండే ఓ వ్యక్తికి ఈ దందా బాధ్యతలు అప్పగించారని సమాచారం. బాపట్ల టౌన్, రూరల్‌లో టీడీపీ ఓ ద్వితీయశ్రేణి నేత ఆధ్వర్యంలో దందా నడుస్తుండగా, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలా ల పరిధిలో గత ప్రభుత్వంలో చేసిన వ్యక్తే ఇప్పటికీ అక్రమ రవాణా చేస్తున్నారు. రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ప్రాంతాన్ని బట్టి నెల వారీ కప్పాన్ని ఫిక్స్ చేశారు.

బడి బస్సును ఢీ కొట్టిన లారీ

డ్రైవర్ సహా ఏడుగురు విద్యార్థులకు గాయాలు



గాయపడిన విద్యార్థులు



దెబ్బతిన్న స్కూల్ బస్ వెనుక భాగం

అద్దంకి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఎక్కించుకునేందుకు ఆగి ఉన్న పాఠశాల బస్సును వెనుక నుంచి లారీ ఢీ కొట్టిన ఘటన మండలంలోని గోపాలపురం వద్ద నామ్ రోడ్డుపై శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్‌తో పాటు ఏడుగురు విద్యార్థులు గాయపడ్డారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. అద్దంకిలోని గ్రావెటీ స్కూల్ బస్సు బల్లికురవ మండలం కూకట్లపల్లి నుంచి బయలుదేరి ఆయా గ్రామాలలో విద్యార్థులను ఎక్కించుకుని వచ్చే క్రమంలో నామ్ రోడ్డుపై ఆగింది. ఈ సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ బస్సును ఢీ కొట్టింది. దీంతో బస్సులో ఉన్న విద్యార్థులు వేదాన్స్, ఆదిత్యసాయి, నందన, పూజితలకు బలమైన గాయాలు కాగా, నాగదివ్య, కావ్యాంజలి, మహిత, రాజ్యలక్ష్మిలతో పాటు డ్రైవర్ శ్రీనివాసరావులకు స్వల్ప గాయాలయ్యాయి. 108లో వారిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనతో ఆయా గ్రామాల నుంచి సంఘటనా స్థలానికి, ప్రభుత్వ వైద్యశాలకు పరుగులు తీశారు. చికిత్స అనంతరం విద్యార్థులను తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకువెళ్లారు. ప్రమాద స్థలాన్ని సీఐ సుబ్బరాజు పరిశీలించారు. అనంతరం వైద్యశాలలో విద్యార్థులతో మాట్లాడి సంఘటన వివరాలను తెలుసుకున్నారు. ఆస్పత్రిలో విద్యార్థులను చీరాల విద్యాశాఖాధికారి గంగాధర్ పరామర్శించారు.

బాపట్ల గీతానికి మనో గళం

బాపట్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా విశిష్టతను తెలిచెప్పేలా గీతాన్ని ఆలపించాలని ప్రముఖ సినీగాయకుడు మనో నాగూర్‌బాబును కలెక్టర్ జె.వెంకటమురళి కోరారు. శుక్రవారం చందోలులోని శ్రీబగళాముఖి అమ్మవారి దేవాలయానికి వెళుతూ మార్గమధ్యలో కలెక్టర్‌ను మనో కలిశారు. ఈ సందర్భంగా జిల్లా గీతంపై మనోతో కలెక్టర్ చర్చించారు. జిల్లాగీతాన్ని ఆలపించడానికి ఆయన అంగీకరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు భావపురి పుస్తకోద్యమ సమితి వారు బాపట్ల చరిత్ర ప్రతిబింబించేవిధంగా గీత రచనపై పోటీ నిర్వహించగా 10 ఎంట్రీలు వచ్చాయి. భావపురి రచయతల సంఘం కార్యదర్శి నందిరాజు విజయ్‌కుమార్ రచించిన గీతాన్ని ఎంపిక చేశారు.



కరపత్రాన్ని నాగూర్‌బాబుకు అందజేస్తున్న కలెక్టర్ వెంకటమురళి



బాపట్ల రూరల్ పరిధిలోని
ఓ మిల్లులో భారీగా పట్టుబడిన బియ్యం (ఫైల్)

భలే చౌక బేరం

(3వ పేజీ తరువాయి)

పాలిష్‌పట్టి తరలిస్తుండగా గతంలో పట్టుబడిన సంఘటనలు ఉన్నాయి. తెనాలి ప్రాంతంలో సేకరించిన బియ్యాన్ని ఎక్కువగా పల్నాడు, గోదావరి జిల్లాలలోని వ్యాపారులకు రూ.20 వరకు అమ్ముతున్నారు. వేమూరు, అమృతలూరు, చుండూరు మండలాల్లోని రైస్ మిల్లులను లీజుకు తీసుకుని అక్రమ వ్యాపారానికి అడ్డాగా మారుస్తున్నారు. పల్నాడు జిల్లాలో డీలర్లు దళారుల అవతారం ఎత్తి లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి అక్రమార్కులకు అందజేస్తున్నారు. జిల్లాలో బియ్యం అక్రమ వ్యాపారం రూ.11 కోట్లు సాగుతుండగా మామూళ్లు కూడా అదే స్థాయిలో చేతులు మారుతున్నాయి. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గతంలో పౌర సరఫరాల మంత్రి మనోహర్ తనిఖీలు చేసినప్పటికీ మాఫియా దోపిడీలో ఎలాంటి మార్పూ లేదు. బియ్యం మాఫియా అక్రమాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా, మీడియాలో కథనాలు వస్తున్నా అధికారులు కనీసం కూడా పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. బాపట్ల జిల్లాలో గడచిన ఆరు నెలల వ్యవధిలో బియ్యం దొంగలపై 103 వరకు 6ఏ కేసులు నమోదు చేయగా 4180 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు. అయినా ఈ కేసులేవీ వారి దందాను అడ్డుకోలేకపోతున్నాయి. తూతూమంత్రంగా దాడులు.. మొక్కుబడి కేసులు తప్పితే బియ్యం మాఫియా మూలాలను అరికట్టడంపై అధికారులు దృష్టి సారించడంలేదన్న విమర్శలున్నాయి. అధికారులు ఎవరిపై దాడులు చేయాలో కూడా నేతలే నిర్దేశించే స్థాయికి బియ్యం మాఫియా వేళ్లూనుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

బియ్యం బ్లాక్ మార్కెట్ ఇలా..

ఎక్కడికక్కడ కార్డుదారులకు ఎండీయూ వాహనదారులు, డీలర్లు రూ.12 వరకు నగదు ఇచ్చి బియ్యాన్ని సేకరిస్తున్నారు. వీరి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి అక్రమార్కులు కిలో రూ.14 నుంచి రూ.16 వరకు కొనుగోలు చేస్తున్నారు. స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసుకుని బియ్యం తరలిస్తున్నారు. కొన్ని చోట్ల మిల్లులను లీజుకు తీసుకుని సేకరించిన బియ్యానికి ఒక పట్టు పాలిష్ వేసి గోతాలు మారుస్తున్నారు. దీనిని టోకు వ్యాపారి కిలోకు రూ.28 ఇచ్చి అక్రమార్కుల నుంచి కొనుగోలు చేస్తున్నాడు. మండల, నియోజకవర్గ స్థాయి అక్రమార్కుల నుంచి కొనుగోలు చేసిన బియ్యం నిల్వలను రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. గతంలో కాకినాడ పోర్టుకు తరలించేవారు. కాకినాడ పోర్టులో తనిఖీల నేపథ్యంలో బియ్యం బ్లాక్ మార్కెట్ రూటు మారింది. ప్రస్తుతం గుజరాత్‌కు తరలిస్తున్నట్లు అక్రమార్కులు బహిరంగంగానే చెబుతున్నారు.



నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులతో నిర్వాహకులు

జాబ్‌మేళాలో 23 మందికి ఉద్యోగాలు

చీరాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని యువత ముందుకు సాగాలని వైఏప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మురళీ పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో జవహర్ విజ్ఞాన కేంద్రం, ఏపీ స్కిల్ హబ్, ఎంప్లాయ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా జరిగింది. ఈసందర్భంగా 76 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకాగా వారిలో 23 మంది ఉద్యోగాలకు ఎంపికయి నియామక పత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో సాయి ప్రసన్న, హారిక సౌగంధి, ధనుంజయ, సమీర్, సురేందర్ రెడ్డి, శ్రవణ్‌కుమార్, సుబ్బారెడ్డి, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి ఎమ్మార్పీఎస్ కృతజ్ఞతలు

అద్దంకిటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా అసెంబ్లీలో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చర్చించి తీర్మానం చేసి కేంద్ర ఎస్సీ కమిషన్‌కు రిపోర్టు పంపించడం పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ నాయకులు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్‌సీ సెల్ అధ్యక్షుడు వలపర్ల సుబ్బారావు, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు పూనూరి రమేష్, సీనియర్ నాయకులు పూనూరి నరేంద్ర, మందా నాగేశ్వరరావు, నాగిపోగు చక్రవర్తి, ఏసోబు, నాగరాజు, నేహేమియా, సామ్యూల్, బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూ సమస్యపై తహసీల్దార్ విచారణ

పంగులూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొండమూరు గ్రామంలో దీర్ఘ కాలంగా ఉన్న అసైన్డ్ భూ సమస్యపై తహసీల్దార్ సింగారావు శుక్రవారం విచారణ చేపట్టారు. సర్వే నెంబరు 108లో సంపెంగుల వెంకటరమణయ్య, సంపెంగుల రూతుమ్మల మధ్య సాగు భూమి విషయమై వివాదం నెలకొంది. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదు మేరకు భూ సమస్య పరిష్కారం కోసం గ్రామంలో ఇరువురిని విచారించారు. అనంతరం గ్రామంలోని రేషన్ డీలర్లతో మాట్లాడుతూ కార్డుదారుల ఈకేవైసీ త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్వో రవి, గ్రామ సర్వేయర్ పాల్గొన్నారు.



నారాకోడూరు గాయత్రి శక్తి పీఠంకు నగదు సాయం
అందిస్తున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

గాయత్రి శక్తిపీఠంకు విరాళం

చీరాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా నారాకోడూరు గాయత్రి శక్తి పీఠం, కల్యాణ మండపం, ప్రవచన మందిరానికి స్థానిక వాకర్స్ అసోసియేషన్ సభ్యులు చెక్క చెన్న నారాయణ రూ.లక్ష నగదు అందజేశారు. పీఠం స్థానిక ప్రతినిధులు డీవీఆర్ మూర్తికి సంబంధిత నగదును వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అందజేశారు.దీంతో ప్రతినిధులు నారాయణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు పోలుదాసు రామకృష్ణ, గురుప్రసాద్, జనార్దనరావు, మురళీకృష్ణ, రమేష్‌బాబు, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల సమస్యలపై కదలిక

క్షేత్రస్థాయిలో అధికారుల పర్యటనలు
గ్రామస్థుల సమస్యలను తెలుసుకుంటున్న ప్రాజెక్టు అధికారులు
ప్రజల్లో చిగురిస్తున్న ఆశలు

అద్దంకి, మార్చి21(ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల నుంచి పరిష్కారానికి నోచుకోని గుండ్లకమ్మ ముంపు గ్రామాల సమస్యల పరిష్కారంపై అధికారులలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఇటీవల గుండ్లకమ్మ ముంపు గ్రామాల ప్రజల సమస్యల పరిష్కారంపై కొరిశపాడు మండలం తమ్మవరంలో మంత్రి రవికుమార్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ప్రాజెక్టు ,రెవెన్యూ అధికారులు హాజరయ్యారు. ముంపు గ్రామాలు, పునరావాసకాలనీల సమస్యలపై క్షేత్ర స్థాయి పరిశీలన చేసి పరిష్కారం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. దీంతో ఇప్పటికే గుండ్లకమ్మ ప్రాజెక్టు అధికారులు యర్రబాలెం, మణికేశ్వరం, ధేనువకొండ, తిమ్మారెడ్డిపాలెం తదితర గ్రామాలలో గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతికుమారి పర్యటించి క్షేత్ర స్థాయిలో సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పునరావాస కాలనీలలో కల్పించాల్సిన మౌలిక వసతులను పరిశీలించారు. అదే సమయమంలో ఆయా గ్రామాలలో ఇంకా అందని ప్యాకేజీ, పరిహారం, ఇళ్ల స్థలాల సమస్యలను, జాబితాలను అడిగి తెలుసుకున్నారు. ఎట్టకేలకు మంత్రి రవికుమార్ ఆదేశాలతో గుండ్లకమ్మ ప్రాజెక్టు అధికారులలో కదలిక రావటం, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలలో ఆశలు చిగురిస్తున్నాయి. అదే సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రాజెక్టులపై అధిక ప్రాధాన్యత ఇస్తుండటంతో త్వరలో ముంపు గ్రామాల ప్రజలు, పునరావాస కాలనీల సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉందని ఆయా గ్రామాల ప్రజలు వేయి కళ్లతో వేచి చూస్తున్నారు.



మణికేశ్వరం వద్ద గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను
పరిశీలిస్తున్న ఎస్‌డీసీ విజయజ్యోతి కుమారి(ఫైల్)

కుక్కలతో జనం బెంబేలు

మేదరమెట్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కొరిశపాడు మండలంలోని అన్ని గ్రామాలలో కుక్కల బెడద ఎక్కువయింది. మండల కేంద్రం అయిన కొరిశపాడులో ప్రజలను, విద్యార్థులను కుక్కలు కరిచాయి. ఇటీవల కాలంలో ప్రాథమిక పాఠశాలకు వెళ్లే విద్యార్థులు కుక్కలు చూసి భయడుతున్నారు. పొలం పనులకు, గ్రేడింగ్ పనులకు వెళ్లే మహిళలను కుక్కలు వెంబడించి మరీ కరుస్తున్నాయి. ద్విచక్రవాహనాలపై వెళ్లే వారిని ఒక్కసారిగా కుక్కలు అడ్డం రావడంతో కింద పడి గాయపడుతున్నారు. మేజర్ పంచాయతీ అయిన మేదరమెట్ల, రావినూతల, పమిడిపాడు గ్రామాలతో పాటు మండలంలోని పలు గ్రామాలల్లో కుక్కల వలన గాయపడిన వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నది. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రేబిస్ ఇంజక్షన్ కోసం వచ్చే వారు ఎక్కువయ్యారు. గ్రామాలలో పంచాయతీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈ సమస్య గత కొన్నేళ్లుగా ప్రజలను ఇబ్బంది పెడుతూనే ఉంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి గ్రామాలలో కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కొరిశపాడులో ప్రధాన రహదారిపై సంచరిస్తున్న వీధి కుక్కలు

నర్సరీలు నాణ్యతతో సాగుచేయాలి

ఉద్యాన అధికారి జెన్నెమ్మ

మార్టూరు,మార్చి21(ఆంధ్రజ్యోతి): ఉద్యానరైతులు నర్సరీలను రిజిస్ట్రేషన్ చేయించుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యతతో సాగుచేస్తూ ఉత్పత్తిని సాధించాలని జిల్లా ఉద్యాన అధికారి పి. జెన్నెమ్మ అన్నారు. శుక్రవారం మార్టూరు మండల పరిధిలో రాజుపాలెం సెంటర్ సమీపంలోని సాయి బాలాజీ కల్యాణ మండపంలో జిల్లాలోని ఉద్యాన పంటలను సాగుచేసే రైతులకు నర్సరీల నిర్వహణపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెన్నెమ్మ అధ్యక్షత వహించి మాట్లాడారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన దర్శి ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త ఎం.రవీంద్రబాబు మాట్లాడుతూ షేడ్‌నెట్‌ల ద్వారా నర్సరీలను సాగుచేయడం, వాటిలో కూరగాయలను, పూలను పెంచడంపై రైతులకు పలు సూచనలు చేశారు. మరో ముఖ్య అతిథి మిరప శాస్త్రవేత్త ఎ. రజని మాట్లాడుతూ మిరప పంట సాగులో పురుగులు,తెగుళ్లు, వాటి నివారణోపాయాలను రైతులకు చక్కగా విశదీకరించారు. ఏపీఎంఐపీ జిల్లా పీడీ బీవీ రమణ , డిజిటల్ గ్రీన్ సంస్థ నుంచి విజయరేఖరెడ్డి,మార్టూరు ఉద్యాన అధికారి బి. హనుమంతనాయక్, ఇంకా అద్దంకి, చీరాల, పర్చూరు, కొల్లూరు, ఉద్యాన అధికారులు,మార్టూరు ఏడీఏ కేవీ శ్రీనివాసరావు, బొబ్బేపల్లి రైతు పి.శరత్ బాబు,వ్యవసాయ అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహనా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి
జెన్నెమ్మ, వేదికపై శాస్త్రవేత్తలు రవీంద్రబాబు, రజని తదితరులు

షార్ట్‌పుట్‌లో ఎమ్మెల్యే కొండయ్యకు బహుమతి

చీరాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఏపీ లెజిస్లేటివ్స్ స్పోర్ట్స్ మీట్ 2025 షార్ట్‌పుట్ పోటీల్లో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాల్గొని బహుమతి సాధించారు. గురువారం జరిగిన పోటీల్లో సహచర ఎమ్మెల్యేలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. దీంతో సీఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

కార్యక్రమంలో డిప్యూ టీ సీఎం పవన్ కల్యాణ్, స్పీకర్ అయ్యన్న పా త్రుడు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సీలు పాల్గొన్నారు.

చేనేతల సమస్యల పరిష్కారానికి సహకరించండి

చేనేత కార్మికులకు ఏడాదంతా చేతి నిండ ఉపాధి కల్పించాలని వారి సమస్యల పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషిచేయాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శుక్రవారం హ్యాండ్‌లూమ్ చైర్మన్ సజ్జా హేమలతతో కలిసి రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి సవితను కలిసి స్థానికంగా చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. నేతన్నల భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణమరాజు నుంచి అవార్డును అందుకుంటున్న ఎమ్మెల్యే కొండయ్య. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, స్పీకర్ అయ్యన్న పాత్రుడు తదితరులు



సరిచేయకముందు

ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేసిన అధికారులు

అద్దంకి, మార్చి21(ఆంధ్రజ్యోతి): ఒరిగిన విద్యుత్ స్తంభాలను శుక్రవారం అధికారులు సరిచేశారు. ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన 'సరిచేయకుంటే... మీ పని సరి' కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. అద్దంకి పట్టణంలోని ఊరచెరువు కట్ట వెంబడి దామావారిపాలెం నుంచి ఇటుక బట్టీల రోడ్డులో ఉన్న విద్యుత్ స్తంభాలు ఒరిగి ప్రమాదభరితంగా ఉన్నాయి. దీనిపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి వెంటనే స్పందించిన అధికారులు విద్యుత్ స్తంభాలు సరిచేయటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సరిచేసిన తరువాత

ఉద్యోగుల బకాయిల చెల్లింపుపై హర్షం

ఒంగోలు(రూరల్), మార్చి21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు బకాయిలు చె ల్లింపులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.6200కోట్ల నిధుల కేటాయించటం హర్షణీ యమని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయకులు శుక్రవారం హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు ఇవ్వటంలో విఫలమైందని విమర్శించారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. త్వరలో పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. డీఏ బకాయిలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు అల్లిబోయిన రాంబాబు, యనమల ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుపై హర్షం

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు ము ఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో బి ల్లు ప్రవేశ పెట్టడం అభి నందనీయమని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్‌మాదిగ పేర్కొన్నారు. ఒంగోలులో అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ ఫలాలు ఎస్సీల్లోని 59 కులాలకు సమానంగా అందినప్పుడే నిజమైన సామాజిక న్యాయం దక్కుతుందనే న్యాయ సూత్రజ ఆధారంగా మాదిగలు చేస్తున్న పోరాటానికి చంద్రబాబు న్యాయం చేశారని తెలిపారు. కొలకలూరి విజయకుమార్, జయరాజ్, పత్రా బంగారం, డి.శ్రీనివాసరావు, శేఖర్, మహేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్యాంకు ఉద్యోగులు

బ్యాంకు ఉద్యోగుల సమ్మె వాయిదా

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఉద్యోగుల సమ స్యల పరిష్కారానికి ఫైనాన్స్ మంత్రిత్వశాఖ, డీఎఫ్ఎస్ ఆధ్వర్యంలో సాను కూలంగా స్పందిం చడంతో సమ్మె వాయిదా వేసినట్లు బ్యాంకు యూనియ న్ నాయకులు తెలిపారు. శుక్రవారం ఒంగోలులోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద జరిగిన కార్యక్రమంలో యూఎఫ్‌బీయూ కన్వీనర్ రాజీవ్‌రత్నదేవ్ మాట్లాడు తూ తాము చేపట్టిన సమ్మెపై సానుకూలంగా స్పందించడంతో తాత్కాలి కంగా వాయిదా వేసినట్లు తెలిపారు. ఏప్రిల్ మూడవ వారంలో ఫైనాన్స్ మంత్రిత్వ శాఖతో బ్యాంకు ఉద్యోగుల సమస్యలపై సమవేశం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వి.శ్రీనివాసరావు, సుబ్బారావు, ఉమాశంకర్, వెంకటరెడ్డి, శ్రీధర్, బ్రహ్మయ్య, శ్రీనివాసరావు, సుధాకర్‌రావు, హసన్, బ్రహ్మనాయుడు, ఏడుకొం డలు, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కమాండెంట్ సంజీత్‌కుమార్, పక్కన ట్రైనీ డీఎస్పీ అభిషేక్, సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్

తీరంలో అప్రమత్తంగా ఉండాలి

రామాపురం(చీరాల), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : తీరంలో ఉగ్రవాదులు, మాదక ద్రవ్యాలు, ఆయుధాల రవాణా వంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ సంజీత్ కుమార్ పేర్కొన్నారు. కోస్టల్ సైక్లోథాన్ -2025 సైకిల్ ర్యాలీ శుక్రవారం రాత్రి చీరాలలోని రామాపురంకు చేరుకుంది. ఈసందర్భంగా ట్రైనీ డీఎస్పీ అభిషేక్, రూరల్ సీఐ పంతగాని శేషగిరిరావు, ఈపూరుపాలెం ఎస్సై అంబటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మచిలీపట్నం నుంచి కన్యాకుమారి వరకు ప్రారంభించిన సైకిల్ ర్యాలీ ఈ నెల 31కి కన్యాకుమారి చేరుకుని ముగుస్తుందని చెప్పారు. సముద్రతీర భద్రత, ఇతర దేశాలకు చెందిన షిప్పులు, బోట్లు సంచరించినా అనుమానాస్పద వ్యక్తులను గుర్తించినా వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ ప్రభాకర్, అసిస్టెంట్ కమాండెంట్ విక్రమ్‌సింగ్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, విజిలెన్స్ ఎస్సై శశికుమార్, స్థానిక గ్రామ పెద్దలు, మత్స్యకారులు పాల్గొన్నారు.

బిల్లులు లేకుండా గ్రానైట్ రవాణా చేస్తే చర్యలు

బల్లికురవ. మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాయల్టీలు చెల్లించకుండా ఎవరైనా గ్రానైట్ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని బాపట్ల ఆర్టీవో కిషోర్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం బల్లికురవ మండల కేంద్రంలో గ్రానైట్ స్లాబుల లారీని నిలుపుదల చేసిన ఆర్టీవో తనిఖీలు చేశారు. బిల్లులకు సరిపడిన రాయి ఉందా అని తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలను నడిపేవారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. మైనర్లు వాహనాలను నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రానైట్ అక్రమ రవాణాపై నిరంతరం నిఘా ఉంచుతామని తెలిపారు. అలానే పరిమితికి మించి ముడిరాళ్లను లారీలపై తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.



ఆలయ కమిటీ ప్రతినిధికి నగదు అందజేస్తున్న తాడి రమేష్ బాబు

అష్టలక్ష్మి ఆలయానికి రూ.1.25 లక్షల విరాళం

పర్చూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పర్చూరులో రూ.4కోట్ల వ్యయంతో రూపుదిద్దుకున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి, సమేత అష్టలక్ష్మీ దేవాలయ అభివృద్ధికి పర్చూరుకు చెందిన తాడి రమేష్ బాబు శుక్రవారం రూ.లక్షా పాతిక వేల నగదును ఆలయ కమిటీ నిర్వహకులకు అందజేసి భక్తిని చాటుకున్నారు. ఉద్యోగ రీత్యా ఆయన ప్రస్తుతం చెన్నైలో నివాసం ఉంటున్నారు. స్వగ్రామంలో నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి తనవంతు సాయం అందించాలన్న సంకల్పంతో నగదును అందజేసినట్లు రమేష్‌బాబు తెలిపారు. ఈకార్యక్రమంలో కోటా శ్రీనివాసరావు, పాబోలు సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, సింహదాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చెరుకూరు(పర్చూరు), మార్చి 21(ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ ట్రాలీ బోల్తాపడిన ఘటనలో తీవ్రంగా గాయపడిన పర్చూరు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన సుబ్బారావు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన సిగినం సుబ్బారావు(43) ఈనెల 15న చెరుకూరు శివారులోని తన పంట పొలానికి ఇంజన్ ద్వారా నీరుపెట్టుకొని తిరిగి వస్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. ఇంజన్‌ను తన ట్రాక్టర్ వెనుక కట్టుకొని కాలువ కట్టపైనుంచి రోడ్డు దిగుతున్న తరుణంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ట్రాలీ మీద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షత గాత్రుణ్ణి కుటుంబ సభ్యులు తొలుత గుంటూరులోని ఓప్రయివేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా మారటంతో గురువారం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ సుబ్బారావు మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

వేటపాలెం(చీరాల), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చల్లారెడ్డి పాలెం పంచాయతీ నాయినిపల్లి గ్రామం బచ్చుల వారి పాలెం ఎత్తిపోతల పథకం కాలువలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

అమ్మ ఆశ్రమంలో చోరీ

మార్టూరు,మార్చి21(ఆంధ్రజ్యోతి):స్థానిక కొణిదెనరోడ్‌లోని అమ్మ ఆశ్రమంలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేశారు. ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందు దంపతులు నివశించే గదిలోని బీరువాలో ఉన్న రెండున్నర సవర్ల విలువైన బంగారు వస్తువులు బుట్టలు, లాకెట్,పాపిడి బిళ్ల , 200 గ్రాములకు పైగా వెండివస్తువులు, దీపపు కుందెలు,కప్పులు,గ్లాసులుతదితరాలను ఎత్తుకు పోయారు.

ఆశ్రమంలో నివశించే చందు దంపతులు గురువారం రాత్రి వారి సొంతగ్రామమైన మండలంలోని రాజుపాలెంకు వెళ్లారు. దాంతో ఆశ్రమంలో ఎవరూ లేరు. శుక్రవారం ఉదయం ఆశ్రమం వద్దకు వచ్చిన చందు దంపతులు ఇంటిలోపలి తలుపు తెరచి ఉండటాన్ని గమనించి దొంగతనం జరిగిందని గ్రహించారు.గుర్తుతెలియని వ్యక్తులు మెయిన్‌గేట్ నుంచి కాకుండా పక్కనే ఉన్న ఇనుప గ్రిల్ నుంచి లోపలి తాళంను పగల గొట్టి ఇంటిలోకి ప్రవేశించి దొంగతనం చేశారు. ఈ విషయమై స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు శుక్రవారం బాధితుడు తెలిపారు.

అవీ..ఇవీ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

చదువులేని వయోజనులపై ప్రత్యేక దృష్టి

వేటపాలెం(చీరాల), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : 15 సంవత్సరాలు పైబడి చదవడం, రాయడం రాని వయోజనులపై ప్రత్యేక దృష్టి సారించాలని వయోజన విద్యా శాఖ పర్యవేక్షకులు మనోరంజన్, ఎంఈవో సుబ్బయ్య అన్నారు. శుక్రవారం మండల వెలుగు కార్యాలయంలో ఏపీఎం కాటి అంజిబాబు ఆధ్వర్యంలో ఉల్లాస్ - నవ భారత సాక్షరతా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వయోజన విద్యపై ప్రత్యేక శ్రద్ధవహిస్తున్నట్లు వివరించారు. ఈనేపథ్యంలో పొదుపు సంఘాల్లో మహిళలకు ముందుగా అక్షర జ్ఞానంపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిచాలని సూచించారు. పురోగతిపై ఈనెల 23 వ తేదీన పరీక్షను నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో సీడీపీవో ఝాన్సీ, సీసీలు, పొదుపు సంఘాల వీవోఏలు, మహిళలు పాల్గొన్నారు.



ఏబీసీ పరిధిలో పమిడిపాడు మేజర్‌పై రక్షణ గోడలు లేని వంతెన

రక్షణ గోడల్లేని వంతెన

● పొంచి ఉన్న ప్రమాదం

పంగులూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి):రక్షణ గోడలు లేని వంతెనతో ప్రమాదం పొంచి ఉంది. ఏబీసీ పరిధిలోని పమిడిపాడు మేజర్‌పై ముప్పవరం సమీపంలో అద్దంకి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేవు. నిత్యం పలు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారిలో రాత్రి వేళ ఈ వంతెనపై ఎదురు వచ్చే వాహనాల వెలుతురులో మార్జిన్ గుర్తించలేక ద్విచక్ర వాహనచోదకులు ప్రధాన కాలువలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. దశాబ్దాల కాలంగా ఈ వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలని వాహన చోదకులు ఏకరువు పెడుతున్నారు. పెరిగిన వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని వంతెన నిడివి పెంచి నూతన నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డులో సాగర్ కాలువపై ఉన్న వంతెనకు రక్షణ గోడలు తక్షణమే నిర్మించాలని ముప్పవరం పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న డాక్టర్ మహేంద్రనాథ్, సజ్జా హేమలత

నేతన్నలకు నిత్యం పండుగే

● నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్

చీరాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వంలో నేతన్నలకు నిత్యం పండుగేనని, గత వైసిపి ప్రభుత్వం హయాంలో చేనేతల దినోత్సవం నాడే నేతన్నల ఆత్మహత్యలు జరిగాయని నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ పేర్కొన్నారు. ఇటీవల చేనేతలకు విద్యుత్ సబ్సిడీ ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం పట్టణంలో సంబరాలు నిర్వహించారు. ముందుగా బస్టాండ్ సమీపంలోని ఎన్‌టీఆర్ విగ్రహానికి, ముక్కోణం పార్క్ కూడలిలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీగా గడియార స్తంభం కూడలికి చేరుకుని సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ చేనేతల కష్టాన్ని గుర్తించేది కూటమి ప్రభుత్వమే అన్నారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్‌లూమ్ చైర్మన్ సజ్జా హేమలత, వివిధ హోదాల్లోని టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, చేనేత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సత్తా చాటిన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

జాతీయ సెమినార్‌లో సెయింట్ ఆన్స్ విద్యార్థినుల సత్తా

చీరాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, కాలేజ్ ఆఫ్ ఫార్మా సూటికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో రీసెంట్ అడ్వాన్స్‌మెంట్స్ ఇన్ సాఫ్ట్‌వేర్ బేసడ్ అప్రోచెస్ ఇన్ ఫార్మాసూటికల్ రీసెర్చ్ అంశంపై జతీయ స్థాయి సెమినార్ జరిగింది. చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. సుమారు 600 మంది పాల్గొని 100కు పైగా పోస్టర్ ప్రజెంటేషన్స్ అందించగా సెయింట్ ఆన్స్ విద్యార్థిని పావని మొదటి బహుమతి, దివ్యశ్రీ రెండవ బహుమతి, హసీనా మూడవ బహుమతి సాధించారు. ఈక్రమంలో శుక్రవారం కళాశాలలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో వీరిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ నాగేశ్వరరావు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కలుషిత నీరే దిక్కు

వాగుల్లో కలుస్తున్న మురుగు నీరు

వాటినే మంచినీటి చెరువులకు నింపుతున్న వైనం

శుద్ధి చేయకుండానే కుళాయిల ద్వారా సరఫరా

పర్చూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి) : వాగుల్లో కలుస్తున్న మురుగు నీటితోనే మంచినీటి చెరువులను నింపి శుద్ధి చేయకుండా కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పలు గ్రామాల నుంచి వచ్చే మురుగు నీరు పర్చూరు వాగులో కలుస్తోంది. కొందరు అయితే సెప్టిక్ ట్యాంకులు నిర్మించుకోకుండా ఇళ్ల వద్ద మురుగు కాలువల్లో నేరుగా వదులుతున్నారు. అలాగే ఓగేరు వాగు నీటితో పర్చూరు మండలంలోని వివిధ గ్రామాల చెరువులను నింపుతున్నారు. మంచినీటి అవసరాల కోసం సాగర్ కాలువలను వదిలిన తరుణంలో సైతం ఆనీరు నేరుగా వాగుకు చేరుతోంది. తద్వారా ఆయా గ్రామాల చెరువులకు వాగు ద్వారానే సరఫరా చేస్తున్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ప్రవహించే మురుగు అంతా ఇదే ఓగేరు వాగులో కలుస్తోంది. ఇలా మురుగు నీరు కలుస్తున్న వాగులో నుంచి నీటిని మంచినీటి చెరువులకు నింపుతున్నారు. నిధుల కొరత సాకుతో ఫిల్టర్ బెడ్‌లు మరమ్మతులకు కూడా నోచుకోకపోవటం, ఉన్న ఫిల్టర్ బెడ్‌లు అలంకార ప్రాయంగా మారటంతో శుద్ధి చేయకుండా నేరుగా కలుషిత నీటిని ఓవర్ హెడ్ ట్యాంక్‌లకు ఎక్కించి కుళాయిల ద్వారా పంచాయిలు సరఫరా చేస్తున్నాయి. కలుషిత నీటిని తాగడం వల్ల ప్రజల ఆరోగ్యానికి, ప్రాణానికి ప్రమాదం పొంచి ఉన్నా ఎవరికి వారు తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించాల్సిన అధికారులు ఇది తమ పనికాదంటూ వ్యవహరించటం వల్లే ఇలాంటి కలుషిత నీటితో కాలం వెల్లబుచ్చాల్సి వస్తుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కలుషిత నీటి ఇక్కట్ల నుంచి ప్రజలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పర్చూరు వాగులో చేరిన మురుగుతో కలుషితంగా మారిన నీరు



డ్రైనేజీ కాలువ ద్వారా వాగుకు చేరుతున్న గ్రామాల్లోని మురుగు

గుండ్లకమ్మలో కలుస్తున్న అద్దంకి మురుగునీరు

అద్దంకి, మార్చి21(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని అత్యధిక ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీరు నేరుగా గుండ్లకమ్మ నదిలో కలుస్తోంది. అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో మురుగు నీరు శుద్ధి చేసే ప్లాంట్‌లు లేకపోవటంతో మురుగు నీరు నేరుగా వెళ్ళి గుండ్లకమ్మ నది నీటి ప్రవాహంలో చేరుతోంది. గుండ్లకమ్మ నది నీటినే పలు గ్రామాలకు తాగునీటి కోసం వినియోగిస్తున్నారు. దీంతో కలుషిత నీటినే సరఫరా చేయాల్సిన పరిస్థితి దాపురించింది. ఒంగోలు నగరంతో పాటు కొరిశపాడు, పంగులూరు, అద్దంకి మండలాలలోని పలు గ్రామాలకు గుండ్లకమ్మ రిజర్వాయర్ నీటిని వినియోగిస్తున్నారు. అద్దంకి సమగ్ర మంచినీటి పథకం కు కూడా గుండ్లకమ్మ రిజర్వాయర్ నీటినే వినియోగించేలా పనులు జరుగుతున్నాయి.



గుండ్లకమ్మ నదిలోకి వెళ్తున్న అద్దంకి పట్టణంలోని మురుగు నీరు

వైభవంగా భక్తాంజనేయస్వామి తిరునాళ్ల

ఆకట్టుకున్న విద్యుత్ ప్రభ

భారీగా అన్నదానం

సీఐ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు

మార్టూరు,మార్చి21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వలపర్ల గ్రామంలో సాగర్ కాలువ పక్కనే ఉన్న శ్రీభక్తాంజనేయస్వామి దేవస్థానానికి సంబంధించి 49 వ తిరునాళ్ల మహోత్సవం శుక్రవారం బ్రహ్మాండంగా కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభ తిరునాళ్లను తిలకించడానికి విచ్చేసిన ప్రజానీకాన్ని అలరించింది.ఉదయాన్నే భక్తాంజనేయస్వామి వద్ద ప్రధాన అర్చకులు వేణు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా భక్తాంజనేయస్వామి రాతి విగ్రహం వద్ద తమలపాకుల దండతోస్వామి వారికి అలంకరణ చేశారు. అనంతరం గ్రామస్థులు ముఖ్యంగా మహిళలు అక్కడే పొంగళ్లు పెట్టి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. గ్రామ ప్రజలు స్వామి వారికి కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. ఇక రాత్రి గ్రామంలో సీతారామలక్ష్మణ ఉత్సవ విగ్రహాలతో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా ట్రాక్టరుపై అలంకరించి ఊరేగించారు. అదేవిధంగా తిరునాళ్ల సందర్భంగా దేవస్థానం పరిసరాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. టీడీపీ వారు ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభపై పాట కచేరీని నిర్వహించారు.దేవస్థానానికి వెళ్లే దారిలో సీతారామలక్ష్మణాంజనేయస్వామిలతోపాటు వెంకటేశ్వరస్వామిల ప్రతిరూపాలను విద్యుత్ అలంకరణతో అందంగా ఏర్పాటుచేశారు. వలపర్ల గ్రామానికి చుట్టుప్రక్కల రామకూరు, వల్లాపల్లి, కోనంకి, ఇసుకదర్శి, నాగరాజుపల్లి, మార్టూరు తదితర గ్రామాలనుంచి ప్రజలు తిరునాళ్లను చూసేందుకు భారీగా తరలి వచ్చారు.వారందరికీ భారీగా అన్నదానం ఏర్పాటుచేశారు.అయితే తిరునాళ్ల ప్రశాంతంగా జరగడానికి సీఐ ఎం. శేషగిరిరావు ఆధ్వర్యంలో మార్టూరు, యద్దనపూడి,తదితర స్టేషన్‌లకు చెందిన ఐదుగురు ఎస్ఐలు, కానిస్టేబుళ్ళు, హోంగార్డులు,దాదాపుగా 40 మందితో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



దేవస్థానం ప్రారంభంలో ఏర్పాటుచేసిన విద్యుత్ అలంకరణ (ఇన్‌సెట్లో) భక్తాంజనేయస్వామి



టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

ప్రజారోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా

మంత్రి గొట్టిపాటి రవికుమార్

సంతమాగులూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా ఇస్తుందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. అద్దంకి నియోజకవర్గం సంతమాగులూరులో మంత్రి గొట్టిపాటి శుక్రవారం పర్యటించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ప్రజావేదిక నిర్వహించారు. ముందుగా 80 మంది లబ్ధిదారులకు రూ.39 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. వీటితో పాటు రూ.9 లక్షల విలువైన ఎల్వోసీలను ఇద్దరికి అందించారు. అనంతరం ప్రజా వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను తెలుసుకున్న మంత్రి గొట్టిపాటి వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ అనారోగ్య సమస్యల వల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితులు తల్లకిందులవుతాయని, ఆస్పత్రుల ఖర్చులతో కొన్ని కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వందలాది మందికి ఆర్థిక సహాయం చేస్తున్నామన్నారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోనే ఇప్పటి వరకు 439 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా లబ్ధి చేకూరిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.



ప్రజల వినతులను పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

సాధికార సారథులతో పార్టీ మరింత బలోపేతం

టీడీపీని బలోపేతం దిశగా సాధికార సారథులు మరింత కృషి చేయాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. గత ఎన్నికల సమయంలో సాధికార సారథులు పార్టీ గెలుపునకు ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. పథకాలు అందని వారికి, సీఎంఆర్ఎఫ్ అవసరమైన వారిని సాధికార సారథులే గుర్తించి వారికి లబ్ధి చేకూర్చాలన్నారు. నియోజకవర్గంలో ఉన్న మొత్తం 4,500 మంది సాధికార సారథులను పార్టీ సభ్యులు కూడా సమన్వయం చేసుకుని గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్

మేదరమెట్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి పరిశీలించారు. శుక్రవారం మేదరమెట్ల జిల్లా పరిషత్ హైస్కూలులో జరుగుతున్న పరీక్షలను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆ యన మాట్లాడుతూ మండలంలోని మూడు పరీక్ష కేంద్రాలలో 458 మంది పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎండ తీవ్రత దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉంచామన్నారు. ఆయన వెంట మేదరమెట్ల ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ తదితరులు ఉన్నారు.

పంగులూరులో నీటి సరఫరాకు అంతరాయం

పంగులూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పంగులూరులోని కొంత ప్రాంతానికి రక్షిత నీటి సరఫరా నిలిచి పోయింది. గ్రామంలో రెండు రోజులుగా నీటి సరఫరా నిలిచి పోవడటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి రాంబాబును వివరణ కోరగా గ్రామంలో ఆర్‌డీఎస్ఎస్ విద్యుత్ పథకం అమలులో భాగంగా విద్యుత్ లైన్ నూతన నిర్మాణం జరుగుతున్న సందర్భంగా భూమిలో నీటి సరఫరా కోసం వేసిన పైపులు పగలడంతో సమస్య తలెత్తిందన్నారు. శుక్రవారం పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టామని, శనివారం నాటికి నీటి సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు.

ఎత్తిపోతల పథకాల వినియోగమే లక్ష్యం

పోతుకట్ల (పర్చూరు), మార్చి 21(ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ పాలనలో కనీస మరమ్మతులకు కూడా నోచుకోని ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకు వచ్చి రైతులకు ఆరుతడులకు నీటిని అందించాలన్న సంకల్పంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవ చూపారు. అందులో భాగంగా ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఐడీయస్) విశ్రాంత డీఈ సత్యనారాయణ నేతృత్వంలో పర్చూరు నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాలను పరిశీలించి మరమ్మతులకు కావలసిన నివేదికను తయారుచేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అందులో భాగంగా శుక్రవారం మండలంలోని పోతుకట్ల గ్రామంలోని లక్ష్మీ లిఫ్ట్ ఇరిగేషన్ 1, 2లను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని రైతులతో సమావేశం నిర్వహించి పలు అంశాలను చర్చించారు. ఈ ఎత్తిపోతల పథకాల ద్వారా 1400 ఎకరాల భూములకు ఆరుతడులు అందించేందుకు ఇవి ఎంతగానో దోహద పడతాయని మాజీ సర్పంచ్ మానం హరిబాబు అధికారులకు వివరించారు. ఈకార్యక్రమంలో మానం హరిబాబు, కమిటీ సభ్యులు కఠారి వీరయ్య, దేవరపల్లి పాపారావు, తెలగతోటి మహేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.



పోతుకట్లలో రైతులతో చర్చిస్తున్న ఐడీఎస్ విశ్రాంత డీఈ సత్యనారాయణ, ఎత్తిపోతల పథకం నిర్వాహకులు, రైతులు

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బల్లికురవ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు అర్హత ఉన్న విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని బల్లికురవ విద్యాలయం ప్రిన్సిపాల్ కె. సరళకుమారి కోరారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ కేజీబీవీలో 6 వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు ఏప్రిల్ 11 వరకు విద్యార్థినులు చేసుకోవచ్చన్నారు. డ్రాపౌట్స్ కలిగిన బాలికలకు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, బలహీన వర్గాలకు ప్రాధాన్యత ఉంటుందని, అలానే 9, 10 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9110369460, 8639734009 నెంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.



బల్లికురవలోని కేజీబీవీ

ముఖాముఖి

నవోదయం 2.0తో నవశకానికి నాంది

● ఎక్సైజ్ సీఐ పేరం నాగేశ్వరరావు



చీరాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నాటుసారా మహమ్మారి నుంచి ప్రజలను రక్షించేందుకు ప్రత్యేక కృషి చేస్తుంది. ఈక్రమంలోనే గత ప్రభుత్వ హయాంలో అందించిన నాసిరకం మద్యాన్ని అణచివేసింది. అదే సమయంలో తక్కువ ధరకు నాణ్యమైన మద్యాన్ని అందిస్తున్నది. దీంతో చీరాల ఎక్సైజ్ సీఐ పేరం నాగేశ్వరరావుతో ఆంధ్రజ్యోతి ముఖాముఖి నిర్వహించింది.

ప్రశ్న: నాటుసారా నియంత్రణకు తీసుకున్న చర్యలు ఏమిటి ?

జవాబు: నాటుసారా తయారీ నియంత్రణకు ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.ఈక్రమంలో ఇప్పటికే సుమారు 12 అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం.అక్రమ మద్య రవాణా, నిల్వలు, విక్రయాలకు సంబంధించి సుమారు 140 కేసులు నమోదు చేశాం.

ప్రశ్న: చీరాల పరిధిలో బెల్టు షాపులు సంగతి ఏమిటి ?

జవాబు : ప్రభుత్వ పాలసీని పారదర్శకంగా అమలు చేస్తున్నాం. బెల్టు షాపులు ఎక్కడా లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాం.

ప్రశ్న: సిండికేట్ పరిస్థితి ఏమిటి ?

జవాబు: చీరాల స్టేషన్ పరిధిలో సిండికేట్ వ్యవహారం లేదు. వ్యక్తిగత దుకాణాలే ఉన్నాయి. అవి చట్ట పరిధిలోనే నడుస్తున్నాయి. భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: షాపుల నుంచి నెలవారీ మామూళ్లు ఎవరికైనా ఉన్నాయా ?

జవాబు: చట్టబద్ధంగానే విధులు నిర్వహిస్తున్నాము. రిటైర్మెంట్‌కు చేరువలో ఉన్నాను. ప్రభుత్వ పాలసీను అతిక్రమించలేను.

ప్రశ్న: సారా తయారీదారులకు ఏదైనా దిశా నిర్దేశాలు చేశారా ?

జవాబు: ఇప్పటి వరకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో పలుమార్లు చెప్పాము. సత్ప్రవర్తన ఉంటే పొదుపు సంఘాలలో చేర్చి గ్రూపుల వారీగా రుణాలు అందించి, ఉపాధి కల్పిస్తాము.

'పది' పరీక్షకు 19 మంది విద్యార్థుల గైర్హాజరు

కారంచేడు(పర్చూరు), మార్చి 21(ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండల పరిధిలోని స్వర్ణ , పర్చూరు మండలంలో శుక్రవారం జరిగిన ఇంగ్లీషు పరీక్షకు 19 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. స్వర్ణ గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో ముగ్గురు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. అలాగే పర్చూరు మండల పరిధిలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 672 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా శుక్రవారం నిర్వహించిన పరీక్షకు 16 మంది గైర్హాజరు అయినట్లు ఎంఈవో వెంకట్రామయ్య తెలిపారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన ఎంఈవో

మార్టూరు,మార్చి21(ఆంధ్రజ్యోతి):మండలంలోని ద్రోణాదుల జడ్పీ హైస్కూల్లో శుక్రవారం జరిగిన 10 వతరగతి పరీక్షలను ఎంఈవో వస్రాంనాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్కూల్లో వసతులను తనిఖీచేశారు.అనంతరం ఎస్సీకాలనీలోని ఏపీ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అక్కడ శిథిలావస్థకు చేరిన స్కూలు గదులను దాతల సహకారంతో పునర్నిర్మాణం చేసేవిధంగా ప్రణాళికను తయారుచేసుకోవాలని ఉపాధ్యాయులను కోరారు.

రేపు మార్టూరులో గోశాల 13 వ వార్షికోత్సవం

మార్టూరులో శ్రీ కృష్ణ పిరమిడ్ గో సంరక్షణ సేవా సమితి 13 వ వార్షిక వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు పొత్తూరి వెంకట్రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

దగ్గుబాడు(పర్చూరు), మార్చి 21(ఆంధ్రజ్యోతి) కారంచేడు మండల పరిధిలోని దగ్గుబాడు గ్రామంలో జాయింట్ కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు ఏవో సుధీర్ కుమార్ శనగల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. శగన పంటకు ప్రభుత్వం క్వింటాకు రూ.5,650 మద్దతు ధరను కల్పించినట్లు ఏవో తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎంఎన్ రాయ్ 138వ జయంతి


ఇంకొల్లు,మార్చి 21,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు రాడికల్ హ్యూమనిస్టు సెంటర్‌లో శుక్రవారం ఎంఎన్‌రాయ్ 138వ జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా మేడూరి సత్యనారాయణ అధ్యక్షత రాడికల్ హ్యూమనిజం -నేటి ఆవశ్యకత అనే అంశంపై సదస్సు జరిగింది. భారత హేతువాద సంఘం ట్రెజరర్ షేక్ బాబు, ఏపీ హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి షేక్ దరియావలి,కరి హరిబాబు,పి.శ్రీనివాసరావు,నజీర్,సంగీతరావు, లింకన్ పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్ల పంపిణీ

అద్దంకి, మార్చి21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 40 మంది దివ్యాంగులకు శనివారం ఉదయం 10.30 గంటలకు అద్దంకిలో మూడు చక్రాల స్కూటీలను విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పంపిణీ చేయనున్నారు. మున్సిపల్ కాంప్లెక్స్‌లో జనరిక్ మందుల షాపును ప్రారంభించనున్నారు. ఉదయం 8.30 గంటలకు యద్దనపూడిలో జరిగే గొట్టిపాటి హనుమంతరావు వర్ధంతిలో మంత్రి రవికుమార్ పాల్గొననున్నారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక

అద్దంకిటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మణికేశ్వరం గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులపై సోషల్ ఆడిట్ కమిటీ సభ్యులు తనిఖీ చేశారు. గ్రామంలో ఏడాదిగా జరిగిన పనులను తనిఖీ చేసి ఆయా పనుల వివరాలను గ్రామ సభలో వివరించారు.



'యువికా'కు రేపటిలోగా దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (విద్య), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : యువ విజ్ఞాన కార్యక్రమానికి జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు చెందిన 9వతరగతి విద్యార్థులు ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన విద్యార్థుల జాబితాను ఇస్రో అధికారులు ఏప్రిల్ 7వ తేదీన విడుదల చేసి, మే 18వ తేదీన ఆహ్వానిస్తారని పేర్కొన్నారు. మే 19 నుంచి 30వ తేదీ వరకు యువికా కార్యక్రమం జరిపి 31వతేదీన ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందచేస్తారన్నారు.



'ఆంధ్రజ్యోతి' లక్కీడ్రా నేడే!



సాయంత్రం నెల్లూరులో విజేతల ఎంపిక

3 ప్రధాన బహుమతులతోపాటు వంద కన్సొలేషన్ గిఫ్టులు

అతిథులుగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, 'శుభమస్తు' అధినేత రవి

నెల్లూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పాఠకులు ఎప్పుడెప్పుడా అని ఆత్రుతగా ఎదురుచూస్తున్న 'ఆంధ్రజ్యోతి లక్కీ డ్రా' శనివారం జరగనుంది. నెల్లూరు నగరంలోని ఉడ్‌కాంప్లెక్స్‌లో ఉన్న ఆంధ్రజ్యోతి కార్యాలయం వేదికగా 'కార్ అండ్ బైక్ రేస్'లో అదృష్ట పాఠకులు ఎవరన్నది తేలనుంది. సాయంత్రం జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోవూరు ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, శుభమస్తు షాపింగ్ మాల్ యజమాని భయ్యా రవి హాజరుకానున్నారు. పాఠకుల నుంచి వచ్చిన వేలాది కూపన్లలో విజేతలను ఎంపిక చేయనున్నారు. ప్రథమ బహుమతి కింద మోటార్ బైక్, రెండో బహుమతి రెఫ్రిజిరేటర్, మూడో బహుమతి టీవీని విజేతలకు అందజేయనున్నారు. అలాగే మరో 100 కన్సొలేషన్ బహుమతుల కింద ఒక్కొక్కరికి రూ.2 వేలు విలువచేసే గృహోపకరణాలను అందజేయనున్నారు. 'ఆంధ్రజ్యోతి' 22వ వార్షికోత్సవం సందర్భంగా పాఠకులకు రూ.కోటి విలువైన బహుమతులను అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. 2024 నవంబరు 1 నుంచి 2025 ఫిబ్రవరి 28వ తేదీ మధ్య 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కూపన్లను పాఠకులు ఇప్పటికే 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి పంపారు. జిల్లాలో వేల సంఖ్యలో ఈ కూపన్లు అందగా, వీరిలో అదృష్టవంతులు ఎవరన్నది శనివారం తెలుస్తుంది. విజేతలకు ఫోన్ ద్వారా సమాచారం అందించడం జరుగుతుంది.



సమయం : శనివారం సాయంత్రం 5 గంటలకు | **వేదిక : నెల్లూరులోని ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయం**

'సోమశిల'లో నీరు నిల్వ

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారం 54.630 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 500, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

పోలీసులకు ఉగాది పురస్కారాలు

నెల్లూరు(క్రైం), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన పోలీసు అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉగాది పురస్కారాలను ప్రకటించింది. ఉత్తమ సేవాపతకానికి సీసీఎస్ ఏఎస్ఐ డి హరీంద్రబాబు, నెల్లూరు ఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ (హెచ్‌సీ) టి ప్రభాకర్‌రావు, సీఐడీ హెచ్‌సి ఎం వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. సేవా పతకా నికి చిన్నబజారు పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కోటేశ్వరరావు, హోంగార్డ్సు ఆర్ఐ వై పోల్‌రాజు, ఏఆర్ హెచ్‌సీ ఎస్ పాండురంగారెడ్డి, ఏఆర్ ఏఎస్ఐ ఎం శంకరయ్య, కావలి రూరల్ పీసీ కె పూర్ణచంద్రబాబు, బాలాజీనగర్ ఏఎస్ఐ పి శ్రీనివాసరావు, కోవూరు హెచ్‌సీ షేక్ నజీర్‌బాషా, ఏఆర్ హెచ్‌సీ ఎస్ కోటేశ్వర రావు, వెంకటాచలం సత్రం హెచ్‌సీ ఎస్‌డి నజ్ముల్‌హుసేన్, సీఐడీ హెచ్‌సీ కె దయానిధి, సీఐడి హెచ్‌సి మాలరెడ్ల రవిలు ఎంపికయ్యారు. సేవాపతకం స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్‌కు పొదలకూరుకు ఎస్ఎఫ్ఓ టి విజయకుమార్, నెల్లూరు ఫైర్‌మన్ కె రామకృష్ణ ఎంపికయ్యారు.

విద్యుత్ వినియోగదారులకు
వాట్సాప్ సేవలు : ఎస్ఈ

నెల్లూరు (జడ్పీ) : విద్యుత్ సేవలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా వాట్సాప్ సేవలు ప్రవేశపెట్టిందని, దీనిని వినియోగదారులం తా సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ ఎస్ఈ విజయ న్ కోరారు. శుక్రవారం విద్యుత్ భవన్‌లో టౌన్, డివిజన్ అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 10గంటల వరకు పీక్ అవర్స్‌లో సిబ్బందిని సబ్‌స్టేషన్‌లో అందుబాటు లో ఉంచాలన్నారు. శనివారం రాత్రి 8.30నుంచి 9.30 వర కు స్వచ్ఛందంగా లైట్లు ఆపి ప్రజలంతా ఎర్త్ అవర్‌ను పాటించాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ సర్‌చార్జిని రద్దు చేసినందున బకాయిలను పూర్తిగా వ సూలు చేయాలని అధికారులను ఆదేశించారు.

మెడికల్ షాపుల్లో 'ఆపరేషన్ గరుడ'

• డ్రగ్స్ దుర్వినియోగంపై సోదాలు



మెడికల్ షాపులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

నెల్లూరు (క్రైం), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : 'ఆపరేషన్ గరుడ'లో భాగంగా ఐజీ ఈగల్ టీమ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసులు, డ్రగ్స్ కంట్రోల్ అధికారులు సంయుక్తంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా మెడికల్ షాపుల్లో దాడులు నిర్వహించారు. మూడు ప్రత్యేక బృందాలుగా అధికారులు విడిపోయి నగరంలోని స్టోన్‌హౌస్‌పేట, శ్రీనివాస అగ్రహారం, ఆచారవీధి, బోసుబొమ్మ ప్రాంతాలతోపాటు ఆత్మ కూరులో ఆకస్మిక తనిఖీలు చేశారు. కొన్ని రకాల మందులకు సంబంధించిన విక్రయాలపై పరిశీలిస్తున్నారు. ఎంతమొత్తంలో మాత్రలు కొనుగోలు చేశారు.. ఎవరికి విక్రయించారు... వాటి తాలుకు బిల్లులు, వైద్యుల చీటీల మేరకు విక్రయాలు సాగించారా!? తదితర వివరాలు సేకరి స్తున్నారు. తనిఖీలు పూర్తయిన తర్వాత పూర్తి నివేదికను ప్రభుత్వానికి అంది స్తామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ తెలిపారు. ఔషధ నియంత్రణ శాఖ ఏడీ వీరకుమార్ మాట్లాడుతూ డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మ త్తుమాత్రలను విక్రయించకూడదన్నారు. యువత మత్తు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్లు కె నరసింహరావు, ఎ శ్రీహరిరావు, షేక్ సుభాని, విష్ణురావు, డీసీటీవో పి వేణుగోపాల్‌రావు, ఏవో వెంకటరెడ్డి, ఔషధ నియంత్రణ శాఖ ఇన్‌స్పెక్టర్లు కీర్తి పవిత్ర, టి వెంకటకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



కలువాయి : రాజుపాళెం సమీపంలో పెన్నానదిలో నిర్మించిన రోడ్డు

రాజుపాళెంలో ఇసుకాసురుల దోపిడీ

పెన్నానదిలో ర్యాంపు, మట్టిరోడ్డు నిర్మాణం

ప్రభుత్వ భూముల నుంచి గ్రావెల్ తరలింపు

గ్రామస్థుల ఫిర్యాదుతో టిప్పర్లను పట్టుకున్న అధికారులు

తెల్లవారేసరికల్లా వదిలేయడంపై విమర్శలు

ఇంత బరితెగింపా!?

కలువాయి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పెన్నమ్మను ఇసుకాసురులు వదలడం లేదు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నదిని కుళ్లబొడుస్తున్నారు. కలువాయి మండలం రాజుపాళెం సమీపంలో ఏకంగా ర్యాంప్ ఏర్పాటు చేసి రాత్రివేళల్లో యంత్రాలతో ఇసుకను తవ్వి అక్రమంగా తరలిస్తున్నారు. అయితే, మరింత నాణ్యమైన ఇసుక కోసం అక్రమార్కులు నది లోపలికి అక్రమంగా కిలోమీటరు పొడవున మట్టి రోడ్డు నిర్మించారు. నదిలో నీటి ప్రవాహం ఉన్న చోట సిమెంటు పైపులు వే సి మరీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అనధికార ఇసుక ర్యాంప్‌నకు ఏకంగా నదికి అడ్డంగా లక్షలాది రూపాయలు వెచ్చించి రోడ్డు వేయడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా నీటిపారుదలశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన గ్రావెల్‌ను కుల్లూరు సమీపంలోని ప్రభుత్వ భూముల నుంచి టిప్పర్లతో తరలిస్తున్నారు. అయితే, ఈ గ్రావెల్ అక్రమ తరలింపుపై గ్రామస్థులు వ్యతిరేకత వ్యక్తం చేశారు. దీంతో గురువారం అర్ధరాత్రి రెవెన్యూ అధికారులు దాడి చేసి గ్రావెల్ కోసం వచ్చిన టిప్పర్లను స్వాధీనం చేసుకుని తహసీల్దారు కార్యాలయానికి తరలించారు. అయితే, తెల్లవారేసరికల్లా ఆ టిప్పర్లను వదిలేయడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఆత్మకూరు ఆర్డీవో పావని ఆదేశాల మేరకు తహసీల్దారు శ్యామ్‌సుందరరాజు తన సిబ్బందితో రాజుపాళెం వద్ద ఉన్న అక్రమ ఇసుక ర్యాంపును, నదిలో వేసిన రోడ్డును పరిశీలించారు. రోడ్డు నిర్మాణానికి గ్రావెల్ తరలించిన కుల్లూరులోని ప్రభుత్వ భూమిని కూడా వారు పరిశీలించారు.

చర్యలు తీసుకుంటాము

రాజుపాళెం వద్ద ఉన్న అక్రమ ఇసుక రీచ్‌ను, నదిలోకి వేసిన రోడ్డును పరిశీలించి చర్యలు తీసుకుంటాము. కుల్లూరు సమీపం నుంచి గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసులు పెట్టాలని తహసీల్దారుకు ఆదేశాలు జారీ చేశాము.

- పావని, ఆత్మకూరు ఆర్డీవో



కుల్లూరు వద్ద నుంచి గ్రావెల్ తరలించేందుకు వచ్చిన యంత్రాలను అడ్డుకుంటున్న రెవెన్యూ సిబ్బంది

బెట్టింగ్.. యువతే టార్గెట్!!

మొదలైన ఐపీఎల్ కొత్త సీజన్ • క్రికెట్ బెట్టింగ్ కోసం ప్రత్యేక యాప్‌లు

లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే.. •

ఈజీ మనీ కోసం బానిసలవుతున్న యూత్ •

అధిక వడ్డీలు, తనఖా, తండల్‌కు అప్పులు •

రోడ్డున పడుతున్న కుటుంబాలు •

- వివరాలు 8

ఎటువంటి సమాచారం లేకుండా అటవీ శాఖ ఏర్పాటు చేసిన హద్దుల దిమ్మెలు



అటవీ శాఖ అత్యుత్సాహం

భూముల్లో ఇష్టానుసారం హద్దురాళ్లు

రెవెన్యూ అధికారుల ఆదేశాలూ బేఖాతరు

24న సర్వే చేస్తాం : తహసీల్దారు

ఇటీవల కడప జిల్లా బద్వేలు నియోజక వర్గంలో కాశీనాయన ఆశ్రమం వద్ద అటవీ శాఖ అధికారులు చేసిన పనులకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పుకో వాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినా, ఆ శాఖ అధికారుల్లో మాత్రం మార్పు ఉండటం లేదు. చేజర్ల మండలంలో గతంలో అటవీ శాఖకు చెందిన అధికారులు తీసిన ట్రెంచ్ (గాడులు) కాదంటూ ఇష్టానుసారంగా హద్దులు ఏర్పాటు చేస్తుండటంపై గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

చేజర్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : చేజర్ల మండలంలోని ఆదురుపల్లి, చిత్తలూరు గ్రామాల సమీపంలో ఉన్న అటవీ భూముల్లో అటవీ శాఖ సిబ్బంది ఇటీవల హద్దులు ఏర్పాటు చేస్తుండటంపై చిత్తలూరు గ్రామస్థులు గమనించి తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన తహసీల్దారు గ్రామస్థులు, రైతులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో సర్వే చేయాలని అప్పటివరకు పనులు ఆపాలని ఫారెస్టు డీఆర్‌వోకు తెలియజేశారు. ఆ తర్వాత 17వ తేదీన అటవీ శాఖకు చెందిన డీఆర్‌వో, సిబ్బంది వీరితోపాటు రెవెన్యూకు చెందిన చిత్తలూరు వీఆర్‌వో, ఇద్దరు సర్వేలు కొంతమంది గ్రామస్థులు సర్వే చేపట్టారు. ఈ క్రమంలో హద్దురాళ్ళు కనపడకపోవడంతో సర్వే ఆలస్యం అవుతుందని అటవీ అధికారులు, సర్వేయర్లు చెప్పడంతో అప్పటివరకు హద్దులు ఏర్పాటు చేయవద్దని పూర్తి సర్వే చేసిన తర్వాతే హద్దులు ఏర్పాటు చేయాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. అయితే శుక్రవారం అటుగా వెళ్ళిన రైతులు హద్దులు ఏర్పాటు చేసి ఉన్న దిమ్మెలకు పెయింట్ కూడా పూర్తి చేసి ఉండడంతో వీఆర్‌వోకు సమాచారం ఇచ్చారు. అక్కడకు వెళ్ళి పరిశీలించిన వీఆర్‌వో పలుమార్లు అటవీ శాఖ డీఆర్‌వోకు ఫోన్ చేసినా స్పందించలేదు. ఆదురుపల్లి అటవీశాఖలో పని చేస్తున్న ఓ ఉద్యోగి అత్యుత్సాహంతోనే ఇదంతా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు హద్దులు ఏర్పాటు చేస్తే త్వరలో జరిగే రీసర్వేలో కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, అధికారులు స్పందించి రెవెన్యూ భూములకు రక్షణ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాగా, ఈ వ్యవహారంపై తహసీల్దారు మురళి మాట్లాడుతూ గ్రామస్థుల ఫిర్యాదు మేరకు సోమవారం రెవెన్యూ అధికారుల సమక్షంలో సర్వే చేస్తామని చెప్పారు. సర్వే అయిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వరికుంటపాడు మండలం కొత్తపేట బీట్ పరిధిలో ఎండుముఖం పట్టిన మొక్క



మొక్కలోనే మింగేశారు!

అటవీ శాఖలో మరో అవినీతి బాగోతం

వరికుంటపాడు మండలంలో నిధుల స్వాహా!

మొక్కలు నాటడం, నిర్వహణ పేరుతో దోపిడీ

అన్నీ తెలిసినా మౌనం వీడని అధికారులు

ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి): ఎవరు ఏమనుకున్నా మాకేం.. అనుకు న్నారో, ఉన్నతాధికారుల అండ ఉందనుకున్నారో ఏమోగానీ ఉదయగిరి అటవీ శాఖలో కొంత మంది అవినీతి బాగోతం కొనసాగుతూనే ఉంది. ప్లాంటేషన్ పనులతో మొదలు ఏపుగా పెరిగిన జామాయిల్ కర్ర అక్రమ తరలింపు వరకు యథేచ్ఛగా అక్రమ దందా సాగుతున్నా కన్నెత్తి చూసే నాథులే కరువయ్యారు. వరికుంటపాడు మండలంలోని కనియం పాడు సమీపంలోని కొత్తపేట బీట్, విరువూరు గ్రామాల్లో మొక్కలు నాటే క్రమంలో చోటు చేసుకు న్న అవినీతిని మరువకముందే మరొకటి వెలుగులోకి వచ్చింది. కొత్తపేట బీట్ పరిధిలోని 116 హెక్టార్లలో క్యాంపా (అటవీ ప్రత్యామ్నాయ వనీకరణ) పథకం పేరుతో మంజూరైన రూ.1.20 కోట్లతో ఎర్రచందనం, తెల్లమద్ది, మర్రి, వేప, రాగి, నేరేడు మొక్కలు నాటే పనులకు శ్రీకారం చుట్టారు. వీఎస్ఎస్ చేయాల్సిన ఆ పనులను అధికారులు ఉదయగిరికి చెందిన కూలీలతో చేయించి రికార్డుల్లో మాత్రం వీఎస్ఎస్ సభ్యుల పేర్లు నమోదు చేశారు. తొలుత ఆ భూమి కొనుగోలు విషయంలోను అవినీతికి పాల్పడినట్లు విమర్శలు ఉన్నాయి.

• నిబంధనలకు తూట్లు

మొక్కలు నాటే క్రమంలో నిబంధనలు పాటించక పోవడంతో తక్కువ సమయంలోనే ఏపుగా పెరగాల్సిన మొక్కలు ఎండుముఖం మాడిపోతున్నాయి. కొలతల ప్రకారం గుంతలు తీయకుండానే మొక్కలు నాటడం, రసాయనిక ఎరువులను సైతం వినియోగించలేదు. ఈ ప్రాంతంలో సవుడు (ఇసుక తెర) నేల అధికంగా ఉన్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి నామమాత్రంగానే మొక్కలు నాటి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కానీ రికార్డుల్లో మాత్రం అంతా సవ్యంగా ఉన్నట్లు, నేల సైతం గట్టిగానే ఉన్నట్లు నమోదు చేసుకొని అధిక మొత్తంలోనే నిధుల స్వాహాకు పాల్పడినట్లు తెలిసింది.

• ఈ ఏడాదీ అదే తంతు

ఈ ఏడాది చేపట్టాల్సిన నిర్వహణ పనులకు సైతం సుమారు రూ.కోటి నిధులు మంజూరయినట్లు తెలుస్తోంది. ఆ నిధులతో మొక్కల నడుమ అంతర సేద్యం చేయాల్సి ఉండగా అరకొరగా పనులు చేపట్టి నిధులు డ్రా చేయడం గమనార్హం. అందులోను కొంతమేర పనులను కూలీల ద్వారా చేయించాలనే నిబంధనలకు తూట్లు పొడిచి తూతూమంత్రంగానే కొనసాగించారు. ఎరువుల వినియోగంలోను చేతివాటం చూపించారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. వీటకితోడు ఆ భూమిలోని మూడు బీట్ల పరిధిలో కేవలం ముగ్గురిని మాత్రమే కాపలాదారులుగా నియమించి ఒక్కొక్కరికి రూ.6వేలు నగదు అందించారు. రికార్డుల్లో మాత్రం ఒక్కో బీటుకు ముగ్గురు చొప్పున నియమించి ఒక్కక్కరికి రూ.13వేలు చెల్లించినట్లు నమోదు చేశారు. జిల్లా ఉన్నతాధికారులు, విజిలెన్స్ అధికారులు సమగ్ర దర్యాప్తు చేపడితే అవినీతి బాగోతం మరింత వెలుగు చూసే అవకాశం ఉంది. ఈ వ్యవహారంపై సెక్షన్ అధికారి శ్రీరాములు మాట్లాడుతూ సమగ్రంగా పరిశీలించి ఎలాంటి లోపాలు లేకుండా నిబంధనల మేరకు సమగ్రంగా పనులు జరిగేలా చర్యలు తీసుకుంటానని అన్నారు.

కేజీబీవీల్లో అడ్మిషన్లకు
దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా 12 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) 2025-26 విద్యాసంవత్సరానికి ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం కోర్సుల ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోతరగతిలో 480 సీట్లు, ఇంటర్ ప్రవేశాలకు 480 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే అన్ని కేజీబీవీల్లో 7, 8, 9, 10, 12వ తరగతుల్లో ప్రవేశాలకు మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. apkgbv.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, ఏప్రిల్ 11వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనాథ, బడిబయట పిల్లలు, బడిమానేసినవారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్యరేఖకు దిగువున జీవిస్తున్న బాలికలు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు, సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు సమీపంలోని కేజీబీవీ విద్యాలయాల్లో సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	104
స్కిన్ చికెన్	192
స్కిన్‌లెస్	212

కోడిగుడ్ల ధర (100): 425




24న శ్రీనివాస కల్యాణోత్సవం

కావలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి సరస్వతి బాలస్వామిజీతో ఈ నెల 24వ తేదీ సాయంత్రం స్థానిక బృందావన హౌసింగ్ కాలనీ కల్యాణ మండపంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు తటవర్తి రమేష్ తెలిపారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో నేతలతో కలిసి రమేష్ కల్యాణమహోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. పట్టణ ప్రజలు స్వామి వారి భక్తులు మహోత్సవంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు, సంఘం నేతలు ఓరుగంటి రామక్రిష్ణ, మొగళ్లపల్లి రాజా, కంచర్ల కల్యాణ చక్రవర్తి, ఓరుగంటి సురేష్ పాల్గొన్నారు.

మాకొద్దీ నగర పంచాయతీ?

- ఎన్నికల హామీ ఏమైందని ప్రశ్నిస్తున్న జనం
- పంచాయతీగా మార్పునకు ఎదురుచూపు
- పన్నులు వసూళ్లు కాక మల్లగుల్లాలు పడుతున్న అధికారులు

అల్లూరు, మార్చి 21: తాను ఎన్నికల్లో గెలిస్తే నగర పంచాయతీని రద్దుపరచి పంచాయతీగా మార్పు చేస్తామని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఇచ్చిన హామీ ఏమైందంటూ నగర పంచాయతీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇష్టంలేని కాపురం చేసినట్టు అటు అధికారులు, ఇటు ప్రజలు నగర పంచాయతీపై అంతగా ఆసక్తి కనపరచడం లేదు. అల్లూరు, నార్తుమోపూరు, సింగపేటలను కలుపుతూ వైసీపీ పాలనలోని నాయకులు 2020లో అల్లూరును నగర పంచాయతీగా చేసి చైర్మన్ పదవి గద్దెనెక్కి పెత్తనం చలాయించాలనుకున్నారు. ఈ క్రమంలో గవర్నర్ ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చారు. కానీ నార్తుమోపూరుకు చెందిన టీడీపీ నాయకుడు తమ గ్రామాన్ని పంచాయతీగా మార్పు చేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించడంతో ఎన్నికలు జరుపకుండా నిలిపివేసింది. అప్పటి నుండి ఈ మూడు గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు.



● మంజూరు కాని నిధులు

నగర పంచాయతీ అభివృద్ధిని పాలకులు మరిచారంటూ స్థానికులు మండిపడుతున్నారు. గ్రామ పంచాయతీలుగా కొనసాగి ఉంటే ఆర్థిక నిధులు మంజూరై అభివృద్ధి పనులు జరిగేవని ఇపుడు రెండిండికి చెడ్డ మండలంగా అల్లూరు మారిందని వాపోతున్నారు.

● బకాయిలు చెల్లించని జనం

నగర పంచాయతీలో ఇప్పటివరకు అల్లూరులో రూ2.60కోట్లు పన్నులు చెల్లించాల్సి ఉంది. ప్రజలు అందుకు సమ్మతించక పోవడంతో పారిశుధ్య సిబ్బందికి కూడా జీతాలు ఇచ్చే పరిస్థితి లేని పరిస్థితి ఉంది. నార్తుమోపూరు ప్రజానీకం అసలు తాము పన్నులు కట్టే పరిస్థితే లేదని గ్రామపంచాయతీ మార్పు జరిగితేనే పన్నులు చెల్లిస్తామంటూ అధికారులకు కరాఖండీగా తేల్చి చెబుతున్నారు.

ఇంకెప్పుడు మారుస్తారు



నగర పంచాయతీగా మార్చినప్పటి నుంచి అల్లూరు అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. కనీసం తాగునీటి సమస్యను కూడా తీర్చలేదు. ఎన్నికలు జరిగి టీడీపీ ప్రభుత్వం ఏర్పడితేనైనా మళ్లీ పంచాయతీగా మారుతుందని భావించాం. కానీ ఆ ఊసే కనపడడం లేదు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

\- దుత్తా శ్రీకాంత్, అల్లూరు

పన్నులు వసూలు కావడం లేదు

నగర పంచాయతీ ప్రజలు పన్నులు చెల్లించడం లేదు. పలుమార్లు టాంటాం వేయించినా ఎవరూ స్పందించడం లేదు. అరకొరగా జరిగే పన్నుల వసూలుతో సిబ్బందికి జీతాలు ఇవ్వడమే సరిపోతుంది. ఇంకా 5 నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి.

\- ఉమామహేశ్వరరావు, కమిషనర్, అల్లూరు

92 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కావలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్ర జరిగిన కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి 92మంది లబ్ధిదారులకు రూ.80.80లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 487మంది సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే వారిలో 327మంది ఆర్థికసాయం అందినట్లు చెప్పారు. రాజకీయాలు, కులమతాలకతీతంగా దళారులు లేకుండా అర్హులకు న్యాయం చేశామన్నారు.

కాగా, రైతులు పండించిన ధాన్యంకు గిట్టుబాటు ధర కల్పించేందుకు స్థానిక టీడీపీ కార్యాలయంలో ఒక సెల్ ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 51 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ-క్రాప్ నమోదులో కొన్ని ఇబ్బందులు రావటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అధికారులతో మాట్లాడి ఆ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, మలిశెట్టి వెంకటేశ్వర్లు, పమిడి రవికుమార్ చౌదరి, మాలేపాటి నాగేశ్వరరావు, జ్యోతి బాబూరావు , పోట్లూరు శ్రీనివాసులు, తటవర్తి వాసు, తిరువీధిప్రసాద్, మొగిలి కల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుడికి సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, టీడీపీ నేతలు

ఇకనైనా సోమశిల
ఆయకట్టు స్థిరీకరిస్తారా..?

- అసెంబ్లీలో గళమెత్తిన కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి



జలదంకి, మార్చి21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సోమశిల ప్రాజెక్ట్ ఆయకట్టు పరిధిలోని వ్యవసాయభూములు నేడు వ్యవసాయేతర (ల్యాండ్ కన్వర్షన్) భూములుగా మారిపోయాయి అధ్యక్షా అని కావలి ఎమ్మెల్యే కావ్యా క్రిష్ణారెడ్డి బుధవారం శాసనసభలో తన గళం విప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ భూముల్లో పరిశ్రమలు, రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోయినా ఆ భూములన్నీ సోమశిల జలాశయం ఆయకట్టులో చూపిస్తూ ప్రతిఏడాది సాగునీటి కేటాయింపులు చేస్తున్నారు. ఇకనైనా సోమశిల ఆయకట్టు స్థిరీకరణ చేపట్టి బీడుభూములుగా ఉన్న మెట్ట ప్రాంతం అయిన కావలి, ఉదయగిరి తదితర నియోకవర్గాలకు చెందిన వాటిని ఆయకట్టులో చేర్చి సాగునీటి సౌకర్యం కల్పించి, ఈ ప్రాంత వలసలను నివారించాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడిన మాటలు రైతుల్లో చర్చనీయాంశంగా మారింది.

మహిళల జోలికెళ్తే ఉపేక్షించొద్దు

- కలిగిరి సీఐ, జలదంకి ఎస్‌ఐకు ఎమ్మెల్యే కాకర్ల ఆదేశం

జలదంకి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంంలోని కమ్మవారిపాలెం మహిళలపై యువకుడు గొడ్డలితో దాడి చేసిన ఘటనపై ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తీవ్రంగా స్పందించారు. దాడిచేసిన యువకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలిగిరి సీఐ వెంకటనారాయణ, జలదంకి ఎస్ఐ లతీఫున్నీసాతో మాట్లాడినట్లు పేర్కొన్నారు. ఆడపడుచులు, అక్కాచెల్లమ్మల జోలికి వెళ్తే ఉపేక్షించవద్దని ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు.

ఎన్నాళ్లీ ట్రాఫిక్ కష్టాలు

కలిగిరి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కలిగిరమ్మ కూడలి ప్రాంతం ఉదయం, సాయంత్రం వేళలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. వాణిజ్య సముదాయం కావడంతో పలు రకాల దుకాణాదారులు రోడ్డుపైకి చొచ్చుకురావడంతో ప్రధాన రహదారి కుచించుకుపోయింది. దీనికితోడు ఆటోవాలాలు రోడ్డుపైనే నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. క్రమబద్ధీకరించాల్సిన సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



న్యూస్ బాక్స్

క్రమబద్ధీకరణ చార్జీలపై 50 శాతం రాయితీ

కొండాపురం, మార్చి21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికలోడు వాడకంపై క్రమబద్ధీకరణ చార్జీలపై వినియోగదారులకు ప్రభుత్వం 50శాతం రాయితీ కల్పించిందని శ్రువారం ఇన్‌చార్జి ఏఈ దినేష్‌కుమార్ తెలిపారు. కిలోవాట్ ప్రస్తుతం రూ.2,250 చెల్లిస్తుండగా రాయితీతో కేవలం రూ.1,250 చెల్లించవచ్చన్నారు. అలాగే 2కిలోవాట్లకు రూ.4,450లో రూ.2,450, 3కిలోవాట్లకు రూ.6,650లో రూ.3,650, 4కిలోవాట్లకు రూ.8,850లకు రూ.4,850, 5కిలోవాట్లకు రూ.11,050 ఉండగా తగ్గింపుతో రూ.6,050 చెల్లించాల్సి ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

కొండాపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గుడవళ్లూరులోని చిమ్మిలి మహేష్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మధ్యాహ్న సమయంలో ఇంటి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి అలమారల్లో ఉన్న దస్త్రాలను చిందరవందరగా పారవేశారు. అక్కడున్న రూ.3వేలను అపహరించారు. ఈ విషయమై ఎస్ఐ ఎమ్ వెంకటరావును వివరణ కోరగా స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తామన్నారు.

ఇఫ్తార్ విందు

కావలిటౌన్, మార్చి21 (ఆంధ్రజ్యోతి) మాజీ కౌన్సిలర్ టీడీపీ లీగల్‌సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి మాజీ ఐసీడీఎస్ రీజనల్ చైర్‌పర్సన్ శ్రీదేవి దంపతులు శుక్రవారం మునునూరు రాఘవేంద్ర కాలనీలోని మసీదులో ఉపవాస దీక్షాధారులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఉపవాస దీక్షలు పాటించి వారి వారి శక్తిమేరకు దానధర్మాలు చేయడం మంచి సేవా కార్యక్రమమని వారు ఇఫ్తార్ విందు స్వీకరించడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు.

లింగసముద్రం ఎస్సైగా నారాయణ

లింగసముద్రం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ లింగసముద్రం ఎస్సైగా ఎం నారాయణను నియమించారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎస్సై షేక్ మహబూబ్ సుభానీని బదిలీ చేశారు. దీంతో ఎస్సైగా నియమితులైన నారాయణ శుక్రవారం ఉదయం విధుల్లో చేరారు.

పదో తరగతి పరీక్షా కేంద్రం తనిఖీ

లింగసముద్రం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లోని పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని రాష్ట్ర పరిశీలకుడు, జిల్లా అదనపు ప్రత్యేక ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఉదయం 9.30 గంటలకు ఇంగ్లీషు పరీక్ష ప్రారంభమైన వెంటనే ఆయన పరీక్ష రాస్తున్న విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన విద్యార్థుల బాతురూంలు, మరుగుదొడ్లను పరిశీలించారు. అలాగే ఇన్విజిలేటర్లకు పలు సూచనలు చేశారు. ఎవరైనా కాపీయింగ్‌కు పాల్పడినా, సహకరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పెదపవనిలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని లింగసముద్రం తహసీల్దార్ ఎస్ సీతామహాలక్ష్మి సందర్శించి విద్యార్థులను తనిఖీ చేశారు.

నేటి నుంచి కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

వలేటివారిపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమీన్ ఉప్పలపాడు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు శనివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రత్యేకాధికారిణి గోవర్ధిని తెలిపారు. 6 నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం వరకూ 40 సీట్లు ఖాళీలు ఉన్నాయని, ఈ అవకాశాన్ని అర్హత కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గోవర్ధిని తెలియజేశారు.

వాహనాలకు తుప్పు



వలేటివారిపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పోలీసులు తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న కార్లు, ద్విచక్ర వాహనాలు ఆటోలు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏళ్ల తరబడి ఉండడంతో తుప్పుపట్టిపోతున్నాయి. వాహనాలను వేలం వేసినా కనీసం ప్రభుత్వానికి ఆదాయం అయినా సమకూరుతుందని పలువురు పేర్కొంటున్నారు. పోలీస్‌స్టేషన్ బయట వాహనాలు ఉండడంతో గుర్తుతెలియని దుండగులు విడి భాగాలను తీసుకెళ్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సీజ్ చేసిన వాహనాలు ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాహనాలను వేలం వేస్తే ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

కావలిటౌన్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు మేఘనాథ్, మహేష్‌లు తెలిపారు. శుక్రవారం స్థానిక రాజీవ్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్ర, వెంగళరావునగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఈవ్యాధి పట్ల అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రెండు వారాలు తగ్గకుండా దగ్గు వస్తుండడం, గళ్ల పడడం, తరచూ జ్వరం రావడం, బరువు క్షీణించడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే మందులతో పాటు ప్రధానమంత్రి టీబి ముక్త్ భారత్ పథకంలో భాగంగా వ్యాధిగ్రస్తులకు పప్పుదినుసులు, ప్రతి నెలా రూ.1000ల నగదను బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణయ్య, ఆసిఫ్‌షరీఫ్, శివప్రసాద్, ప్రసన్న పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

మర్రిచెట్టు కాలనీలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

- హర్షం వ్యక్తంచేస్తున్న కాలనీ వాసులు

కావలి రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మునునూరులోని మర్రిచెట్టు కాలనీలో స్థానికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అదనపు ట్రాన్స్‌ఫారంను శుక్రవారం విద్యుత్ శాఖ రూరల్ ఏఈ శ్రీనివాసులు రెడ్డి స్థానిక నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు మాట్లాడారు. కాలనీలోని గిరిజనులు, గిరిజనేతరులు విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులతో గత కొన్ని సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నట్లు ఈ విషయాన్ని ఎమ్మెల్యే కావ్యక్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లామ న్నారు. ఆయన స్పందించి రూ.10లక్షల వ్యయంతో అదనపు ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చే యించి సమస్య పరిష్కరించినట్లు తెలిపారు. మా కాలనీలో విద్యుత్ వోల్టేజీతో గృహోప కరణాలు సైతం కాలి పోతుండటంతో తీవ్ర ఇబ్బందలు పడుతున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని గత వైసీపీ ప్రభుత్వంలో నేతల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే కావ్యక్రిష్ణారెడ్డి స్పందించి చర్యలు తీసుకోవడంతో ఆయనకు రుణపడి ఉంటా మంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రావ్, లింగం మాళి, కాలనీవాసులు పాల్గొన్నారు.



అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న విద్యుత్ శాఖ ఏఈ తదితరులు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

వలేటివారిపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం భారతీయ రిజర్వు బ్యాంక్, స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ నరేంద్రదేవ్ హాజరై మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బ్యాంక్ సేవలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మల్లిఖార్జునరావు, ఏపీజీవీ రిటైర్డు మేనేజర్ సూర్యప్రకాష్, వెలుగు సీసీలు తిరుమల, మేరి, కుమారి డ్వాక్రా మహిళలు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, రైతులు పాల్గొన్నారు.



ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో నరేంద్రదేవ్

విష ప్రయోగంతో మూగ జీవాలు మృత్యువాత

ఉలవపాడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విష ప్రయోగంతో మూగ జీవాలు మృత్యువాత పడిన సంఘటన శుక్రవారం జరిగింది. ఎస్సై అంకమ్మ తెలిపిన వివరాల మేరకు... కరేడు గ్రామానికి చెందిన వాకా శ్రీనివాసులు గొర్రెలను మేపుతుంటాడు. స్థానిక గొర్రెల దొడ్డిలోని నీళ్ల తొట్టిలో రోజు మాదిరిగానే మూగ జీవాలకు నీళ్ల పెట్టగా తాగిన వెంటనే 25 గొర్రెలు మరణించాయి. పరిస్థితిని గమనించిన శ్రీనివాసులు మిగిలిన జీవాలు నీళ్ల తొట్టి వద్దకు వెళ్లకుండా జాగ్రత్త పడ్డాడు. అనంతరం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై అంకమ్మ తన సిబ్బందితో సంఘటనా సలానికి చేరుకుని విచారణ చేపట్టారు. తమ్ముడి కుటుంబంతో గత కొంతకాలంగా గొడవలు ఉన్నాయని, దీంతో వారిపై అనుమానం వ్యక్తంచేస్తూ శ్రీనివాసులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నీటి తొట్టి నుంచి శాంపిల్ కోసం నీటిని సేకరించి పరీక్షల నిమిత్తం భద్రపరిచినట్లు ఎస్సై తెలి పారు. పశు సంవర్ధక శాఖ ఏడీ సురేష్‌నాయుడు తన సిబ్బందితో మృతి చెందిన జీవాలకు పోస్టుమార్టం నిర్వహించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సుమారు రూ.2 లక్షల నష్టం జరిగిందని ఇన్సూరెన్స్ కూడా లేదని బాధిత కుటుంబం వాపోతోంది.



మూగ జీవాల కళేబరాలు

ప్రాణాలు తీస్తున్న హైవే జంక్షన్లు

- రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులు

వలేటివారిపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా శింగరాయికొండ నుంచి నెల్లూరు జిల్లా మాలకొండ వరకూ ఇటీవల నూతనంగా నిర్మించిన జాతీయ రహదారిపై పలు జంక్షన్‌లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. స్టాపర్ బోర్డులు లేకపోవడం, బ్లింకర్లు ఏర్పాటు చేయకపోవడంతో వాహనచోదకులు వేగాన్ని నియంత్రించడంలేదు. దీంతో ఆయా జంక్షన్‌ల వద్ద రోడ్డు దాటుతున్న పాదచారులు, వాహనచోదకులు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. కందుకూరు నుంచి మాలకొండ వరకూ ఈ ఆరు నెలల వ్యవధిలో సుమారు 10 యాక్సిడెంట్లు జరిగాయి. అందులో ఆరుగురు దుర్మరణం చెందారు. 10 మందికి పైగా క్షతగాత్రులయ్యారు. పోకూరు సమీపం లో ఇద్దరు, వలేటివారిపాలెం కాకర్లవా రిపాలెం గ్రామాల మధ్య హైవేలో ఇద్దరు, అయ్యవారిపల్లె గ్రామంలోని జంక్షన్ వద్ద ఇద్దరు మృతి చెందారు. 10 మందికి పైగానే క్షతగాత్రులయ్యారు. ప్రతిరోజూ స్థానిక పోలీసులు వాహనచోదకులకు రోడ్డు నిబంధనల పై అవగాహన కల్పిస్తున్నారు. నిబంధ నలను ఉల్లఘించిన వారిపై చర్యలు చేపడుతున్నారు. అయినప్పటికీ వాహనచోదకులు వేగంగా వెళ్తూ ప్రమాదాలకు గురై మృతిచెందుతున్నారు.



పోకూరు వద్ద హైవేపై జరిగిన పమాదంలో మృతిచెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దినేష్ (ఫైల్)

ఎమ్మెల్యే ఇంటూరికి సత్కారం

కందుకూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటుండటాన్ని హర్షిస్తూ మాదిగ సామాజికవర్గ నేతలు శుక్రవారం కందుకూరులో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును సత్కరించారు. రాష్ట్ర శాసనసభ, శాసనమండలిలో వర్గీకరణకు అనుకూలంగా ఏకగ్రీవంగా తీర్మానం చేసే కార్యక్రమంలో సహకారం అందించినందుకు ఎమ్మెల్యేను సత్కరిస్తున్నట్లు మాదిగ నేతలు తెలిపారు. కార్యక్రమంలో గోచిపాతల మోషే, రాయపాటి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, రెబ్బవరపు మాల్యాద్రి, బద్ధిపూడి శిఖామణి, తాటిపర్తి రామకృష్ణ, దువ్వూరి రమేష్‌చంద్ర, గడ్డం నవీన్, గౌడపేరు ప్రసాదరావు, జడ రవీంద్రబాబు, ఎండ్లూరి పుల్లయ్య, మందా పరిశుద్ధరావు, ఉచ్చులూరి నిరంజన్, ఉచ్చు లూరి సుబ్బారావు, బొక్కా మాధవరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాగేశ్వరరావును సత్కరిస్తున్న మాదిగ సామాజికవర్గ నాయకులు



ఘనంగా గ్రామదేవతలకు పూజలు

కందుకూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కందుకూరులో గ్రామదేవతలు పోలేరమ్మ, మహాలక్ష్మమ్మలకు శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల ప్రజలు కుటుంబసమేతంగా తరలివచ్చి అమ్మవార్లకు చద్దులు సమర్పించి పూజలు చేశారు. ధర్మకర్త దివి లింగయ్యనాయుడు మాట్లాడుతూ ఆదివారం అంకమ్మకు జరిగే పాలపొంగళ్ల కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు విచారణ

గుడ్లూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వర్ణాజిపురం ఎస్సీ కాలనీకి చెందిన ఎండ్లూరి బాలసుందరం అదే గ్రామానికి చెందిన ఓ బీసీ సంఘ నాయకుడిపై ఇటీవల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కందుకూరు డీఎస్పీ బాలసుబ్రమణ్యం శుక్రవారం విచారణ జరిపారు. కేసుకు సంబంధించి వివరాలు తెలుసుకునేందుకు డీఎస్పీ స్వర్ణాజిపురం చేరుకొని అక్కడ కొందరిని విచారించారు. మరిన్ని వివరాలు సేకరించిన అనంతరం మీడియాకు వివరాలు తెలియజేస్తామని ఈ సందర్భంగా పోలీసులు తెలియజేశారు.

నేటి నుంచి ఉపాధి పనుల తనిఖీ

ఉలవపాడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి పనుల ఆడిట్ శనివారం నుంచి గ్రామాల్లో ప్రారంభించనున్నట్లు ఏపీవో అబ్దుల్లా తెలిపారు. మండలానికి విచ్చేసిన సామాజిక బృందం సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలతో శుక్రవారం సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేసినట్లు చెప్పారు. మండలంలో 12 గ్రామ పంచాయతీల్లో గత ఏడాది జరిగిన ఉపాధి పనులకు సంబంధించిన రికార్డులు ఆడిట్ బృందం సభ్యులకు అందచేశామన్నారు. ఎస్ఆర్‌డీఎస్ నిబంధనల ప్రకారం గ్రామాల్లో ప్రజా వేదికలు నిర్వహించి ఆడిట్ జరపాలని లోపభూయిష్టంగా నివేదికలు సమర్పించినట్లు ఫిర్యాదులు అందితే ఆడిట్ సభ్యులపై చర్యలు తీసుకుంటామని ఈసందర్భంగా అధికారులు హెచ్చరించారు. ఈనెలాఖరుకి సామాజిక తనిఖీ పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో బహిరంగ ప్రజా వేదిక నిర్వహించి గ్రామాల వారీగా నివేదికను సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కందుకూరు ఏపీడీ బాబురావు, ఎంపీడీవో విజయ, ఎస్ఆర్‌పీ నీలకంఠం, టెక్నికల్ అసిస్టెంట్లు, ఎఫ్ఏలు, తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ బృందం సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ నీలకంఠం



ఘాట్ ఏదీ?

● స్వర్ణాల తీరాన్ని కమ్మేసిన గుర్రపు డెక్కాకు

నెల్లూరులోని బారాషహీద్ దర్గా వెనుక స్వర్ణాల చెరువులో ప్రస్తుతం ఘాట్ కనిపించడం లేదు. మెట్లతో సహా ఘాట్ మొత్తాన్ని గుర్రపు డెక్కాకు కమ్మేసింది. చూడటానికి పచ్చగా అందంగా కనిపిస్తున్నప్పటికీ చెరువు నీరు రంగుమారి కలుషితమైంది. అంతేకాదు, రూ.కోట్లు ఖర్చు పెట్టి ప్రజలకు ఆహ్లాదాన్ని ఇచ్చేందుకు స్వర్ణాల ఘాట్ ముందు గ్రీనరీ ఏర్పాటు చేశారు. దానిని సక్రమంగా నిర్వహించడంలో నగర పాలక సంస్థ నిర్లక్ష్యం కారణంగా ఘాట్ పరిసరాలు అధ్వానంగా మారాయి. దీనికితోడు ఆ ప్రాంతమంతా వ్యర్థాలతో నిండి చెత్తకుండీలా మారి దుర్వాసన వ్యాపిస్తోంది. పాలకులు, అధికారులు స్పందించి ఘాట్‌ను ఆహ్లాదకరంగా మారిస్తే ఈ వేసవిలే సాయంత్రం వేళ నగర వాసులు సేదతీరేందుకు అనువుగా ఉంటుంది.

\- నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి)

రాజరాజేశ్వరి ఆలయంలో ఆవు నెయ్యి పథకానికి రూ.1,00,116 విరాళం

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారి దీపానికి ఆవు నెయ్యి విరాళ పథకం ప్రారంభించారు. దీనికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. శుక్రవారం వేమసాని సూర్యనారాయణ, గిరిజావతి, గౌతమ్‌కుమార్ కుటుంబం రూ.1,00,116 విరాళం అందజేసింది. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్, ఆలయ ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ భక్తులు ఆలయంలో దీపారాధనకు ఆవు నెయ్యి విరాళంగా ఇవ్వొచ్చన్నారు. ఒకరోజుకి రూ.2వేలు (3 లీటర్లు) చొప్పున, ఒకరోజు శాశ్వత చందాగా రూ.30వేలు చెల్లించవచ్చునని తెలిపారు. ఒకనెలకు రూ.60వేలు విరాళంగా ఇవ్వవచ్చన్నారు. దాతల పేరున గోత్రనామాలతో ఖడ్గమాల పూజ చేస్తారని చెప్పారు.

నేటినుంచి జాతీయస్థాయి ఇన్విటేషన్ టెన్నిస్ టోర్నీ

కావలి టౌన్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): అఫీషియల్ క్లబ్, కావలి టెన్నిస్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో కావలిలో శనివారం నుంచి డాక్టర్ సీఎల్ఎన్ రెడ్డి, సుజనమ్మ ట్రస్ట్ జాతీయ స్థాయి ఇన్విటేషన్ డబుల్స్ టెన్నిస్ టోర్నీ నిర్వహించనున్నట్లు శుక్రవారం అఫీషియల్ క్లబ్‌లో టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు అనుమలశెట్టి రామకృష్ణ, కార్యదర్శి వంశీమోహన్ తెలిపారు. ఈ నెల 22, 23 తేదీల్లో జరగనున్న పోటీల్లో జాతీయస్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 70జట్ల వరకు ఈ టోర్నీలో పాల్గొంటాయని చెప్పారు. పట్టణంలోని అఫీషియల్ క్లబ్ కోర్టు, జేబీ కళాశాలలోని టెన్నిస్ కోర్టు, తుమ్మల పెంట రోడ్డు వద్దనున్న ఎస్ఆర్ క్లబ్ కోర్టులలో ఈ పోటీలో 40ప్లస్, 50ప్లస్, 60ప్లస్, 70ప్లస్ నాలుగు విభాగాల ఏజ్ గ్రూపులు తలపడతాయన్నారు. కావలి రోటరీక్లబ్ వ్యవస్థాపకులు ప్రముఖ సీనియర్ టెన్నిస్ క్రీడాకారుడు, విశ్రాంత జిల్లా వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీనరసారెడ్డి సహాయ సహకారాలతో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

28,122 టన్నుల ధాన్యం కొనుగోలు

నెల్లూరు (హరనాథపురం), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 28122 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జేసీ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం 3306 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, 24 నుంచి 48 గంటల్లోగా రైతుల ఖాతాలకు నగదు జమ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు రూ.60.36కోట్లు రైతులకు చెల్లించినట్లు పేర్కొన్నారు. దళారుల మాటలు విని తక్కువ ధరకు అమ్ముకోవద్దని రైతులను కోరారు.


రేపు దస్తావేజు లేఖర్ల సంఘం సమావేశం

నెల్లూరు(హరనాథపురం), మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లా దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు నగరంలోని మహేశ్వరి పరమేశ్వరి కల్యాణ మండపంలో జరుగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పట్నం దుర్గేష్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. డాక్యుమెంట్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సాంకేతిక సమస్యల వల్ల రైటర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామ ని పేర్కొన్నారు. దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు తప్పక హాజరుకావాలని కోరారు.

ఓపెన్ బెట్టింగ్.. యువతే టార్గెట్!

- మొదలైన ఐపీఎల్ కొత్త సీజన్
- క్రికెట్ బెట్టింగ్ కోసం ప్రత్యేక యాప్‌లు
- లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే...
- ఈజీ మనీ కోసం బానిసలవుతున్న యూత్
- అధిక వడ్డీలు, తనఖా, తండల్‌కు అప్పులు
- రోడ్డున పడుతున్న ఎన్నో కుటుంబాలు
- ఆర్థికంగా చితికిపోయి ఆత్మహత్యలు
- తల్లిదండ్రులు గమనిస్తుండాలి
- హెచ్చరిస్తున్న నిపుణులు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) క్రికెట్ సీజన్ వచ్చిందంటే అభిమానుల సంగతి పక్కనపెడితే బెట్టింగ్ రాయుళ్లు, బెట్టింగ్ మాఫియాలు మాత్రం చెలరేగిపోతుంటాయి. మ్యాచ్ మ్యాచ్‌కు కాదు... బాల్ బాల్‌కి పందెం కట్టి ఓపెన్‌గానే రూ.వేల కోట్లలో వ్యాపారం చేస్తున్నారు. పందెం నడిపేవారు.. పందెం కాసేవారు ఎవరూ ఒకరినొకరు చూసుకునేది లేదు, చేతికి డబ్బులిచ్చేదీ లేదు. అంతా ఆన్‌లైన్‌లోనే!. సులభంగా డబ్బు సంపాదించేందుకు ఎక్కువ మంది యువత ఈ బెట్టింగ్‌కు ఆకర్షితులవుతున్నారు. ముందు ఒకటి.. రెండు సార్లే! అంటూ మొదలుపెట్టి ఆ తర్వాత దానికి బానిసలవుతున్నారు. సంపాదించే సంగతి ఎలా ఉన్నా బెట్టింగ్ మాయలో పడి దాచుకున్న డబ్బులేకాదు... అందిన చోటల్లా అప్పులు చేసి నిండా మునిగిపోతున్నారు. ఉన్నదంతాపోయి రోడ్డున పడేవాళ్లు కొందరైతే, ఆర్థికంగా చితికిపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారు మరికొందరు. ఏటా ఇలాంటి వార్తలు, సంఘటనలు కళ్లముందే కనబడుతున్నప్పటికీ మళ్లీ.. మళ్లీ ఎంతో మంది ఆ కూపంలో కూరుకుపోతూనే ఉన్నారు. ఈ ఏడాది ఐపీఎల్ కొత్త సీజన్ శుక్రవారం మొదలైంది. సుమారు రెండు నెలలు కొనసాగే ఈ టోర్నమెంటు ఎలాంటి అనుభవాలు మిగులుస్తుందో చూడాలి.



నెల్లూరు(క్రైం), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ క్రికెట్ టోర్నీ మొదలవడంతో జిల్లా వ్యాప్తంగా బెట్టింగ్ బాబులు సిద్ధమయ్యారు. ప్రస్తుతం బెట్టింగ్ కొత్త రంగు పులుముకుంది. గతంలో ఒక ప్రదేశంలో అందరూ చేరి పందెం కాసి డబ్బులు ఇచ్చిపుచ్చుకునే వారు. కొందరు జూదగాళ్లు హోటళ్లలోని గదులను అద్దెకు తీసుకొని ఈ మ్యాచ్‌కు ఇంత... ఈ ఓవర్‌కు ఇన్ని రన్స్, ఈ బాల్‌కు ఇంత స్కోర్ అంటూ నేరుగా నగదు లావాదేవీలు చేసేవారు. కానీ కొన్నేళ్లుగా పరిస్థితి మారిపోయింది. కొందరు జూదగాళ్లు ఇప్పటికీ పాత పద్ధతినే అవలంబిస్తున్నప్పటికీ చాలామటుకు యాప్‌లలోనే అన్నీ నడిచిపోతున్నాయి. టెక్నాలజీ పరుగులు తీస్తుండటంతో క్రికెట్ బెట్టింగ్ కోసం ప్రత్యేకంగా యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంటే చాలు, ఎక్కడి నుంచైనా బెట్టింగ్ పెట్టేయొచ్చనే పరిస్థితులు నెలకొన్నాయి.

● యాప్‌లు.. ఫ్యాన్సీలు.. రేటింగ్

బెట్టింగ్ నిర్వహించే వారు యాప్‌ల వివరాలు తెలిపి అడ్వాన్స్‌గా రూ.5వేల నుంచి లక్షలు వరకు వసూలు చేస్తారు. ఆ నగదును ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా పంపాలని నెంబర్లు ఇస్తారు. డబ్బు వారికి చేరాక బెట్టింగ్ కాసుకునే అవకాశం కల్పిస్తారు. మ్యాచ్ ప్రారంభం కాకముందే ఆ రోజు ఆడే టీమ్‌లను బట్టి రేటింగ్ ఇస్తారు. మ్యాచ్ ప్రారంభం నుంచి చివరి వరకు బెట్టింగ్ ఆడే అవకాశం ఉంటుంది. ఇవి కాకుండా ఫ్యాన్సీలని కొన్ని ఉంటాయి. ఒక ఓవర్‌కు ఇన్ని రన్స్ కొట్టలేరు... కొడుతారు!, ఆ బ్యాట్స్‌మెన్ ఇన్ని రన్స్ కొడుతాడు... కొట్టలేడు!, మొదటి 10 ఓవర్లలో ఇంత స్కోర్ చేస్తారు.. చేయలేరు!.. ఇలా ఫ్యాన్సీల పేరుతో కూడా బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. కొన్ని యాప్‌లలో అయితే ఎవరు బెట్టింగ్ నడుపుతున్నారు?, ఎవరికి ఆన్‌లైన్‌లో డబ్బులు పండుతున్నామన్న వివరాలు కూడా తెలియవు. ఈ క్రమంలో ఎన్నో నకిలీ యాప్‌లు, దొంగ బెట్టింగ్ మాఫియాలు కూడా చేతివాటం చూపుతున్నాయి. అలాంటి వారి ఉచ్చులో పడి ఎంతో మంది నష్టపోతున్నారు.

● ఈజీ మనీ కోసమే....

క్రికెట్ బెట్టింగ్‌పై యువతే ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. కాలేజీ కుర్రాళ్లయితే ఈజీ మనీ కోసం మ్యాచ్‌లు, బెట్టింగే జీవితం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇందుకు అవసరమైన డబ్బు కోసం సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, బంగారు గొలుసులు, బైక్‌లు, కార్లు... ఇలా ఏది అవకాశం ఉంటే దాన్ని తాకట్టు పెట్టేస్తున్నారు. అవీ చాలక వడ్డీలకు, తండలకు అప్పులు తెచ్చి మరీ ఈ ఆన్‌లైన్ జూదం ఆడి చివరికి అన్నీ పోగొట్టుకుంటు న్నారు. కొందరు ఆర్థిక సమస్యల నుంచి బయటపడేందుకు బెట్టింగ్‌లను మార్గంగా ఎంచుకుంటున్నారు. ఇందు కోసం కష్టపడి సంపాదించినదానితోపాటు భార్యాబిడ్డల బంగారం, ఆఖరికి తాళిబొట్టును కూడా తనఖాపెట్టి సర్వం కోల్పోతున్నారు. బెట్టింగ్ ఆడే వారి బలహీనతను అవకాశంగా మలుచుకుని ఈ సీజన్‌లో ఎంతో మంది వడ్డీ వ్యాపారులు పుట్టుకొస్తున్నారు. తక్కువ వడ్డీ ఆశ చూపి వస్తువులను తాకట్టు పెట్టుకుని అప్పులిస్తున్నారు. ఆ తర్వాత భారీ మొత్తంలో వడ్డీలను ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. కొందరైతే అప్పుమొత్తం చెల్లించినా వారి వస్తువులు తిరిగి ఇవ్వకుండా వేధిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. బాధితులు అటు పోలీసులకు ఫిర్యాదు చేయలేక, ఇటు కుటుంబ సభ్యులకు చెప్పుకోలేక సతమతమవుతున్నారు.

● తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం

బెట్టింగ్ భూతానికి యువత బలికాకుండా తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. క్రికెట్ మ్యాచ్ జరుగుతున్న సమయంలో పిల్లలు ఏమి చేస్తున్నారో గమనించాలంటున్నారు. యుక్త వయసులో ఉన్న పిల్లలు క్రికెట్ మ్యాచ్ పూర్తయ్యే వరకు ఇంటికి రాకపోయినా, ఇంట్లోనే మ్యాచ్ చూస్తూ టెన్షన్‌తో అటూ.. ఇటూ తిరుగుతున్నా బెట్టింగ్ పెట్టాడేమోనని అనుమానించాలంటున్నారు. సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, బైక్‌లు కనిపిం చకుండాపోతే మరింత జాగ్రత్తపడాలని హెచ్చరిస్తున్నారు. బెట్టింగ్ భూతం గురించి అర్థమయ్యేలా వివరించి, అవసరమైతే వైద్యులతో కౌన్సెలింగ్ ఇప్పించి వారిని ఆ వ్యసనం నుంచి బయటపడేయాలని సూచిస్తున్నారు.

లైంగిక వేధింపులు, హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు శిక్ష

నెల్లూరు(లీగల్), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికపై లైంగిక వేధింపు, హత్యాయత్నం చేశాడన్న కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.1000 జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... వింజమూరు మండలం వెంకటాద్రిపాలెంకు చెందిన ఓ బాలిక 2013 మే 6వ తేదీన కాలకృత్యాలు తీర్చుకునేందుకు చిల్లచెట్ల మధ్యకు వెళ్లగా అదేగ్రామానికి చెందిన ఆర్. కృష్ణ ఆమెపై లైంగిక దాడికి పాల్పడేందుకు ప్రయత్నించగా అందుకు ఆమె వ్యతిరేకించడంతో ఆమెను లాక్కునిపోయి పక్కనే ఉన్న బావిలో తోసివేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు వింజమూరు పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో అతనిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.చంద్రశేఖర్ వాదించారు.

నిమ్మతోట కంచె దగ్ధం

పొదలకూరు : స్థానిక పంచాయతీ పరిధిలోని లింగంపల్లికి చెందిన అనుమాల వెంకట్రామిరెడ్డికి చెందిన నిమ్మతోట కంచెకు శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు తగలబెట్టారు. మంటలు దట్టంగా వ్యాప్తి చెందడంతో కంచె దాదాపుగా దగ్ధం అయ్యింది. సమాచారం అందుకున్న పొదలకూరు అగ్నిమాపక సిబ్బంది వాహనంతో వచ్చి మంటలు నిమ్మ చెట్లకు రాకుండా అదుపు చేశారు. ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

27 నుంచి గుంటూరులో సాంకేతిక పరిజ్ఞానంపై సదస్సులు

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 21(ఆంధ్రజ్యోతి): చిన్న కమతాల్లో సుస్థిరమైన నికర ఆదాయం పొందగలిగే సాంకేతిక పరిజ్ఞానంపై కేంద్ర వ్యవసాయశాఖ, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి గుంటూరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం లాంఫాంలో ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి.లలితశివజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి, లక్షద్వీప్, అండమాన్ రాష్ట్రాల రైతులకు ఉపయోగపడేలా ఈ కార్యక్రమం చేపట్టారని పేర్కొన్నారు. రైతు సదస్సుతోపాటు వ్యవసాయ అనుబంధ శాఖల సాకేంతికను ప్రదర్శించేందుకు దాదాపు 300 స్టాళ్లు ఏర్పాటు చేస్తారని తెలిపారు. 27 నుంచి 29వ తేదీ వరకు జరిగే ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

విద్యుత్ బిల్లులు తగ్గించాలి

నెల్లూరు(వైద్యం), మార్చి 21(ఆంధ్ర జ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించా లని డిమాండ్ చేస్తే నెల్లూరు నగరంలోని విద్యుల్ భవన్ ఎదుట సీపీఎం నెల్లూరు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. కరెంటు బిల్లులు దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, కొండా ప్రసాద్‌లు మాట్లాడారు. ట్రూ అప్, ఇంధన సర్దుబాటు చార్జీలు, స్మార్ట్‌మీటర్లు రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో కరెంటు చార్జీలు పెరిగితే ఈ భారాలు దుర్మార్గమని టీడీపీ గగ్గోలు పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కరెంటు చార్జీల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. గతంలో ఆదానీతో చేసుకున్న సెకీ బప్పందంలో రూ.1750 కోట్లు అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆ ఒప్పందాన్ని రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్‌శాఖ ఎస్ఈకి వినతిపత్రం అందించారు.

● పారిశుధ్య సమస్య, దోమల నివారణ, కలుషిత నీరు తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బాలాజీనగర్ సచివాలయం ఎదుట సీపీఎం నేతలు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, ప్రసాద్ పాల్గొన్నారు.

మెట్టలో మాణిక్యం!

తాము ఏదో సాధించాలని అందరూ కలలుకంటారు. కొద్దిమంది మాత్రమే తమ కలలను నిజం చేసుకోవడానికి కృషి చేస్తారు. ఆ కృషి సరిపడేంతలా ఉంటేనే కలలు నెరవేరుతాయి. ఒక రంగంలోనే కాక పలురంగాల్లో తనదైన శైలితో ముందుకెళుతున్న భారత రక్షణ శాఖ శాస్త్రీయ సలహాదారు, డీఆర్డీవో మాజీ చైర్మన్, ఇండియన్ ఏరోనాటికల్ ఇంజనీర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు నెల్లూరు జిల్లాకు చెందిన డాక్టర్ గుండ్రా సతీష్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారుగా నియమితులయ్యారు. దీంతో ఆయన స్వగ్రామం ఆత్మకూరు మండలంలోని మహిమలూరులో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

\- ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి)



● ప్రముఖ శాస్త్రవేత్తగా సతీష్‌రెడ్డి రాష్ట్రప్రభుత్వ సలహదారుగా నియామకం

● స్వగ్రామమైన మహిమలూరులో ఆనందోత్సాహం

మెట్టప్రాంతమైన మహిమలూరు గ్రామంలో గుండ్రా సీతారామిరెడ్డి, రంగమ్మ దంపతుల రెండవ సంతానం సతీష్‌రెడ్డి. ఓ సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన సతీష్‌రెడ్డి ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తే అద్భుతాలు ఆవిష్కృతమవుతాయని నిజం చేసి చూపారు. మహిమలూరులోని ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుంచి పదవ తరగతి వరకు చదివారు. అనంతరం నెల్లూరులోని వీఆర్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేశారు. ఆ తర్వాత అనంతపురం జేఎన్‌టీయులో ఇంజనీరింగ్ చేరి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ కోర్సును పూర్తి చేశారు. జేఎన్‌టీయూలో ఎంఎస్ పట్టా పుచ్చుకున్న సతీష్‌రెడ్డి 1985కు ముందు మూడు నెలలపాటు ప్రకాశం జిల్లా ఖమ్మం పాలిటెక్నిక్ కాలేజీలో లెక్చరర్‌గా పని చేశారు. 1985లో డీఆర్‌డీవోలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అంచెలంచెలుగా ఎదుగుతూ 2013లో ఆర్‌సీఐ డైరెక్టర్‌గా నియమితులై నేవిగేషన్, ఏవియానిక్స్ పరిజ్ఞానాల్లో నిపుణులుగా రాణించారు. ఆర్‌సీఐ సంచాలకులుగా బాధ్యతలు చేపట్టిన అనంతరం పృథ్వీ, ఆకాశ్, అస్త్ర, బ్రహ్మోస్, ధనుస్, నిర్భయ్, నాగ్, హెలీనా, అగ్ని1, 2, 3, 4, 5, వంటి క్షిపణుల్లోని ముఖ్యవ్యవస్థల అభివృద్ధికి నేతృత్వం వహించిన ఘనత సతీష్ రెడ్డికే దక్కింది. ఉపగ్రహ ఆధారిత దిక్సూచీ గ్రహాలు, హైబ్రిడ్ నేవిగేషన్, తదితర వ్యవస్థల అభివృద్ధిలో తనవంతు ప్రాత పోషించారు.

● అందుకున్న సత్కారాలు

ఈ క్రమంలో సతీష్‌రెడ్డి ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన ఇండియన్ సైన్సు కాంగ్రెస్ అసోసియేషన్ హోమీ జెబాబా స్మారక అవార్డు, డీఆర్‌డీవో యువశాస్త్రవేత్త పురస్కారంతోపాటు పలు అవార్డులను అందించింది. 2017లో ఉగాదిని పురస్కరించుకుని సైన్సురంగంలో ఏరోస్పేస్ సైంటిస్ట్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించిన కళారత్నం పురస్కారం అందుకున్నారు. డీఆర్డీఏ చైర్మన్‌గా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. కేంద్రంలో ప్రతిష్టాత్మకమైన రక్షణ శాఖ సలహాదారుగా నియమితులయ్యారు. నూతనంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు చేపట్టనుండటంతో ఆయన స్వగ్రామమైన మహిమలూరులో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.



డీఎంహెచ్‌వో సుజాతకు వినతిపత్రం ఇస్తున్న ఆశా నాయకులు

ఆశా కార్యకర్తలను రెగ్యులర్ చేయాలి

● డీఎంహెచ్‌వోకు ఆశావర్కర్స్ యూనియన్ వినతి

నెల్లూరు(వైద్యం), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు ఆరోగ్యసేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం ఇవ్వాలని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ నేతలు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. అనంతరం యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేల ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం స్కీం ఏర్పడి 20 ఏళ్లు పూర్తయినా వీరికి కనీస వేతనం ఇవ్వకపోవడం సరికాదన్నారు. అనారోగ్యంతో అనేక మంది ఆశాలు చనిపోయారని, ఈ నేపథ్యంలో వారికి గ్రూప్ ఇన్సూరెన్స్ చేయాలని డిమాండ్ చేశారు. ఏడేళ్లలో కేంద్ర ప్రభుత్వం ఆశాలకు కేవలం రూ.1000 మాత్రమే పెంచిందన్నారు. ఆశావర్కర్స్‌ను రెగ్యులర్ చేసి కమ్యూనిటీ వర్కర్లుగా గుర్తించాలని కోరారు. దేశమంతా ఒకే పని విధానం ఉండాలని, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి మధుసూదన, కళ్యాణి, వాణి, జీవా, సునీత, గీత, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు 256 మంది గైర్హాజరు

నెల్లూరు(విద్య), మార్చి 21(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో శుక్రవారం ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 174 కేంద్రాల్లో జనరల్ విద్యార్థులు 28,533 మంది, ప్రైవేట్ విద్యార్థులు 56 మంది కలిపి 28,589 మంది హాజరు కావాల్సి ఉండగా జనరల్ విద్యార్థులు 230, ప్రైవేట్ విద్యార్థులు 26 మందితో కలిపి 256 మంది గైర్హాజరు జనరల్ విద్యార్థులు 28,303, ప్రైవేట్ విద్యార్థులు 30 మంది కలిపి 28,333 మంది హాజరయ్యారు. జిల్లా అబ్జర్వర్ రవీంద్రనాథ్‌రెడ్డి 6, డీఈవో బాలాజీరావు 6, ఫ్లైయింగ్ స్క్వాడ్ 59 కేంద్రాలతో కలిపి 71 పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.